# కృతజ్ఞతలు

శ్రీ సాయి బాబా అభయ సూత్రాలలో అతి ముఖ్యమైనది **'ఎవరైతే ఎల్లవేళలా నా నామాన్నే స్మరిస్తారో, నా సేవలోనే సంతోషాన్ని చవిచూస్తారో, నా కర్పించకుండా ఏమీ భుజించరో అట్టి వారు నాకత్యంత ఆప్తులు, వారి హృదయమే నా నివాసం, వారు నా అంతటి వారు"** అన్న సంగతి మనకందరికి విదితమే. కలియుగంలో కల్పతరువు కన్నా, కామధేనువు కన్నా మిన్న, సద్గురువులకే సద్గురువు మన బాబా. అట్టి సాయి బాబాని నాల్గున్నర దశాబ్దాలు నిస్వార్థంగా, త్రికరణ శుద్ధిగా సేవించి తరించి సాయి చరణ సన్నిధికి చేరుకున్న పుణ్యమూర్తి శ్రీ శివనేశన్ స్వామిజీ. బాబా మహాసమాధి చెందిన తరువాత స్వామిజీ వంటి నిస్వార్థ సేవా తత్పరులు లేరంటే అతిశయోక్తి కాదు. ఈ పుణ్యచరితుని జీవిత చరితము సంకలనం చేయు అదృష్టమును నాకు ప్రసాదించిన సాయినాథుని చరణారవిందములకు అనంతకోటి ప్రణామాలు.

నాకు జన్మ నొసంగిన తల్లిదండ్రులకు, బాల్యమునందే మాతాపితలను కోల్పోయిన నన్ను తన అక్కున జేర్చుకొని పెంచి పెద్ద చేసి సమాజంలో నాకొక ఉన్నత స్థాయిని కల్పించి, నేటికిని నన్ను ఆదరాభిమానములతో ఆదరించుచున్న నా పినతండ్రి శ్రీ మున్నలూరి నరశింహరావు గార్కి నా హృదయ పూర్వక కృతజ్ఞతాభి వందనములు.

స్వామిజీ జీవిత విశేషాలను ఎంతో ప్రయాసతో సేకరించి నే కోరిన తక్షణమే తమ అమూల్య సమయాన్ని కేటాయించి నాకు వివరించి ప్రచురించుటకు అనుమతి నొసంగిన శ్రీమతి జరీనా తారాపూర్ వాల, ఫౌండర్, మెహర్-ధన్ ట్రస్టు, ముంబాయి గార్కి నా కృతజ్ఞతాభి వందనములు.

స్వామిజీ భక్తుడు, శ్రీ కె. సుబ్రహ్మణ్యం (మణి) మరియు శ్రీ పి.యస్. రావు, మాజీ మేనేజర్, ఆచార్య ఎక్కిరాల భరద్వాజ బుక్‌స్టాల్, షిరిడీ, నన్ను ప్రోత్సహించి వారి అనుభవములు తెలియ చేసినందులకు వారికి నా ప్రత్యేక అభివాదములు.

ఎప్పటికప్పుడు నాకు తగిన సలహాల నొసంగి ప్రోత్సహించిన మా సత్సంగ సభ్యులకు నా ప్రత్యేక ధన్యవాదములు.





నేను కోరిన వెంటనే తమ, తమ అనుభవములను నాకు పంపి వాటిని ప్రచురించుటకు అనుమతించిన స్వామిజీ భక్తులందరికీ నా కృతజ్ఞతాభి వందనములు. ఈ గ్రంథ రచనలో నాకు అనేక విధముల సహకరించి, ప్రోత్సహించి అఖండ సాయి నామ సప్తాహ సమితి, కృపా కాంప్లెక్స్, ఆనంద్‌బాగ్, హైదరాబాద్ వారికి నా కృతజ్ఞతాభి వందనములు.

రెండవ ముద్రణను ప్రచురించుటకు ముందుకు వచ్చుటయే గాక నేను కోరిన వెంటనే 'ముందు మాట' ను కూడా వ్రాసి ఈ గ్రంథమునకు మరింత వన్నె తెచ్చిన సాయి బంధువు శ్రీ పెసల సుబ్బరామయ్య గారు, గొలగలమూడి, నెల్లూరు జిల్లా, గార్కి నా హృదయ పూర్వక అభివాదములు.

నే కోరిన తక్షణమే వారి 'అభిప్రాయము' ను వ్రాసి పంపిన శ్రీ యం.పి. సాయినాథ్, హైదరాబాద్, గారికి నా నమస్సుమాంజలి.

నా సోదరుని కుమారుడు నాకు పుత్ర సమానుడైన చి. రాము, (M.S.R. Graphics, మచిలీపట్నం) తనకు సమయము లేకున్నను రాత్రులందు పనిచేసి, డి.టి.పి. మరియు కవర్ పేజీలను అతి సుందరముగా అత్యంత తక్కువ సమయంలో చేసినందుకు నా శుభాశీస్సులు.

మొదటి ప్రచురణకు ఈ ప్రచురణలోను కొన్ని మార్పులు, చేర్పులు చేయుట జరిగినది. దీనికి రెండు కారణములు కాగా అందు మొదటిది ఆ నాడు అతి తక్కువ సమయంలో ముద్రించుట కాగ రెండవది సమాచార లోపం. చదువరులు దీనిని గమనించ గలరు.

భాషా పరిజ్ఞానము లేని నేను సాయి బాబా మరియు పూజ్య శ్రీ శివనేశన్ స్వామిజీ ఆశీస్సులతో ఈ పవిత్ర గ్రంథాన్ని మీకందిస్తున్నాను. ఇందులో తప్పులుంటే అవి నావి ఒప్పులుంటే ఆ ఘనత సాయినాథునికి దక్కుతుంది.

ఎందరో సాయి భక్తులు రెండవ ముద్రణకు నన్ను ప్రోత్సహించిరి. అందరికి నా వందనములు.

ఈ గ్రంథము పై, మీ, మీ, అభిప్రాయములను నాకు తెలియజేసి నన్నాశీర్వదించ గలరని ప్రార్థిస్తూ...

భవదీయుడు
**బోస్**

# ప్రకాశకుల మనవి

ఏ మహనీయుని జీవిత చరిత్ర చూచినా సర్వజీవులను వారు తమ గురు రూపంగా దర్శించి ఉత్కృష్ఠమైన ప్రేమ భావమే ఆధ్యాత్మిక పురోభి వృద్ధికి పునాది యని అన్ని శాస్త్రాలు, అందరు మహనీయులు తమ ఆచరణతో మనకు బోధించినా మానవాళిలో ఎక్కువ మంది అట్టి పవిత్ర ఆచరణ అలవరచుకోలేకుండా ఉన్నారు. అందుకు కారణము అజ్ఞానమే. ఈ అజ్ఞానము వలన ఆశకు గురి అవుతూ నేను, నా వారూ, నాది అనే భావాలకి గురి అవుతున్నాము. ఇవన్నీ సద్గురు కృపవల్లనే దూరమవుతాయని, అట్టి సద్గురు సమాశ్రయానికి మన పుణ్యమే కారణమని ఇంకెంతో పుణ్యము లేనిదే వారి సంపూర్ణ కృప పొందలేమని పూజ్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారు గారు చెప్పిన మాట అక్షర సత్యము. అట్టి పుణ్యమార్జించుటకు సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవే సాటిలేని సాధనాలని భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి (గొలగలమూడి) వారి బోధ.

ఈ సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవలను ఎంతో గొప్పగా అచరించి మానవ కక్ష్యను దాటి దైవమైన మహనీయుడే శ్రీ శివనేశన్ స్వామి వారు.

ఈ మహనీయునితో అతి స్వల్పమైన పరిచయము గాని, వారి దివ్యచరిత్ర చదివే భాగ్యము గానీ అనంత కరుణా మూర్తి యైన పూజ్య గురుదేవులైన శ్రీ భరద్వాజ మాష్టారు గారి కరుణ వల్లనే జరిగింది.

## వారి సత్య నిరతి:

శ్రీ శివనేశన్ స్వామి వారు వారి గురువు గారి రూములో ఉండే రోజులలో, గురువు గారు వారి స్వగ్రామానికి వెళుతూ రూములో ఉండే ఆహార పదార్ధాలు వాడుకోమని చెప్పలేదట. ఆరు మాసముల వరకు గురువు గారు రాలేదు. ఈ కాలంలో వారు దిన పస్తులుండి చిక్కి శల్యమైనారట. విషయం తెలుసుకున్న గురువు గారు "నీవు నమ్మిన ఈ సిద్ధాంతాన్ని ఏ నాడు విడువకు అదే నీకు శ్రీరామ రక్ష" అన్నారు.





## వారి ధర్మ నిరతి :

సర్వ జీవులూ వారికి గురు రూపాలే. ఆపదలో అవసరమైతే వారి అభ్యర్ధన లేకుండానే సహాయం చేసేవారు. ఉదాహరణకు, నేనూ, నా కుటుంబము షిరిడీలో ఉన్నాము. నేనైనా రెండు నిమిషాలు వారితో మాట్లాడాను గానీ, నా కుమార్తె వారికి తెలియనే తెలియదు. ఒక అంగడి దగ్గర లెక్కలో తేడా వచ్చి మా అమ్మాయి తెలుగులో అరుస్తుంది. అంగడతను మరాఠీలో అరుస్తాడు. శ్రీ శివనేశన్ స్వామి వారు ఈ రచ్చ విని అక్కడకు వచ్చి ఆమెకు డబ్బులిచ్చి పంపమని ఆజ్ఞాపించారు. నా కుమార్తె 10 సంవత్సరాల బిడ్డ. ఎంత ఆనంద కలిగిందో చెప్పలేను. ఆమె కోరకున్నా మాట సహాయం చేస్తున్నారు. అదే ధర్మమంటే – ఆచరణంటే.

## సాధారణత్వం :

వారి ద్వారా శ్రీ సాయినాథుడే పలుకు చున్నారని వచ్చిన భక్తులు ధర్మ కార్యాలకు వినియోగించమని లక్షల రూపాయలు శ్రీ స్వామిగారి చేతికిచ్చినా వారేనాడు తన కొరకు డబ్బు దాచుకొనే వారు కాదు. ఏదో ధర్మ కార్యాలకు వినియోగించే వారు. "ఇంత మంది భక్తులు నన్ను ఇంత గొప్పగా గౌరవిస్తున్నారు, లక్షల డబ్బిస్తున్నారు నాలో ఏదో గొప్పతనము చోటు చేసుకుంది"అని ఏనాడు అహంకరించి ఎరుగరు. వారి వినయము, నమ్రత చూడ వలసినదే గాని వ్రాసేందుకు నాకు చేతగాదు. "నేను సాయి సేవకుడను" అనే భావం స్వామిజీ నరనరాల్లో జీర్ణించుకుంది.

శ్రీ స్వామి వారి చేతికి వేల రూపాయలు వస్తున్నాయని, దాన్ని దాచి ఉంచుకుంటున్నాడని, శ్రీ సాయి సంస్థాన్ వారు కొందరు C.I.D. ఆఫీసర్లను పంపారు. వారు దౌర్జన్యంగా శ్రీ స్వామి వారి రూములోకి ప్రవేసించి నీ రూము శోదా చేయాలన్నారు. చేసుకోమని శ్రీ స్వామి వారు రూము బయట నిలబడ్డారు. పుస్తకాలలో తనకొచ్చిన డబ్బు దాచి ఉంటాడని అన్ని పుస్తకాలు చిందర వందరగా గిరాటుకొట్టి రూమంతా వెతికి వెళ్ళి పోయారు. వాళ్ళకేమి కనబడలేదు. ఈ సమయంలో శ్రీ భరద్వాజ మాష్టారు అక్కడే ఉన్నారు. "భరద్వాజ్ సాయి రక్షిస్తారంటే ఇందుకు సాక్ష్యము ఈ సన్నివేశమే. ఈ పుస్తకంలో చూడు అని 100 రూపాయల నోట్లు చూపించారు" కనీసం 20 నోట్లు ఉంటాయి. అవి C.I.D. ఆఫీసర్లకు కనిపించలేదు. శ్రీ సాయి ఎడల సంపూర్ణ విశ్వాసంతో

ఉన్నందున అంత డబ్బు పుస్తకంలో ఉన్నా వారు శోదా చేసేటప్పుడు అవి దొరుకుతాయేమోనని ఏమి కంగారు పడలేదట. "ఆయన రక్షించాలంటే రక్షిస్తాడు. వారు శిక్షించాలంటే తప్పుకోవడం మన ప్రయత్నంతో వీలౌతుందా?" అన్నారు శ్రీ శివనేశన్ స్వామి వారు. అదే వారి విశ్వాసమునకు గీటు రాయి.

## సద్గురు సేవ:

వారి గురువుగారైన సాయినాథులు విశ్వరూపులనే ఏమరుపాటు లేని ఎరుకతో సర్వ జీవులకూ తన సేవనందించే వారు. సమాధి మందిరానికి వచ్చిన పూల మాలలన్నీ చావడి దగ్గర తెచ్చివేస్తే వాటిని విప్పి వాటిలోని దారాలను తొలగించి గోవులకు ఆహారంగా ఆ పూలను సమర్పంచేవారు శ్రీ శివనేశన్ స్వామి గారు. ఆ గోవుల్లో వారికి సాయినాథులే దర్శనమయ్యేది.

ఏ విధంగా చూచినా వారి ఆచరణ మనందరికీ ఆదర్శప్రాయమై నిలచింది. ఇట్టి మహనీయుని చరిత్ర పఠించి వారి నుండి మనం కొంచెం నేర్చుకుని ఆచరించినా సఫలమౌతాము.

శ్రీ భరద్వాజ మాష్టారు గారు హమేషా చెప్పిన ఒక ఉదాహరణ చెప్పి సెలవు తీసుకుంటాను. బాబా దర్శనం కావాలంటే, ఆ నాడు ఇప్పుడున్నంత విరివిగా బస్సులు, ఆటోలు, రైళ్ళు లేవు. గూడు బండ్లలో, గుఱ్ఱపు బండ్లలో రోజంతా ప్రయాణం చేసి అనేక చోట్ల దారి తప్పి ప్రయాణం చేసిన భక్తులు ఏ అర్ధరాత్రో సాయిని చేరేవారు. అందరూ గాఢంగా నిద్రించే ఆ సమయంలో శ్రీ సాయి ఎద్దుల గంటల శబ్దం విని లాంతరు చేత బట్టుకొని చావడి, మసీదు బయట కొచ్చి "కౌన్ రే" అని వారిని ఆప్యాయంగా పలకరించి వారిని రాధా కృష్ణమాయి వద్దకు వెళ్ళి ఆహారం తీసుకోమనే వారు. నేటి నకిలీ సాధువులకు గాని గొప్ప సాధకులమని విర్రవీగే వారికి గాని ఇట్టి నిస్వార్థమైన ప్రేమ ఉందా అని చూచుకుంటే తరిస్తాము. ఇట్టి సద్గుణరాసి యొక్క ఆచరణ కొరకే మనం ఈ గ్రంథాన్ని నిత్యం పారాయణ చేయాలి, తరించాలి.

## భరద్వాజ మాష్టారు చెప్పిన విషయాలు:

శ్రీ శివనేశన్ స్వామి వారు షిరిడీ వచ్చిన క్రొత్తలో మంచి యవ్వనంలో ఉన్నారు. పహిల్వానులా ఉండేవారు. ఆకలైనప్పుడు బిచ్చగాళ్ళకు భక్తులిచ్చే రొట్టె దొరుకుతుందని స్వామిజీ బిచ్చగాళ్ళ వరుసన కూర్చుంటే – "దిట్టంగా దుండు ముక్కలాగా ఉన్నావే పని చేసుకొని బ్రతకకుండా బిచ్చ మెత్తుకుంటావేమి?





లెయ్ లెయ్" అని తరిమేసే వారట. ఒక్కొక్క సారి దెబ్బలు కూడా తగిలించే వారట. "నీ లాంటి సోంబేరులకు, దొంగలకు ఇక్కడ స్థానం లేదు షిరిడీ నుండి వెళ్ళిపొమ్మన్నారట. అప్పుడే వారు షిరిడీ వదలి పోవాలని నడుస్తుంటే అలసటవల్ల తాను విశ్రాంతి తీసుకునే చెట్టు కొమ్మలకు వ్రేటాడుచున్న శ్రీ సాయి చిత్ర పటం దర్శనమై తిరిగి షిరిడీ చేరుతారు. తనను ఈ పవిత్ర భూమిని వదలకుండా, గురువాజ్ఞ దాటకుండా చేసిన ఆ చెట్టు, ఆ చిత్ర పటాన్ని మరొక్క సారి దర్శించాలని తెల్లవారి వస్తే ఆ ప్రాంతములో ఎక్కడా అలాంటి చెట్టే లేదు.

ఈ సన్నివేశంలో నేనైతే (పె.సు.) జీవితంలో ఇక ఎప్పుడూ షిరిడీ ఛాయలకే వెళ్ళే వాణ్ణికాదు. ఎందుకు? శ్రీ సాయి నాథుడే వారికి స్వప్నాదేశమిచ్చి షిరిడీ రమ్మనమని మరలా మరలా ఆదేశించారు. తీరా వచ్చాక అన్నానికి మాడుస్తూ, దెబ్బలు తగిలిస్తూ, మాటలతో పొడుస్తూ ఉన్నారే. నా స్వప్నాదేశాలతో నేను పొరపాటు పడ్డాను. వారి పిలుపే ఉంటే నన్ను ఇలాంటి బాధలకు గురిచేయరు గదా అని షిరిడీ విడచి వెళ్ళే వాడిని.

మేలిమి బంగారు వంటి వారు శ్రీ స్వామివారు. ఆ బంగారు వస్తువు కంటుకున్న కొద్దిపాటి మలినాన్ని ఈ దెబ్బలు, ధూషణలు, పస్తుల ద్వారా తొలగించి తన కొంగున దాచుకుంటున్నారు శ్రీ సాయి.

ఈ పవిత్ర గ్రంథాన్ని ఆత్మ వికాశానికై, దైవ కృప పొందవలెనని హృదయ పూర్వకంగా కొరే వారందరూ తప్పక చదివి, ఆయా కష్టాలు, బాధలు ఎలా శ్రీ స్వామి వారు ఎదుర్కొన్నారో తెలుసుకొని ఆచరించే ప్రయత్నం చేయగలము. ఆచరించగలమా అనే సంశయము అక్కరలేదు. హృదయ పూర్వకమైన ప్రయత్నం చేయడమే కావాలి. ఈ జన్మకు ఆచరించినా ఆచరించలేక పోయినా బాధలేదంటారు శ్రీ మాష్టారు. అయ్యో పలానా విషయాలు ఆచరించలేక పోయానే అనే తపనతో మరణించినా మరు జన్మలో ఆ తపనతోనే జన్మిస్తామని చెపుతారు శ్రీ మాష్టారు. నిత్య సత్‌సంగాలతో ఈ లోపాలు మనలో ఉన్నాయి. వాటిని, పోగొట్టుకోవాలి అనే తపన మనలో క్రొత్త సంస్కారంగా ఏర్పడుతుంది. "భూమిలో నాటిన రెండు గుంజలున్నాయి ప్రతి రోజు ఒక దాన్ని కొంచెం కదిలించి పెరికే ప్రయత్నం చేస్తుంటే అది ఆ రోజు కాకున్నా ఎప్పుడో ఒకప్పుడు సద్గురు కృపచే తొలగించ బడును. అసలు కదలించని

గుంజ ఎప్పటికీ రాదుగదా!" అన్నారు శ్రీ మాష్టారు.

జీవితంలో సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ సాధించాలని కృషిచేసే వారందరికీ ఎలాంటి ఎదురు దెబ్బలు తగులుతుంటాయి, వాటి తాకిడికి ఎలా తట్టుకోవాలి, భగవంతుడు మన కర్మ, ఋణానుబంధాలు క్షాళన చేసి మనలను ఎంత గొప్ప స్థితికి తీసుకు పోతారో తెలిపేదే ఈ పవిత్ర గ్రంథం.

శ్రీ భరద్వాజ మాష్టారు గారు పాకలపాటి గురువు గారి చరిత్రలో "ఎంతో పుణ్యముంటే కాని సద్గురు సమాశ్రయము లభించదు. మరింకెంతో పుణ్య ముంటేనే గాని వారి సంపూర్ణ అనుగ్రహము పొందలేము" అని చెపుతారు. దీనినే సాయినాథుడు ఒక భక్తునితో నీ పూర్వపుణ్యము గట్టిది గనుక ఇక్కడకి రాగలిగావు అంటారు. పుణ్యములో గట్టి పుణ్యము, మాదిరి పుణ్యము, తరక పుణ్యము ఉంటాయని సాయినాథులే సెలవిచ్చారు.

ఉదాహరణకు మన బిడ్డలు అన్నం తిన్న ప్లేటు కడిగి ఆ మెతుకులు పారబోశాము. ఆ మెతుకులలో మన కష్టముంది. ఆ మెతుకులు ఒక ప్రాణి తిన్నా కొంత పుణ్యం స్వల్పంగానైనా మనకొస్తుంది. అలా కాకుండా ఏ ప్రాణులైనా తింటాయనే భావముతో ఒక బండ మీద పోశాము. భావన మారింది కనుక మరికొంత మాదిరి పుణ్యం జమ చేసుకుంటాము. అలాకాదు మనం పోసే మెతుకులు ఇతర జీవులలో ఉండే పరమాత్మకే సమర్పిస్తున్నామనే భావనతో బండ కడిగి అక్కడ పోసి స్వీకరించండి ప్రభు అని నమస్కరిస్తున్నాము. ఇంతకు ముందుకంటే ఇంకొంత భావము మార్పు ఉంది గనుక గట్టి పుణ్యమైంది.

ఎలా చూచినా పుణ్యమే మనలను గట్టెక్కిస్తుంది గనుక పుణ్యా మార్జించడమే మన కర్తవ్యము. అదే మనలను గమ్యం చేరుస్తుంది. అందుకే పెద్దలు ఏమి తెలియని వారికి కూడా పుణ్యమార్జించే విధంగా మన జీవిత విధానం ఏర్పరచారు.

**పెసల సుబ్బరామయ్య**
ప్రకాశకులు





**యం.పి. సాయినాథ్**
హైదరాబాద్
E-mail : mpsainath@yahoo.co.in ఫోన్ :040-27534805

# అభిప్రాయము

నాడైనా, నేడైనా సాయి బాబా సందర్శకులు గొప్ప భక్తులుగా మారవచ్చును. సాయి మందిరాలు నిర్మించవచ్చును. గొప్ప రచయితగా పేరు పొంద వచ్చును. కానీ, సాయినాథుడు నిర్దేశించిన సూత్రాలు జీవితాంతం పాటించి, కట్టుగుడ్డలు, సాయి సేవ తప్ప వేరే ఆస్తి పాస్తులు ఎరుగని ఒక సామాన్య వ్యక్తి ఒక సద్గురువుగా మారటం శ్రీ శివనేశన్ స్వామికి మాత్రమే చెల్లింది. ఆ భ్రమరకీట న్యాయాన్ని మన కన్నుల ముందుంచారు శ్రీ బోస్ గారు.

మనకు సాయి బాబాయే గమ్యం. సాయినాథుని జీవన శైలియే మన మార్గం. ఆ మార్గంలో పయనించి గమ్యం చేరిన శ్రీ స్వామి మనకు మార్గదర్శకుడు, తోడు, నీడ.

మహల్సాపతి నిర్వ్యామోహత్వాన్ని,
రాధాకృష్ణమాయి సేవ తత్పరతను,
యస్.బి. ధుమాల్ అచంచల విశ్వాసాన్ని,
బయాజాబాయి సోదర ప్రేమను,
దాసగణు భజనా ప్రాభవాన్ని,
కాకా సాహెబ్ సద్గ్రంథ పఠనా పాటవాన్ని,
సావిత్రి, రఘునాథుల సాయి సాహిత్య ప్రేమను,
బి.వి. నరసింహ స్వామి సాయి ప్రచారాన్ని,
సాయిపదానంద నిర్మలత్వాన్ని,
సాయి శరణానంద సాయి తత్వ పరిజ్ఞానాన్ని,
మేళవిస్తే, కొంత వరకు శ్రీ శివనేశన్ స్వామి గుణగణాలు తెలుస్తాయి.

బూటీలాగా సాయి మందిరాన్ని కట్టించలేదు, కానీ స్వామిజీ అనేక సాయి మందిర నిర్మాణాలకు ప్రేరణ, ఆదరణ అయ్యారు.

హేమాద్‌పంత్ లాగా సాయి సచ్చరిత్ర రచన చేయలేదు కానీ, సాయి బాబా సాహిత్యానికి స్వామిజీ అంతర్గత సరస్వతీవాణిని అయ్యారు.

స్వామిజీ సాయి బాబా మహాసమాధి ముందు జన్మించక పోవటం మన అదృష్టమే. అలనాటి సాయి భక్తులను గూర్చి ఈ నాటికీ తెలిసినది అంతంత మాత్రమే. స్వామిజీ ఇటీవలి కాలం వారవటం వలననే, స్వామిజీని గూర్చి కొంత తెలుసుకునే అవకాశం కల్గింది. స్వామిజీపై ప్రామాణిక రచన చేయాలనే సంకల్పం కలగటం, అది కార్యరూపం దాల్చటం, ఆ రచన ఈనాడు మనకు లభ్యం కావటం శ్రీ బోస్ గారి పూర్వ జన్మ సుకృతము. అంతే కాదు మనలాంటి వారి అదృష్టం కూడాను.

శ్రీ బోస్ గారి రచనలో ఎక్కడైనా పొరపాటు దొర్లదా అని ఆలోచించగా, ఒకటి దొరకింది. అదేమిటంటే, రోజుకో పారాయణ గ్రంథం విడుదల అవుతున్న ఈ కాలంలో, శ్రీ బోస్ గారు శ్రీ స్వామిజీ జీవిత గ్రంథాన్ని పారాయణ గ్రంథం అని తెలుపక పోవటమే!

ముందు ముందు రాబోయే ఎడిషన్లలో సవరించ వచ్చు. అందుకు శ్రీ శివనేశన్ స్వామిజీ అంగీకరిస్తారో లేదో!

ఏమైనా మనం మాత్రం శ్రీ స్వామిజీ జీవిత చరిత్రను పఠిద్దాం, పారాయణ చేసి శ్రీ స్వామిజీని అనుసరిద్దాం. వారు తోడు, నీడై వుండగా మనకు ఇంకేమి కావాలి? ఇక మన గమ్యం ఎంతో దూరంలో వుండదు.

**యం.పి. సాయినాథ్**





# సాయి సేవక్
# శ్రీ శివనేశన్ స్వామిజీ జీవిత చరితము

సకల దేవతా స్వరూపి సాయినాథుని, **"మీ భారములు నా పై బడవేయుడు, నేను మోసెదను"** అన్న అభయాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మి, నన్ను నిమిత్త మాత్రునిగా చేసి తన అకుంఠిత భక్తుని చరితమును తానే నిర్విఘ్నముగా పూర్తి చేయించ వలెనని పరమ పావన మైన సాయి చరణార విందములకు అనంత కోటి ప్రణామములర్పించుచు ఈ గ్రంథానికి శ్రీకారము చుడుతున్నాను.

## స్వామిజీ జననము :

అలనాటి మద్రాసు రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామిక నగరం కోయంబత్తూరులోని రత్నషేగపల్లి యందు గల పుణ్యదంపతులైన శ్రీ కాళప్ప నాయక్కర్ ముత్తయ్య, శ్రీమతి అలమేరుల మూడవ మరియు చివరి సంతానమే మన పూజ్య శివనేశన్ స్వామిజీ. బాబాకు అత్యంత ప్రీతికరమైన పవిత్ర శ్రీరామ నవమి, బాబా మహాసమాధి చెందిన మంగళవారం, బాబా మహాసమాధి చెందిన ఎనిమిది సంవత్సరాలకు అంటే 1927 సం॥ ఏప్రిల్ మాసం 12వ తేదిన స్వామిజీ వారి మాతామహుల స్వగ్రామమైన నాయక్కర్ పాళాయం అను గ్రామమునందు జన్మించెను. నాయక్కర్ పాళాయమును పూర్వము తిరుమల నాయక్కర్ అనే రాజు పాలించేవాడు. స్వామిజీకి రంగస్వామి, అంబుజం అనే సోదర, సోదరిలు గలరు. స్వామిజీ కుటుంబ సభ్యులందరూ భక్తి తత్పరులే. ఆలయములను దర్శించుట, పురాణ పఠనము గావించుట, సత్కార్యములు చేయుట వారి నిత్యకృత్యములు. ఆపదలో నున్న వారి నాదుకొనుచు గ్రామస్తులందరికి ఆదర్శ ప్రాయముగా నుండెడివారు.

కొంతమంది పుణ్యపురుషులు జననంతోనే దైవత్వాన్ని వెల్లడి చేస్తారు. శ్రీ దత్తావతారడైన శ్రీ నృసింహ సరస్వతి జననంతోనే 'ఓంకారము' నుచ్చరించి తమ దైవత్వాన్ని వెల్లడి చేసిన విషయం మనందరికి విదితమే.

శివనేశన్ స్వామిజీ జననంతోనే రెండు పళ్ళు మరియు బ్రహ్మ జ్ఞాన చిహ్నమైన పిలకతోనూ జన్మించి తాను సామాన్య మానవుడను కానని కారణ జన్ముడననియు తెలియ జెప్పిరి.

స్వామిజీ తల్లిదండ్రులు, మాతామహులందరు శివ భక్తులే. వీరికి శివారాధనన్న అత్యంత ప్రీతి. ఈశ్వరుడు వారింటి ఇలవేల్పగుటచే స్వామిజీకి 'శివనేశన్'యని నామకరణ మొనరించిరి. 'శివనేశన్' అనగా 'శివ భక్తుడు' లేక 'శివుని యందు ప్రేమ గలవాడ'ని యర్థము.

## స్వామిజీ బాల్యం:

స్వామిజీ బాల్యమంతయు అనేక చిత్ర విచిత్ర సంఘటనలతో కూడుకొని యున్నది. సామాన్యులకు ఈ సంఘటనలు విచిత్రములుగా అగుపించినను అవన్నియును స్వామిజీ యొక్క భవితను తెలిపెడి దివ్య సంఘటనలే.

స్వామిజీ బుడి, బుడి అడుగులు వేయుచు ముద్దులొలికే మాటలతో అందరిని అలరించు ప్రాయంలో ప్రతి నిత్యము పగటి పూట సోఫాలో నిదురించెడి వారు. స్వామిజీ నిదురించే సమయమున వారి గృహమున కత్యంత సమీపమున గల పాముల పుట్ట నుండి నాగ సర్పమొకటి స్వామిజీ చెంతకు చేరి శిరస్సు వైపున పడగ పట్టెడిది. పాము పడగ పడితే ఆ వ్యక్తి ఉన్నత శిఖరముల నధిరోహించునని మన ఇతిహాసములు వక్కాణించు చున్నవి. స్వామిజీ ఆధ్యాత్మికంగా అత్యున్నత శిఖరములనధిరోహించి ఇతిహాసములు సత్యేతరములు గావని నిరూపించెను. ఒక దినమున ఈ సంఘటనను గాంచిన స్వామిజీ నాయనమ్మ ఆ సర్పము స్వామిజీకి హాని చేయునన్న తలంపుతో ఆ పుట్టలో పొగ పెట్టించగా ఆ సర్పము అటుపిమ్మట మరెవ్వరికిని అగుపించలేదు.

స్వామిజీకి ఊహ బాగా వచ్చి మాటలు కూడ మాట్లాడు ప్రాయమున ఒక సాయం సంధ్యవేళ స్వామిజీ ఊయలలో నిదురించుచుండెను. యాధాలాపముగా అటు వచ్చిన స్వామిజీ నాయనమ్మ పసిపాపడేమి చేయుచున్నాడో నని ఊయలలోనికి తొంగి చూచినది. స్వామిజీ శరీరమందు కదలికలు లేకుండుట గమనించి అచ్చెరువొంది బాలుని చెంతకేగి నాడిని పరీక్షించెను. నాడి ఆగిపోవటం, శ్వాస బందింపబడి ఉండుట గమనించి పిల్లవానికేమైనదో నని భీతిల్లి ఇంటిలోని వారినే గాక చుట్టు ప్రక్కలవారిని కూడ పిలచెను. కొందరు వైద్యుని కొరకు పరుగులిడిరి. అందరు బాలుని పరీక్షించి మృతి నొందెనని నిర్ణయించిరి. బాలుని శరీరము నందు ఏ విధమైన మార్పులు లేకుండుట గమనించి అచ్చెరువొందిరి. అందరు అనేకనేక విధముల





చర్చించు కొనసాగిరి. అంతలోనే బాలుడు నిద్ర మేల్కాంచి అందరిని తేరిపార జూచి చిరునవ్వులు చిందించుచు వారందరు మాట్లాడు కొన్న మాటలను యథాతథముగా చెప్పెను. ఈ వింతను గాంచిన వారందరు "ఈ బాలుడు దైవాంశ సంభూతుడ"ని గ్రహించిరి. అత్యంత నిష్ఠాగరిష్టులైన యోగులు సహితం కొన్ని దశాబ్దాలు గురుముఖతా యోగ శిక్షణ పొందినా గానీ సమాధి స్థితి పొందలేని వారెందరో ఉండగా తప్పటడుగులు వేయు చిరుప్రాయములోనే స్వామిజీ సమాధి స్థితికి వెళ్ళారంటే అది తప్పక వారి పూర్వ జన్మ సుకృతమే గానీ మరియొకటి గాదు!

స్వామిజీకి బాల్యం నుంచి దైవచింతన, పూజా పునస్కారములు, దైవ సంకీర్తలందు మక్కువ ఎక్కువ. అందరి బాలుర వలే ఆట పాటలందు ఆసక్తి చూపేవారు గాదు. ఇంటిలో చిన్న పాపడగుటచే అందరును అతి గారాబముగా చూసేవారు. అందరు అతి గారాబంగా చూచినా గానీ స్వామిజీకి ఒక్క దురలవాటు కూడ అలవడకపోవటం ఒక విశేషమే. స్వామిజీ బాల్యం నుంచి శివుని అంత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధించి సార్థక నామధేయులని నిరూపించారు. స్వామిజీ ఇంటిలోని వారితో ప్రతినిత్యం దేవాలయానికేగి అక్కడ జరిగే అర్చన, భజన కార్యక్రమాలలో మనస్సు లగ్నంచేసి ఆ కార్యక్రమాలు ముగిసిన పిదపే ఇంటికి చేరేవారు. పాప పుణ్యాల ఫలితమేమిటో తెలియని పసి ప్రాయంలోనే భగవంతుని యందు భక్తి, శ్రద్ధలు కలుగుట పూర్వ జన్మ సుకృతమే కదా!

స్వామిజీ బాల్యం నుంచి ముక్తసరిగా గడిపే వారు. ఎవరెన్ని ప్రశ్నలు వేసినా క్లుప్తంగా ఒక్క మాటలో సమాధానమిచ్చేవారు. ఎక్కువ సమయం ఏకాంతంగా దేవతా మూర్తుల విగ్రహాలను, చిత్రపటాలను తదేకంగా చూస్తూ కాలం గడిపే వారు. ఒకొొక్కసారి ఆకలి దప్పులు కూడ మర్చిపోయి గంటల కొలది ధ్యానంలో గడిపేవారు. పదే పదే పిలచి పెడితే కొద్దిగా అన్నం తినే వారు లేకపోతే అదీ లేదు. రాత్రులందు అందరు నిదురించిన తురువాత భోజనం చేసేవారు. అంత చిరుప్రాయంలోనే ఆకలి దప్పులను అదుపులో ఉంచుకొని దైవ చింతనలో కాలం గడపటం దైవాంశ సంభూతులకు తప్ప అన్యులకు అసాధ్యం. స్వామిజీకి ఏడవ సంవత్సరములో అక్షరాభ్యాసం చేయించి పాఠశాలకు పంప నారంభించిరి వారి తల్లిదండ్రులు. పాఠశాల వాతావరణం,

సహవిద్యార్థుల ఆటపాటలు సహితం స్వామిజీకి గల సహజమైన మిత భాషిత్వాన్ని మార్చలేక పోయాయి. పాఠ్యాంశాలయందు శ్రద్ధ చూపుటచే మంచి విద్యార్థియని ఉపాధ్యాయులు మెచ్చుకొనెడి వారు. అప్పుడప్పుడు ఫుట్‌బాల్ మాత్రం ఆడే వారు. స్నేహితులతో కలసి సైకిల్ త్రొక్కటం నేర్చుకున్నారు. సైకిల్ త్రొక్కటానికి ఇష్టపడేవారు.

ఒక పర్యాయం స్వామిజీ తన స్నేహితులతో సైకిల్ మీద పొరుగు గ్రామానికి వెళ్ళి తిరిగి వస్తుండగా సైకిల్ చెడిపోయింది. ఆ గ్రామవాసి ఒకరు వాళ్ళందరికి భోజనం పెట్టి ఆ రాత్రి వారందరికి తన ఇంటనే బస నేర్పాటుచేసెను. పిల్లల తల్లిదండ్రులు కంగారు పడతారని తలంచి తన నౌకరు ద్వారా వారికి కబురు పంపి తెల్లవారిన తరువాత సైకిల్ బాగు చేయించి పిల్లలందరికి పాలు, ఉపాహారము నిచ్చి వారి గ్రామానికి పంపెను.

స్వామిజీ ఈ సంఘటనను తమ మహాసమాధి వరకు మరువలేదు. ఆ మహామనిషి చేసిన ఉపకారమును పదే పదే గుర్తు చేసుకొని "అప్పటి రోజులలో మానవుడు మానవతా ధర్మాలను తు.చ. తప్పక పాటించే వాడు, పరులకు సహాయపడటమే పరమావధని తలచేవాడు, కానీ ఈ రోజులలో మానవత్వపు విలువలే లేవని ప్రతి వ్యక్తి స్వార్థంతోనే జీవిస్తున్నాడని, ప్రక్క వారి గురించి పట్టించుకునే నాథుడే లేడ" ని మథన పడేవారు. ఈ సంఘటన స్వామిజీ జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసింది. స్వామిజీ ఏనాడు ఇతరులపై నాధారపడకపోగా ఇతరులకు తమ చేతనైన రీతిన సాయపడెడి వారు. కొన్ని సందర్భములలో తన శక్తికి మించి సాయమందించెడి వారు.

స్వామిజీ బాల్యంలోనే భక్త విజయము, భారత, భాగవత, రామాయణాది గ్రంథములను పఠించే వారు. స్వామిజీ ఇంటిలోని వారు వీటిని నిత్య పారాయణ గావించెడి వారు.

తరుచుగా వారి గృహానికి అతి సమీపమున గల శివానందాశ్రమానికి వెళ్ళేవారు. శ్రీ శివానంద స్వామిజీ మన స్వామికి గల దైవ భక్తిని గమనించి భారత, భాగవతాది గ్రంథాలను సులభ శైలిలో వివరించుటయే గాక సులభ పద్ధతిలో లెక్కలు చేయుట, చిన్న చిన్న ఫజిల్స్ నేర్పేవారు.

స్వామిజీ ఇంటికి సమీపమున గల ఒక గుహలో శిరిడీ సాయి బాబా రాతి మీద ఆశీనుడైన చిత్రపటముండెడిది. కొంతమంది ఆ పటానికి





నమస్కరించేవారు, మరి కొంతమంది పూజలు గావించెడి వారు. ఆ చిత్రపటము ఎవ్వరిదైనదీ తెలియక పోయినను మన స్వామిజీ ప్రతి నిత్యం బాబాను దర్శించుకొని మనస్ఫూర్తిగా ప్రణతులర్పించెడి వారు.

స్వామిజీ ఎనిమిదవ తరగతి వరకు చదువు కొనసాగించి, ఆ చదువు ఐహిక సుఖములకు తప్ప ఆధ్యాత్మికతకు ఏ మాత్రము ఉపయోగకారి కాదని గ్రహించి పాఠశాల విద్యకు స్వస్తి వచనాలు వల్లించినారు. కాని ఇంటిలోని వారి పోరు పడలేక 1941వ సంవత్సరములో మెట్రిక్ పరీక్ష వ్రాసెను. ఆ చదువు మీద శ్రద్ధలేని స్వామిజీ పరీక్షలో ఉత్తీర్ణులు కాలేక పోయారు.

## భుక్తి కొరకు :

భుక్తి లేనిదే ముక్తి లేదన్న సంగతి తెలుసుకున్న స్వామిజీ ఆ భుక్తి కొరకు తాను ఇతరులకు భారం కాకూడదన్న సంకల్పంతో ఉద్యోగాల వేట ప్రారంభించి అనేకనేక చిరుద్యోగాలు చేసెను.

జపాన్ దేశం మన దేశములోగల అతి పెద్ద నగరాలపై బాంబుల దాడి చేయుచున్న రోజులలో మద్రాసు రాష్ట్ర హైకోర్టు రికార్డు రూంని భద్రత కోసం మద్రాసు నుండి కోయంబత్తూరుకు తరలించగా స్వామిజీకి అందులో రికార్డు రూం అసిస్టెంటుగా తాత్కాలిక ఉద్యోగం లభించింది. యుద్ధ విరమణానంతరము రికార్డురూంని తిరిగి మద్రాసుకు మార్చటంతో స్వామిజీని ఉద్యోగం నుంచి తొలగించారు.

అటు పిమ్మట ఒక పుస్తకాల దుకాణంలో నెలకు రూ.5/- జీతం మీద పుస్తకాలనమ్మే పనిలో చేరారు. స్వామిజీ పుస్తకాలు చదవటంలో చూపిన శ్రద్ధ పుస్తకాలమ్మటంలో చూపకపోయే సరికి ఆ షాపు యజమాని స్వామిజీ ఉద్యోగానికి ఉద్వాసన పలికాడు. ఈ ఉద్యోగం చేస్తున్న సమయంలో జరిగిన ఒక సంఘటన స్వామిజీ జీవితం పై ఎంతో ప్రభావం చూపింది. స్వామిజీ పుస్తకాల షాపులో పని చేస్తున్న సమయంలో ఆ ప్రాంతమంతా భయంకరమైన ప్లేగు వ్యాధి వ్యాపించి అనేక ఎలుకలు, ఎంతో మంది మనుష్యులు మృతి నొందెను. స్వామిజీ పని చేస్తున్న దుకాణంలో ఒక ఎలుక ప్లేగు వ్యాధిచే మరణించెను. ఎవ్వరూ దాని దగ్గరకు పోవ సాహసించలేదు. ఆ ఎలుక వలన మరింత మంది ఆ వ్యాధి బారిన పడతారని తలంచి ఎందరు చెప్పినను వినక స్వామిజీ దానిని తీసుకు పోయి దహనం చేసెను. ఇతరుల కోసం తన

ప్రాణాలను సహితం ఫణంగా పెట్టిన స్వామిజీ పరోపకారం ఎంత ఉదాత్తమైనదో ఈ సంఘటన తెలియజేయు చున్నది. అదే రోజు సాయంకాలానికి స్వామిజీకి ప్లేగు సోకి విపరీతమైన జ్వరంతో నేత్రాలెరుపెక్కినవి. ఇది గాంచిన దుకాణదారు భయవిహ్వాలుడై కుటుంబ సమేతంగా అక్కడకు ఎంతో దూరముననున్న తన బంధువుల గ్రామానికి తరలి పోయెను. మూడు దినములు స్వామిజీ స్పృహ లేకుండా ఉండుట గాంచిన ఇరుగు పొరుగు వారు స్వామిజీ మరణం తథ్యమని తలచి ఆ ఛాయలకు పోతే వారికి కూడా అదే గతి పడుతుందని తలంచి ఎవ్వరునూ ఆ ఛాయలకు సహితము పోకుండిరి. పరోపకారమునకు పోయి తన ప్రాణముల మీదకే ముప్పు తెచ్చుకొనెనని నిందించిరి. అందరి ఊహలను తారుమారు చేయుచు నాల్గవ నాడు స్వామిజీ స్పృహలోనికి వచ్చి అటు పిమ్మట రెండు మూడు రోజులలోనే పూర్తి ఆరోగ్యవంతులాయెను. ప్రాణ భీతితో కుటుంబ సమేతముగా దూర ప్రాంతమున కేగిని యజమాని కుమారుడు మరణించగా పుట్టెడు పుత్రసోకంతో స్వగ్రామానికి తిరిగి వచ్చెను. ఈ సంఘటనతో స్వామిజీకి జనన మరణాలపై సరియైన అవగాహన కలిగి "దైవేచ్ఛ లేకుండా ఏమీ జరుగదు, మన లలాట లిఖితాన్ని ఎవ్వరూ మార్చలేరు, జన్మించిన ప్రతి ప్రాణి మరణించక తప్పదు, ఎంత దూరమేగినా మరణాన్ని దూరంగా ఉంచలేము" అన్న నిశ్చయ నిర్ణయానికి వచ్చి తమ దైవ చింతనను మరింత దృఢ భక్తితో కొనసాగించెను.

పుస్తకాల షాపులో ఉద్యోగం పోయిన తరువాత స్వామిజీ విద్యుచ్ఛక్తి కార్యాలయంలో హెల్పరుగా రోజువారి వేతనం మీద పనిచేయ సాగారు. ఉద్యోగరీత్యా స్వామిజీ గుంటలు త్రవ్వటం, స్తంభాలు పాతటం వంటి కష్టమైన పనులు చేయాలి. కానీ స్వామి చదువుకున్న వారవటం వల్లనూ, శరీర దారుఢ్యం లేనీ వారగుట వలననూ ఆయనకు పని వాళ్లకు కావలసిన సామానులు ఇచ్చి వాటి లెక్కలను వ్రాసే పని నప్పగించారు. పైఅధికారులు తనిఖీకి వచ్చినప్పుడు స్వామిజీ వంటి శరీర దారుఢ్యం లేని వారిని ఆ ఉద్యోగానికి ఎందుకు ఎంపిక చేసింది వివరించ వలసి వస్తుందని స్వామిజీని పై అధికారుల కళ్ళ పడకుండా దాచి పెట్టేవారు. కొన్ని సందర్భాలలో స్వామిజీని ఆఫీసు నుంచి దూరంగా పంపేవారు. స్వామిజీకి "Dignity of Labour" పై చక్కని సదవగాహనసుండుట వలన ధనిక కుటుంబమునకు చెందినను కూలి పని





చేయుటకు కూడ వెనుకంజ వేయలేదు. ఇంటిలోని వారు ఇటువంటి పనులు చేయుటకు అంగీకరించక పోయినను శ్రమజీవనంలో నున్న సంతృప్తిని వారికి వివరించి ఒప్పించెను.

ఈ ఉద్యోగం చేస్తున్న సమయంలోనే స్వామిజీకి మాతృ వియోగం సంభవించెను. ఈ జనన మరణాల విషయంలో సతమతమైన స్వామిజీ ఇంటిలోని వారికి చెప్పకుండా తమ స్వస్థలమైన కోయంబత్తూరుని విడచి బొంబాయి మహానగరం చేరారు. స్వామిజీ జీవితంలో ఇది రెండవ మలుపు.

స్వామిజీ 1944లో నౌకా సిబ్బంది సమ్మె జరిగే సమయంలో బొంబాయి మహానగరం చేరారు. నౌకాశ్రయంలో ఆంగ్లేయులకు ఎక్కువ వేతనాలు భారతీయులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నందు వల్ల ఆ అన్యాయాన్ని అడ్డుకోవటానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతీయ కార్మికులను సంఘటిత పరచి సమాన వేతనాలకై పోరాడవలసిందిగా వారిని సమ్మెలోకి దించారు. అగ్నికి ఆజ్యం పోసిన చందాన దీనికి తోడు బొంబాయి నగరం మత కలహాలతో అట్టుడికి పోతూంది. ఆ సమయంలో బోరిబందరు స్టేషన్‌లో రైలు దిగిన స్వామిజీ అక్కడ ఒక హిందూ యువకుడు అనేక ముసల్మానులతో తలబడుట గాంచి "ఏ మతంలోను ఇతర మతస్తులను ధూషించమని, అవమాన పరచమని చెప్పలేదు. మత సారాన్ని సరిగా అవగాహన చేసుకోలేని వారు, వారి స్వార్థానికి మరి కొందరు ఈ మతద్వేషాలను సృష్టించి మారణ హోమం సృష్టిస్తున్నార"ని తలంచి వికలిత మనస్సుతో దైవం పై భారం వేసి బొంబాయి మహానగరంలో కాలిడినారు.

ఆ మహానగరంలో బంధువులు గానీ పరిచయస్తులు గానీ లేక భాష తెలియక సతమతమవుతున్న స్వామిజీకి అదృష్టవశాత్తూ ఒక తమిళ ముసల్మానుతో స్నేహ మేర్పడింది. ఆ ముసల్మాను హిందువులను తన సోదరులవలె భావించెడి వాడు. మానవత్వమున్న మంచి మనిషి. అతను స్వామిజీ పరిస్థితికి జాలిపడి ఆశ్రయమిచ్చి భోజన వసతికూడ కల్పించాడు. బాల్యం నుంచి సర్వమత సమానత్వాన్ని మనసార నమ్మిన స్వామిజీ ఆ ముసల్మాను గృహంలో ఉండటానికి ఏ మాత్రం సంకోచించలేదు. ఆ పరిసర ప్రాంతమంతా ముస్లిములే అధికంగా ఉన్నా సర్వ ప్రాణులలో నున్న ఆత్మ ఒక్కటే ననియు, ఈ కులాలు, మతాలు మానవ సృష్టియే గాని భగవంతుని

సృష్టిలో అన్ని ప్రాణులు సమానమేనని యెరిగిన స్వామిజీ వారిలో ఒకరిగా కలసి మెలసి ఉండేవారు. స్వామిజీకి ఆశ్రయం కల్పించిన ముసల్మాను స్వామిజీ తన బాల్య స్నేహితుడని చెప్పగా వారంతా స్వామిజీ సౌమ్యతను గాంచి స్వామిజీని తమ ఆప్తునిగా చూసుకునేవారు. వారి మధ్య ఏ విధమైన భేదాభిప్రాయాలు తలెత్తలేదు. స్వామిజీకి ఆశ్రయం కల్పించి నతనికి బొంబాయి మున్సిపల్‌కు చీపురు కట్టలు సరఫరా చేసే కాంట్రాక్టు కలదు. కేరళ రాష్ట్రం నుంచి చీపురు పుల్లలను నావల ద్వారా బొంబాయికి తెప్పించి, కట్టలు కట్టి మున్సిపల్ వారికి సరఫరా చేసేవాడు. స్వామిజీ అతనికి భారం కాకుండా ఆశ్రయ మిచ్చిన వారికి ఋణపడి ఉండకూడదన్న ఉద్దేశ్యంతో చీపుళ్ళను కట్టే పనులలోనూ, వాటిని సరఫరా చేసి లెక్కలు వ్రాసే పనుల యందతనికి సహాయకారిగా ఉండేవారు. తాను అతనితోనే అతని గృహంలో నివసించటం అతనికి అసౌకర్యంగా ఉంటుందని భావించి అతని అనుమతితో శలవు తీసుకొని ఉద్యోగాన్వేషణ ప్రారంభించారు మన స్వామిజీ.

ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం దొరకక రోజుల తరబడి పస్తులుండేవారు. రాత్రి వేళల్లో నరసంచారం లేని ప్రదేశంలో చంద్రుడు చల్లని వెన్నెల కురిపించు వేళ, సంద్రము పైనుండి వచ్చు చిరుగాలులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అతి ప్రశాంతముగా పద్మాసనములో ధ్యానమగ్నుడైన స్వామిజీ చెంతకు ఆకలి దప్పులు సహితం దరి చేరెడివి కాదు. రాత్రంతయు భగవధ్యానములో గడిపిన స్వామిజీ ఉదయాన్నే స్నానమాచరించి మోమున విభూధి రేఖలు ధరించి, భగవంతుని భక్తితో ప్రార్ధించి ఉద్యోగాల వేటకై బయలు దేరెడి వారు.

స్వామిజీ పస్తులుండుట గమనించిన ఒక వ్యక్తి బీచ్ వద్ద ఒకతను రొట్టెలు పంచుతున్నాడని అక్కడకు వెళ్ళమని సలహా నిచ్చెను. స్వామిజీ ఆ ప్రదేశానికి వెళ్ళగానే రొట్టెలు పంచే ఫ్రాన్సిస్ డేవిడ్ స్వామి ముఖమున గల విభుధి రేఖలను గాంచి స్వామిజీ హిందువని గ్రహించి హిందువులను హిందూ మతమును కించపరుచుచు "పని చేసి సంపాదించుకోగల వయస్సులో ఎందుకు బిక్షమెత్తుతున్నావ?"ని హేళనగా ప్రశ్నించెను. అతని ధూషణములను లెక్క చేయక "నేను బిక్షమెత్తుటకు రాలేదు. మీరు ఎందరికో రొట్టెలు దానము చేయుచున్నారని తెలిసి మీ వంటి దయార్ధహృదయులు నాకేదైన పని





చూపించగలరన్న ఆశతో మీ చెంతకు వచ్చితిని" అని అతి ప్రశాంతముగా సమాధాన మిచ్చెను. వారి సంభాషణలో స్వామిజీ తమిళుడని గ్రహించిన డేవిడ్ తాను తంజావూరుకు చెందిన వాడినని హిందూ మతమును వీడి క్రిష్టియన్ మతము స్వీకరించినట్లు తెలిపెను. "సర్వమతములు సమానమే, కులమతములు మానవ కల్పితములే. భగవంతుని దృష్టిలో సర్వ ప్రాణులు సమానమే. అందరి దేముడు ఒక్కడే" నని స్వామి చెప్పగా అతను కూడా దానిని మనసారా అంగీకరించెను. ఆ క్షణమునుండి ఇరువును ప్రాణస్నేహితులైరి. డేవిడ్ తాను వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కంపనీ యజమాని దగ్గరకు స్వామిజీని తీసుకు వెళ్ళి ఏదైనా ఉద్యోగం ఇవ్వమని సిఫారసు చేయగా ఆ యజమాని స్వామిజీకి ఉద్యోగమివ్వ నిరాకరించెను. కంపనీ అభివృద్ధిలో భాగంగా నూతన భవనాల నిర్మాణతను గాంచిన స్వామిజీ కనీసం కూలిపని అయినా ఇప్పించమని తన అసహాయస్థితి వివరించి ప్రాధేయపడినను ఆ యజమాని మనస్సు కరుగలేదు.

డేవిడ్ తనకు పరిచయమున్న ఒక హోటల్ యజమానికి స్వామిజీకి ఏదైనా పని ఇప్పించమని సిఫారస్సు ఉత్తరం వ్రాసి స్వామిని పంపగా అతను కూడా వ్యాపారం సరిగా జరగటం లేదని ఉద్యోగం ఇవ్వటం సాధ్యం కాదని చెప్పాడు. స్వామిజీ మంచి నైజాన్ని గుర్తించిన డేవిడ్ స్వామికి తన గదిలో ఆశ్రయం కల్పించాడు.

కష్టాలు కలకాలం ఉండవనే రీతిన స్వామిజీ కష్టాలు గట్టెక్కి "ప్రోగ్రసివ్ మెడికల్స్" అనే డి.డి.టి. తయారు చేసే కంపనీలో తాత్కాలిక ఉద్యోగం లభించింది. ఆ కంపనీలో స్వామిజీ సీసాలు కడిగి శుభ్రపరచుట, పార్సిళ్ళ మీద చిరునామాలు వ్రాయటం మొదలగు పనులు చేసేవారు. కొంత కాలం పని చేసిన తరువాత తాత్కాలిక ఉద్యోగం కావటంతో కంపనీ యజమాని స్వామిజీని ఉద్యోగమునుంచి తొలగించాడు.

స్వామిజీ ప్రతి నిత్యం పేపరు చదివి అందులో ప్రకటించిన ఉద్యోగాల ఇంటర్‌వ్యూలకు హాజరయ్యేవారు. ఎటువంటి ఉద్యోగం చేయటానికైనా వెనుకంజ వేసేవారు కాదు. ఉద్యోగం ఉదర పోషణార్థమే గాని ఆ సంపాదనతో భోగభాగ్యా లనుభవించ వలెనన్నది స్వామిజీ అభిలాష కాదు అభిమతము కాదు.

ఇంటింటికి పాలు సరఫరా చేసే ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళి ఇళ్ళ చిరునామాలు సరిగా తెలియని స్వామిజీ ఆ ఇంటర్‌వ్యూలో కృతార్థులు కాలేక పోయారు.

ఉద్యోగం లభించక తలదాచుకోవటానికి నీడ, తినటానికి తిండి లేకపోయినా దైవం మీద విశ్వాసం కించెత్తు కూడ సడలలేదు మన స్వామిజీకి. రొట్టె తిని టీ త్రాగి రోజులు గడిపే వారు. వాటికి కూడ డబ్బులు లేని రోజున నీళ్ళు త్రాగి కడుపు నింపుకున్న రోజులు మన స్వామిజీ జీవితంలో ఎన్నో ఉన్నాయి.

## గురుకృప :

ఇటువంటి విపత్కర పరిస్తితులలో స్వామిజీకి ఒక గొప్ప దైవ భక్తుడు, శాస్త్రాల సారాన్ని ఔపోసన పట్టిన ఒక మహోన్నత వ్యక్తితో చిత్రంగా పరిచయ మేర్పడింది. స్వామిజీ వారినే తన గురువుగా స్వీకరించి వారి నుంచి అనేక గ్రంథసారాలను గ్రోలి తన జీవిత గమ్యాన్ని భగవంతుని నిర్ణయానికే వదలి వేసారు. భక్తుని దగ్గరకు భగవంతుడు వచ్చిన రీతిగా మంచి శిష్యుని కోసం గురువే శిష్యుని దగ్గరకు వచ్చారు. మంచి శిష్యుని కోసం గురువే శిష్యుని వెతుక్కుంటూ వస్తారన్న నానుడి అక్షర సత్యమైనది మన స్వామిజీ విషయంలో. స్వామిజీ గురువు గారి నామధేయం శ్రీ ముత్తయ్య గారు. వీరి స్వగ్రామం మద్రాసు రాష్ట్రంలోని తిరునల్వేలి జిల్లా వల్లనాడు. ఒక పర్యాయం ముత్తయ్య గారు ఆధ్యాత్మిక పరమైన సందేహ నివృత్తి కోసం ఒక దేవాలయానికి వెళ్ళగా అక్కడ మన స్వామిజీ చేతిలో గల 'జీవ బ్రహ్మైక్య వేదాంత రహస్యము' (Secrets of Vedantha) తమిళ గ్రంథాన్ని చూచి తనను తాను పరిచయము చేసుకొని ఆ గ్రంథాన్ని తెరచి చూడగ తన సందేహానికి సమాధానం ఆ పుటలోనే లభించింది. వీరిరువురి కలయిక ఎంత శుభసూచకమో కదా! రాను రాను వీరి పరిచయం వృద్ధి చెంది ముత్తయ్య గారి జ్ఞాన సంపన్నతకు అచ్చెరువొందిన స్వామిజీ వారినే తన గురువుగా స్వీకరించెను.



స్వామిజీ స్వదస్తూరితో గ్రంథ నామము





శ్రీ ముత్తయ్య గారి అతి నిరాడంబరత, విద్యా వివేకములున్నను అణకువతో నుండుట, దైవ చింతన మన స్వామిజీ జీవితంపై ఎంతో ప్రభావితం చేసినవి. మన స్వామిజీ కూడ గురువుకు తగ్గ శిష్యుడై ఆయన అడుగు జాడలలోనే నడచి ఆయన వలెనే బ్రహ్మచర్యాన్ని పాటించి భగవంతుని సేవకే తన జీవితాన్నర్పించిన ధన్యజీవి.

శ్రీ ముత్తయ్య గారు బొంబాయిలో ఒక నూలు మిల్లులో పని చేసేవారు. వీరు పగలంతా కష్టపడి పని చేసి రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చి వంట చేసుకొని భోజనం చేసి ఆ తరువాత తెల్లవారు ఝాము వరకు ధ్యానంలో గడిపేవారు. రోజులో రెండు లేక మూడు గంటలు మాత్రమే నిదురకు కేటాయించే వారు. గురువు గారి అడుగు జాడలలో నడచిన మన స్వామిజీ కూడ అతి స్వల్ప సమయాన్ని నిదురకు కేటాయించే వారు. తమ జీవితాంతం వరకు స్వామిజీ ఈ నియమాన్ని ఉల్లంఘించ లేదు.

స్వామిజీ వారి గురువుగారింటికి ప్రథమంగా వెళ్ళినప్పుడు ఆయన నివసించే గది, ఆ పరిసర ప్రాంత వాతావరణం చూసి ఆశ్చర్యచకితులయ్యారు. గదిలో రెండు, మూడు పాత్రలు కొద్దిగా వంట సామాను, రెండు జతల బట్టలు ఇవే ముత్తయ్యగారి ఆస్తి. ఆ పరిసర ప్రాంతమంతా చెత్తాచెదారంతోటి, మురికి నీటితోను, కడు బీద వారు నివసించే కాలనీ అది. అందు నివసించే వారంతా పగలంతా కష్టించి పనిచేసి ఆ అలసటను మర్చిపోవటానికి తప్పత్రాగి సాయంకాలానికి గూటికి చేరే అభాగ్యులు. ముత్తయ్య గారు అటువంటి మురికి వాడలో నివసిస్తున్నా ధ్యానానికి గానీ, వారి నిత్య కృత్యాలకు ఆ కలుషిత వాతావరణం ఆటంకం కాలేదు. అటువంటి ప్రదేశంలో నివసిస్తూ ధ్యానం ఎలా కొనసాగిస్తున్నారన్న మన స్వామిజీ ప్రశ్నకు ముత్తయ్య గారి సమాధానం నేటి తరం వారికి కనువిప్పు కాగలదు. ముత్తయ్య గారు తాను ఇంటికి చేరుకునే సరికి రాత్రి 11 గంటలు అవుతుందనీ, అప్పటికి త్రాగుబోతుల హడావిడి సద్దుమణుగుతుందనీ, మనస్సు నాధీనంలో నుంచుకొని ధ్యానస్థులైతే నెత్తిన పిడుగు పడినా చలించ కూడదనియు అట్టి ఏకాగ్రత అవసరమని సెలవిచ్చారు. ఆ చుట్టు ప్రక్కల చెత్తా చెదారం గురించి వివరిస్తూ "మురికి ఎక్కడ లేదు? మన శరీరంలో సహితం మలమూత్రాదులు, రక్త మాంసాలున్నాయి వాటిని మనం శుభ్రం చేయగలమా?" అని ఎదురు ప్రశ్నించి మనస్సు మలినం కాకుండా

కాపాడుకోవాలి అదే జీవిత పరమావధని వచించారు. ఈ ఉపదేశమే స్వామీజీకి తారక మంత్రం వలె పనిచేసి ఆయన జీవితాన్ని పరమార్థం వైపు పయనింప చేసింది.

ఫ్రాన్సిస్ డేవిడ్ మన స్వామీజీకి ధ్యానం చేసుకొనే టప్పుడు ఆశీనుడగుటకు ఒక టవలు, 'సీక్రెట్స్ ఆఫ్ వేదాంత' అనే గ్రంథాన్ని బహుకరించెను. ఒక రోజు స్వామీజీ ఆ టవలు మీద ఆశీనులై ధ్యానము గావించుచుండగా డేవిడ్ మత్తు పదార్థములు సేవిస్తున్నట్లు అనుభూతి కలిగి డేవిడ్‌ను ప్రశ్నించగా అతను నిజమేనని అంగీకరించెను.

మరొక పర్యాయం స్వామీజీకి స్వప్నంలో మేడ మెట్ల మీద పైన స్వామీజీ, మధ్యన డేవిడ్ క్రింది భాగాన పచ్చని చీర ధరించిన స్త్రీ గల దృశ్యము కనిపించినది. ఆ స్వప్నంలో స్వామీజీ డేవిడ్‌ను పైకి లాగుతుండగా ఆ స్త్రీ అతనిని క్రింది వైపుకు లాగుతున్నది. కొంత కాలం తరువాత స్వామీజీ డేవిడ్ ఇంటికేగగా తనకు స్వప్నంలో కనిపించిన స్త్రీని అక్కడ గాంచి అచ్చెరువొందెను. అంతలోనే డేవిడ్ అక్కడకు వచ్చి ఆమె తన భార్య యని పరిచయము చేసెను. ఆ స్వప్న వృత్తాంతాన్ని బట్టి స్వామీజీ డేవిడ్‌ను ఉచ్ఛస్థితికి తీసుకు వెళ్లటానికి ప్రయత్నించుచుండ అతని భార్య అతనిని సంసార సాగరంలోనికి లాగుతున్నట్లు స్పష్టమగుచున్నది.

స్వామీజీ ఒక రోజు డేవిడ్‌ను తమ గురువు గార్కి పరిచయము చేయగా ముత్తయ్యగారు స్వామీజీతో అతని వ్యక్తిత్వం మంచిది కాదని తెలియచేయగా స్వామీజీ డేవిడ్‌కు దూరంగా మెదలసాగెను.

స్వామీజీ ఏ విధమైన సంపాదన లేక సతమతమౌతూంటే ముత్తయ్య గారు స్వామిని చేరదీసి తమ ఇంట్లోనే వసతి నేర్పరచి భోజన సౌకర్యము కల్పించెను. ఎల్లప్పుడు కష్టించి పని చేసే స్వామీజీ, ఇతరులకు భారం కాకూడదన్న తలంపుతో గురువుగారింట్లో వంట వండటం గురువు గారి బట్టలుతుకుట మొదలగు పనులు చేసెడివారు. ఏ పని చేయుచున్నను భగవన్నామస్మరణాన్ని మనస్సులోనే మననం చేసుకుంటూ మనస్సును దైవం మీద లగ్నం చేసేవారు. వంట చేసేటప్పుడు సహితం గరిటను 'ఓం' ఆకారంలో త్రిప్పుతూ వంటకాలను కలియ పెట్టేవారు. స్వామీజీకి వంట చేయటం రాకున్నను ఆ ప్రక్రియవలన వంట ఎంతో రుచిగా ఉండెడిది. గురువుగారు సహితం స్వామీజీ చేతి వంటకాన్ని మెచ్చుకునేవారు.





స్వామీజీ వారి గురువు గారిపై ఆర్థిక భారాన్ని మోపటం ఇష్టపడక వారికి ఆర్థికంగా చేదోడువాదోడుగా నిలవాలని తలచి మాతుంగ పోస్టు ఆఫీసు దగ్గర ఫుట్‌పాత్ మీద కూర్చొని అక్కడకు వచ్చే నిరక్షరాస్యులకు యం.వో.లు నింపటం, ఉత్తరాలు వ్రాయటం లాంటి పనులు చేసి వారిచ్చినది స్వీకరించేవారు. 'ఇంతివ్వమని' నిర్బంధించేవారు కాదు. ఆ విధంగా సంపాదించిన డబ్బును గురువు గారికే సమర్పించే వారు. ఆ పోస్టాఫీసుకు ఎక్కువగా ఉత్తర ప్రదేశ్ నుంచి వలస వచ్చిన 'భయ్యా'లనే నిరక్షరాస్యులు వచ్చేవారు. వీరు బొంబాయిలోని వివిధ కర్మాగారాలలో కూలి పనిచేస్తూ జీవనాన్ని సాగించే వారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని అందరూ మోసగించే వారు. సత్యాన్ని, న్యాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న స్వామీజీ వారికి జరుగుతున్న అన్యాయాన్ని వివరించి ఆ మోసగాళ్ళతో తగవు పడటం ఇష్టం లేక ఆ ప్రదేశాన్ని విడనాడారు.

స్వామీజీ పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ఆ తరువాత అతి కష్టంమీద 'శాంతి కాటన్ అండ్ సింథటిక్' మిల్లులో దిన భత్యం మీద కూలిపని సంపాదించుకున్నారు. ఆ మిల్లులో స్వామీజీ మూడవ షిఫ్టు (అర్థ రాత్రి నుంచి తెల్లవారే వరకు)లో పని చేసేవారు. స్వామీజీ ఒక చిన్న గదిని బాడుగకు తీసుకొని అందులో నివసించ సాగారు. ప్రతి నిత్యం ఉదయమే గురువుగారిని దర్శించుకొని వారి ఆశీర్వాదాన్ని తీసుకొని ఆధ్యాత్మిక పరమైన అనేక విషయాలను నేర్చుకునే వారు. ఆ ఉద్యోగం చేస్తున్న సమయంలోనే స్వామీజీకి సునీల్ అనే బెంగాలీ వ్యక్తితో పరిచయమేర్పడింది. సునీల్ ఏ ఉద్యోగం లేక బాధపడుతుంటే నిరుద్యోగంలో ఉన్న కష్టనష్టాలను చవిచూచిన స్వామీజీ అతని పరిస్థితికి జాలిపడి అతనిని తనతోనే ఉంచుకొని అన్ని సౌకర్యాల నేర్పాటు చేసారు. సునీల్ స్వామీజీ ఇచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ ఏ పని చేయక కాలక్షేపం చేసేవాడు. చుట్టు ప్రక్కల వారితో అసభ్యంగా ప్రవర్తించే వాడు. ఇతని సోమరితనాన్ని, అసభ్య ప్రవర్తనను చుట్టుప్రక్కల వారంతా స్వామీజీ దృష్టికి తీసుకెళ్ళగా 'అతను కష్టాలలో ఉన్నాడు సాటి వారు కష్టాలలో నున్నప్పుడు ఆదుకొనుట మానవ ధర్మం' అని చెప్పి వారందరిని ఒప్పించారు. సునీల్‌కుమార్ ముసల్మానని అతని నామధేయం హుస్సేన్ అని తెలుసుకున్న చుట్టుప్రక్కల వారు నిలదీయగా అతను అక్కడ నుండి పలాయనం చిత్తగించాడు. సునీల్

కుమార్ చర్య స్వామీజీని కృంగదీసింది. అతను కష్టాలలో నున్నాడు ఎక్కడకు పోతాడు? ఎలా జీవనం సాగాస్తాడన్నదే స్వామిజీ బాధకు కారణం. సునీల్ అసత్యం చెప్పినను, ఇరుగు పొరుగు వారితో అసభ్యకరంగా ప్రవర్తించి నను స్వామిజీకి ఆగ్రహం కలుగకపోగ అతని పై ఆయనకు కరుణయే కల్గినది. ఇది స్వామిజీ దయార్ధ్ర హృదయానికి, మూర్తీభవించిన మానవత్వానికి ఒక మచ్చు తునక మాత్రమే.

స్వామిజీ పనిచేసే శాంతి కాటన్ అండ్ సింథటిక్ మిల్లులో అగ్ని ప్రమాదం సంభవించగా తాత్కాలిక ఉద్యోగులందరు తమ ఉపాధి కోల్పోయారు. స్వామిజీ ఒకరి దయాదాక్షిణ్యాల మీద ఆధార పడరని గ్రహించిన ముత్తయ్య గారు కొంత పైకం ఇచ్చి ఏదైనా వ్యాపారం చేసి భుక్తి గడుపుకోమనగా స్వామిజీ టోకు మార్కెట్టులో అరటి పళ్ళను కొని గంపలో నెత్తిన పెట్టుకొని ఇంటింటికి తిరిగి అమ్మేవారు. వ్యాపార సరళి తెలియని స్వామిజీ లాభాల నార్జించక పోయినా గురువు గారు పెట్టిన పెట్టుబడిని సహితం హరింప జేసారు. ఇది చూసిన ముత్తయ్య గారు స్వామిజీ వ్యాపారానికి పనికిరాడని ఇక ముందు కూడా ఏ వ్యాపారం చేయవద్దని స్వామినాదేశించారు. గురువు గారి ఆదేశాన్ని పాటించి స్వామిజీ జీవితంలో మరల ఏ వ్యాపారం చేపట్టలేదు.

గురువు గారికి కల్గిన నష్టాన్ని భర్తీ చేయాలన్న తలంపుతో స్వామిజీ సియాన్ రైల్వే స్టేషన్‌లో కూలిగా పని చేసి ఆ సంపాదనను గురువు గారికి సమర్పించెడి వారు. స్వామిజీ నిజాయితీకి, కార్య దీక్షకు ముగ్ధులైన ముత్తయ్య గారు స్వామిజీకి తన వద్దనే ఆశ్రయం కల్పించారు. ప్రయాణీకుల సామాను మోసి ఇంతివ్వమని అడిగేవారు కాదు. వారిచ్చిన దానితోనే సంతోషపడేవారు. స్వామిజీ అమాయకత్వానికి ఇతర కూలీలు హేళన చేసినా స్వామిజీ నొచ్చుకునే వారు కాదు.

మానవ జన్మ యొక్క పరమార్ధాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకున్న స్వామిజీ ఎల్లప్పుడు ఇతరులకు ఏ విధంగా సహాయపడగలనా అని తపన చెందేవారే గాని ఇతరుల సహాయాన్ని ఆశించేవారు కాదు. ప్రతి మానవుడు ఇదే విధంగా ఆలోచిస్తే ఇప్పుడు జరిగే కుట్రలు, కుతంత్రాలు, హింసాత్మక చర్యలకు తావు లేక ఈ భువి దివికన్నా మిన్నగా ఉండును గదా! సియాన్ రైల్వే స్టేషన్ ప్రక్కన ఒక చిన్న వ్యాపారి త్రోపుడు బండి మీద అద్దాలు, దువ్వెనలు,





పర్సులు, మొ।। చిన్న చిన్న వస్తువులను అమ్ముకొని జీవనాన్ని సాగించేవాడు. మధ్యాహ్న సమయంలో అతను భోజనానికి ఇంటికి వెళ్ళినప్పుడు నిజాయతీ పరుడు, పరుల సొమ్ము నాశించని వాడగు స్వామిజీకి బండి నప్పగించి వెళ్ళేవాడు. అతను భోజనం చేసి వచ్చిన తరువాత అప్పటి వరకు అమ్మకాల మీద వచ్చిన డబ్బులు, వస్తువులు సరిగా లెక్క చెప్పి అప్పగించేవారు స్వామిజీ. తన పని మానుకొని సహాయం చేసినందులకు స్వామిజీకి టీ ఇప్పించే వాడు దుకాణుదారు. ఇద్దరు ఆత్మీయతతో కలసి మెలసి ఉండేవారు.

ఇదే సమయంలో ముత్తయ్య గారు షుమారు ఆరు మాసములపాటు తమ స్వగ్రామం వెళ్ళారు. ఆయన తిరిగి వచ్చేసరికి స్వామిజీ చిక్కి శల్య మగుట గాంచి స్వామిజీని అడుగగా తన సంపాదన భోజనానికి చాలక పోవటంతో బన్ తిని, టీ త్రాగి కాలం గడిపినట్లు స్వామిజీ శలవిచ్చారు. “ఇంట్లో వంట సామానులన్నీ ఉండగా ఎందుకు వంట చేసుకోలేద”ని ప్రశించగా “మీరు లేని సమయంలో మీ సామానులు వాడుకుంటే అది చోరత్వమే” అవుతుంది గదా అందుకనే తాను ఆ సామానులు వాడుకోలేదని వినయంగా సమాధాన మిచ్చారు స్వామిజీ. ఈ సమాధానం విన్న ముత్తయ్య గారు ప్రతి వ్యక్తి పైసల కోసం ప్రాకులాడుతుంటే, పరుల సొత్తుని విష సమానంగా భావించే ఇతను కారణ జన్ముడని నిర్ధారించుకొని, స్వామితో “నీవు నమ్మిన ఈ సిద్ధాంతాన్ని ఏనాడు వీడకు అదే నీకు శ్రీరామ రక్ష”యని ఆశీర్వదించి ఆర్తితో ఆలింగనం చేసుకున్నారు. జీవితాంతం వరకు గురువాజ్ఞను త్రికరణ శుద్ధిగా పాటించి తనకు ఎంత దక్షిణ వచ్చినా గానీ తన స్వంతానికి వాడుకోకపోవుటయే గాక మరునాటికి కూడ పదిలపరచు కోకుండా దక్షిణ ధనాన్నంతా సాయి సేవకు సాయి భక్తుల కొరకే వినియోగించిన సేవా తత్పరులు స్వామిజీ. ఇటువంటి సుగుణాల గని తన శిష్యుడుగా లభించినందుకు వారిని కన్న తల్లి దండ్రులకు తన శిష్యునిగా చేసిన ఆ దైవానికి కృతజ్ఞతలు తెల్పుకున్నారు ముత్తయ్య గారు.

స్వామిజీకి గురువు యందు అత్యంత శ్రద్ధా, భక్తులుండ బట్టే ఆయన జీవితంలో అత్యధిక భాగం సద్గురువులకే సద్గురువైన సాయి చరణ సేవలో గడిపే అదృష్టం కల్గింది. గురువుని త్రిమూర్తి స్వరూపుడని విశ్వసించటం వలననే తమ ఏడు దశాబ్దాల జీవిత కాలంలో నాలుగున్నర దశాబ్దాలు స్వామి సేవలందుకున్నారు సాయి బాబా. గురువునేవిధంగా సేవించాలో

తెలుసుకోవటానికి స్వామిజీ జీవితమే ఉత్తమమైన ఉదాహరణ. స్వామిజీకి ఇష్టము లేకున్నను అసంఖ్యాక భక్తులు గౌరవ పూర్వకంగా **"గురుదేవ్"** అని సంభోధించేవారు.

సియాన్ రైల్వే స్టేషన్ ప్రక్కనే బీద కుటుంబానికి చెందిన ఒక యువతి కూలి పని చేసుకుంటూ జీవనోపాధి సాగించేది. ఆమె చూడ చక్కని అందగత్తె. ఆమె అందానికి అవధులు లేవు. ఆమె సొగసులకు అందరు దాసోహమనే వారు. ఆమెతో ఒక్కసారి మాట్లాడితే చాలు జీవితం ధన్యమవుతుందని తలచేవారు. ఏదో ఒక సాకుతో ఆమెతో మాట్లాడటానికి ప్రయత్నించే వారు కొందరుకాగ ఆమె అందచందాలను కళ్ళతోనే ఆస్వాదించే వారు మరి కొందరు. ఆ యువతి మాత్రం వీరిని పట్టించు కోకుండా తన పని తాను చేసుకుపోయేది. కొంత కాలం తరువాత ఆమెకు మసూచి సోకి అంద విహీనంగా తయారై ముఖమంతా మచ్చలు పడటమే గాక కనుచూపు కూడా కోల్పోయి అంధురాలైనది. అప్పటి వరకు ఆమె అందచందాలను చూసి రంభ, ఊర్వశి అని పొగడిన వారే ఆమె అందం హరించుకు పోగానే ఆమెను ఈసడించుకోసాగారు. ఆమె తల్లి దండ్రులు సహితం ఆమెను ఇంటి నుండి వెలి వేసారు. బ్రతుకు తెరువు లేక ఆమె చివరకు బిచ్చగత్తెగా మారింది. విధి విలాసమంటే ఇదే గదా! ఇదంతా గాంచిన స్వామిజీ వికలిత మనస్కులై ఈ విషయమే పదే పదే ఆలోచించి బాహ్య సౌందర్యం శాశ్వతం కాదనియు అంతః సౌందర్యమే శాశ్వతమైనదని ఈ మానవ శరీరం అనేక పరిణామాలు చెంది చివరకు భస్మమౌతుందనియు, పది మందికి మేలు చేసి వారి హృదయంలో స్థానం సంపాదించుకుంటే అది కలకాలం పదిలంగా ఉంటుందని గ్రహించి తనకు చేతనైనంత వరకు నలుగురికి సహాయపడేవారు మన స్వామిజీ. మానవ శరీరం ఏ క్షణంలో ఏమౌతుందో ఏ మార్పులు చెందుతుందో ఎవ్వరికి అంతు చిక్కని రహస్యం అని గ్రహించిన స్వామిజీ శరీర సౌందర్యానికి ఏనాడు ప్రాధ్యాన్యత నిచ్చేవారు కాదు.

ఏ మాత్రం తీరిక చిక్కినా భారత, భాగవత, రామాయణాది పురాణ గ్రంథాలను శ్రద్ధగా పారాయణ చేస్తూ వాటిలోని నీతిని ఔపోసన పట్టమే గాక వాటిని త్రికరణ శుద్ధిగా ఆచరించే వారు. గురువు గారినడిగి ఎప్పటికప్పుడు సందేహనివృత్తి చేసుకొనెడి వారు. గురువు గారి సలహా పై ఎక్కువ సమాయాన్ని ధ్యానానికి కేటాయించే వారు.

నిత్యానంద స్వామిజీ దర్శనార్థం బొంబాయి నుండి గణేష్‌పురికి కాలి







**నిత్యానంద స్వామిజీ**

నడకన వెళ్ళారు మన స్వామిజీ. మఠంలో కుండం దగ్గర కాళ్ళు కడుక్కొని ఆశ్రమంలోనికి ప్రవేశిస్తుండగా నిత్యానంద స్వామిజీ మన స్వామికి ఎదురు వచ్చారు. స్వామిజీ ఆశ్రమంలోనికి వెళ్ళి చూడగా అచట నిత్యానంద స్వామిజీ పీఠం మీద ఆసీనులై ఉన్నారు. ఒకే సమయంలో ఒకే వ్యక్తి రెండు వేర్వేరు ప్రదేశాలలో దర్శన మిచ్చిన వైనంతో నిత్యానందుల వారు మహిమాన్వితులని గ్రహించారు మన స్వామిజీ. ఆశ్రమ ప్రశాంత వాతావరణం స్వామిజీకి మనోల్లాసాన్ని కలిగించింది. గణేష్‌పురిలోనే కొన్ని రోజులు ప్రశాంతగా గడిపారు. స్వామిజీ తిరిగి బయలు దేరే రోజు నిత్యానంద స్వామిజీ మన స్వామికి ఒక నారికేళాన్ని ప్రసాదించారు. స్వామిజీ నిత్యానంద స్వామికి సాష్టాంగ నమస్కార మొనరించి ఆశీర్వదించమని ప్రార్థించగా ఆయన **"ఆశీర్వాదము ఉండబట్టేగదా నీకు నారికేళాన్ని ఇచ్చినది"** అని శలవిచ్చారు.

సియాన్ రైల్వే స్టేషన్‌లో పని చేసే రోజుల్లో స్వామిజీకి ఒక ఫకీరు వేషధారి దర్శనమిచ్చి **"షిరిడికిరా"** అని ఆజ్ఞాపించారు. స్వామిజీ దానిని గురించి ఎక్కువ ఆలోచించక యాధాలాపమని సరిపెట్టుకున్నారు. తరువాత మరి కొన్ని రోజులకు మరల కనిపించి **"నీవు త్వరగా షిరిడీకి రా"** అని హెచ్చరించారు. స్వామిజీ వారి గురువుగారికి ఈ వృత్తాంతమంతా విపులంగా వివరించి షిరిడి వెళ్ళుటకు అనుమతి గైకొని షిరిడి బయలుదేరారు.

షిరిడి ఎక్కడ ఉన్నదో ఏ దారిన వెళ్ళాలో ఏమి తెలియని స్వామిజీ చేతిలో చిల్లిగవ్వ లేక పోయినా **"పిలచినది బాబా, పిలచిన వాడు ఆదుకొని దరిచేర్చుకోడా"** యని భారమంత బాబా పై మోపి రైలు పట్టాల వెంబడి కాలి నడకన షిరిడికి బయలు దేరారు. దారిలో గల చిన్న చిన్న పల్లెలలో నివసించే వారు స్వామిజీ అడగకుండానే రొట్టెలు, టీ, భోజనము సమర్పించారు. వాటితో క్షుద్బాధను తీర్చుకొని రెండు రోజులు నడక సాగించారు. మూడవ రోజు స్వామిజీకి తినడానికి ఏమీ లభించలేదు. ఆ సాయంత్రానికి స్వామిజీ బాగా నీరసించి నడక సాగించడానికి తగిన శక్తి లేక పోయింది. **"నా భక్తుని ఇంట 'లేమి' యన్న శబ్దమే పొడ చూపదు"** అని అభయ మొసంగిన సాయి తన ఆజ్ఞ మేరకు తన సేవకై షిరిడి వస్తున్న స్వామిని పస్తులుంచుతారా! ఇచట జరిగిన

చిత్రాతి చిత్రమైన సాయి లీలను గాంచినచో సాయి తన భక్తులను ఏ విధంగా ఆదుకుంటాడో అర్థమవుతుంది. నీరసించిన స్వామీజీ అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా నడుస్తూండగా ఒక రైలు స్వామీజీని దాటుకుంటూ వెళ్ళే సమయంలో రైలు ప్రయాణీకు డొకరు పూరీ, బంగాళ దుంప కూర గల అల్పాహార పొట్లాన్ని స్వామీజీ మీదకు విసిరాడు. దానిని బాబా ప్రసాదంగా భావించి, భుజించి ఆకలి తీర్చుకుని నడుస్తూ చీకటి పడే సమయానికి ఒక రైలు క్రాసింగ్ గేటు వద్దకు చేరుకున్నారు. ఆ గేటు కాపలాదారు రాత్రి వేళ యందెక్కడికి ప్రయాణం చేస్తున్నది తెలుసుకొని ఆ పరిసర ప్రాంతాలలో గొడవలు జరుగుచున్న వని పోలీసులు అనుమానిస్తే జైలులో పెడతారని ఆ రాత్రికి స్వామిని తనతోనే ఉంచుకుని భోజన సదుపాయాలు సమకూర్చి తెల్లవారిన తురువాత స్టేషన్ మాస్టర్‌తో చెప్పి కరజాక్ స్టేషన్ నుంచి టిక్కెట్టు లేకుండా రైలులో పంపే ఏర్పాటు చేసాడు. అక్కల్ కోట మహరాజను దర్శించిన ఒక భక్తుడు స్వామికి రెండు అణాలు మరియు టీ ఇచ్చి షిరిడీ వెళ్ళమన్నాడు. స్వామి మార్గ మధ్యంలో ధబోల్కర్, చందోర్కరుల గృహాలు దర్శించి నాసిక్ చేరుకున్నారు.

నాసిక్‌లో రైలు దిగిన స్వామీజీ షిరిడీ చేరాలని ప్రయాణం సాగించి దారితప్పి త్రయంబకేశ్వరం చేరుకున్నారు. ఇది స్వామీజీ జీవితంలో మూడవ మజలీ. త్రయంబకేశ్వరంలో మౌని బాబా ఆశ్రమం గలదని తెలుసుకున్న స్వామీజీ మౌని బాబాను దర్శించుకుని కొన్ని నెలలు ఆ ఆశ్రమంలోనే గడిపారు. స్వామీజీ గుణగణాలను మనస్తత్వాన్ని పరీక్షించి ఆయనకు గల భక్తి, శ్రద్ధలకు మెచ్చి మౌని బాబా స్వామిని ఆప్యాయానురాగాలతో చూసుకున్నారు. ఆశ్రమ ప్రాంతమంతా కీకారణ్యం కావటంతో ఏనుగులు, అడవి పందులు, ఎలుగుబంట్లు, జింకలు, లేళ్ళు మొదలగు జంతువులు ఆశ్రమ ప్రాంతంలో యధేచ్ఛగా సంచరించెడివి. అహల్య గుహ దగ్గర పులులు సంచరించటాన్ని మౌని బాబా మన స్వామికి అతి సమీపంనుంచి చూపించారు. మౌని బాబా ఒక రోజు గ్రామంలోనికి వెళ్ళి భిక్షచేసుకుని రమ్మనగా స్వామి తనకు భిక్ష చేయటం అలవాటు లేదనియు అది తనకు ఇష్టంకాదనియు చెప్పగా బ్రహ్మచారులు భిక్ష చేయుటలో తప్పులేదనియు, వారికి భిక్ష నొసంగుట గృహస్తుల ధర్మమని నచ్చచెప్పి భిక్షకు పంపించారు. సహజంగానే బిడియయస్తులైన మన స్వామీజీ ప్రతి గృహము దగ్గర నిల్చి అతి మెల్లగా "భిక్షాందేహి" అని ఆ ఇంటి





ఇల్లాలికి కూడ వినీ వినపడనంత మెల్లగా అనగా ఆ రోజు అతి తక్కువ భిక్ష లభించగా స్వామీజీ మనస్తత్వము నెరిగి మౌని బాబా అటు పిమ్మట స్వామిని భిక్షకు పంపక తానే స్వయంగా భిక్ష చేసి స్వామిని కూడా పోషించెను. మౌని బాబాకు స్వామి యందు గల అపార ప్రేమాభిమానములకు ఇదొక నిదర్శనం మాత్రమే.

ఒక రోజు స్వామీజీకి స్వప్నంలో లంగోటి కట్టుకున్న ఒక వ్యక్తి దర్శనమిచ్చి "నిన్ను షిరిడీకి రమ్మంటే ఇక్కడెందుకున్నావు?" అని గద్దించి ప్రశ్నించెను. ఆ మరునాడే తాను షిరిడీ వెళ్ళటానికి అనుమతి నొసంగమని మౌని బాబాను వేడుకొనగా స్వామిని దూరం చేసుకోవటం ఇష్టం లేక స్వామిని ఆశ్రమంలోనే ఉండమని శతవిధాల నచ్చ జెప్పారు. ఆయన మనస్సు నొప్పించలేక "షిరిడీలో కొన్ని దినములు గడిపిన పిదప తిరిగి వస్తా" నని చెప్పి ఆయన అనుమతితో షిరిడి పయనమునకు సన్నాహములు చేసుకొనెను మన స్వామీజీ. మరుసటి దినమే షిరిడీ నుండి వచ్చిన ఒక భక్తుడు అక్కడ గల ద్వారకామాయి, చావడి, గురుస్థాన్, లెండీబాగ్, సమాధి మందిరం మొదలగు వాటి గురించి విపులంగా వివరించుటయే గాక షిరిడీకి వెళ్ళే మార్గం కూడ తెలియ జేసాడు. ఇవన్ని విన్న స్వామీజీకి ఎప్పుడు షిరిడీ వెళ్ళి బాబాను దర్శిద్దామా యని ఆత్రుత కలిగింది. ఎవ్వరైన షిరిడీకి వెళ్ళాలని మనస్ఫూర్తిగా బాబాను వేడుకుంటే బాబాయే అట్టి వారికి అన్ని సౌకర్యాలు సమకూరుస్తాడన్నది అక్షర సత్యం. ఆ రోజే ముప్పురు సాధువులు మౌని బాబా ఆశ్రమానికి వచ్చి తాము కాశీ వెళ్ళుచున్నామని ముందుగా నాసిక్ నుండి షిరిడీ వెళ్ళి బాబాను దర్శించుకొని అచట నుండి కాశీకి పయనమవుతామని చెప్పారు. స్వామి "నేను కూడ షిరిడీకి వస్తాను" అని చెప్పగా వారు అతి సంతసమున వారితో పాటు స్వామిని కూడ షిరిడీ తీసుకు వెళ్ళటానికి అంగీకరించారు. నాసిక్ రోడ్డు స్టేషన్ నుంచి అర్ధరాత్రి రైలు గలదని స్వామిని ఆ సమయానికి స్టేషన్‌కు రమ్మని చెప్పి వెళ్ళి పోయారు. ఏ భక్తుడైనా షిరిడీ వెళ్ళాలని మనస్ఫూర్తిగా కోరుకుంటే వారికి ఏ విధమైన ఆటంకములు కలగకుండా బాబాయే వారికి అండదండగా నిల్చి అన్ని సౌకర్యాలు చేస్తాడు. అది వేసవి కాలం కావటంతో పగటి పూట సూర్యుని ప్రతాపం అధికంగా నుండుటచే సాయం సమయంలో మౌని బాబా ఆశీర్వాదం తీసుకుని నాసిక్ రోడ్డు స్టేషన్‌కు కాలి నడకన బయలు

దేరారు మన స్వామిజీ. మార్గమధ్యంలో ఒక పోలీసు జీపు వచ్చి స్వామి ప్రక్కనే ఆగింది. అందులో నుంచి ఒక పోలీసు అధికారి స్వామిని "ఈ రాత్రి సమయంలో ఎక్కడకు వెళుతున్నావు" అని ప్రశించగా స్వామి "షిరిడీ" కని సమాధాన మిచ్చెను. షిరిడీ పేరు వినగానే ఆ పోలీసు అధికారి బాబాకు సమస్కరించి స్వామిని జీపులో ఎక్కించుకొని స్టేషన్ దగ్గర దింపి టీ కూడ ఇప్పించి బాబాకు తన నమస్కారములు సమర్పించమని స్వామిని వేడుకున్నాడు. రైలు వచ్చే సమయానికి ఒక గంట ముందుగానే మిగిలిన ముగ్గురు సాధువులు కూడా వచ్చి స్వామిని కలుసుకున్నారు. నలుగురు టికెట్టు లేకుండానే ప్రయాణించి మన్మాడు చేరి అక్కడ నుండి వేరొక రైలులో షిరిడీకి అతి సమీపమున గల కోపర్‌గాం స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ రోజుల్లో కోపర్‌గాం వద్ద గల గోదావరి నదిపై వంతెన నిర్మించబడలేదు. ప్రయాణీకులను పడవల మీద ఒక తీరం నుండి మరొక తీరానికి చేర్చేవారు. పడవ నడిపే వ్యక్తి వీరి వద్ద పైకం తీసుకోకుండానే ఆవలి ఒడ్డుకు చేర్చాడు. అక్కడ నుండి కాలి నడకన షిరిడీకి ప్రయాణం సాగించారు.

## షిరిడీ ప్రవేశము :

అది 1953వ సంవత్సరం బాబాకు అత్యంత ప్రీతికరమైన శ్రీరామ నవమి ఉత్సవములు ముగిసిన కొద్ది రోజులకే, బాబా పాదధూళిచే పవిత్రత నొందిన షిరిడీ పావన భూమిపై బాబా షిరిడీలో ప్రకటితమైన సరిగా శతాబ్ద కాలానికి స్వామిజీ షిరిడీ పుణ్య భూమిపై కాలిడినారు. ఆనాటి నుంచి తమ దేహత్యాగం చేసే వరకు రెండు పర్యాయాలు మాత్రం షిరిడీ పొలిమేరలు దాటి మిగిలిన సమయాన్నంతా సాయి సేవకే వినియోగించి సకల దేవతా స్వరూపి సాయి యని, మానవునికి ముక్తి నొసంగే పుణ్య తీర్థాలైన

**"హరి ద్వార్, మథుర, కాశీ,**
**షిరిడే మే తీరథ్ సారే హై**
**సాయి బాబాకే చరణోంమే**
**చారోధాం హమారే హై"**



అని ప్రతి నిత్యము చావడిలో భజన చేయుటయే గాక దానిని త్రికరణ శుద్ధిగా ఆచరించి నలుగురికి ఆదర్శ ప్రాయుడిగా





నిలచిన ధన్య జీవి మన శివనేశన్ స్వామిజీ.

షిరిడీలో కాలిడగానే ప్రప్రథమంగా సాయినాథుని లీలా విన్యాసాలకు నెలవైన ద్వారకామాయిని దర్శించి అచట గల బాబా చిత్రపటమును గాంచిన స్వామిజీ ఆశ్చర్య చకితులయ్యారు. ఆయన శరీరము పులకరించగా మనస్సు ఆనంద డోలికలలో తేలియాడెను. తమ బాల్యంలో వారి ఇంటికి సమీపమునగల గుహలో ప్రతి నిత్యం తాను కొలచే చిత్రపటము ద్వారకామాయిలోని చిత్రపటము ఒక్కటి కావటమే స్వామిజీ సంతసమునకు కారణం. వెనువెంటనే స్వామిజీ బాబాకు సాష్టాంగ నమస్కార మొనరించెను. తన బాల్యం నుండి బాబా తనను రక్షిస్తున్నాడని గ్రహించి సాయి సన్నిధినే తన స్థిర నివాసంగా మార్చుకున్నారు. స్వామిజీతో పాటు వచ్చిన ముగ్గురు సాధువులకు స్వామిజీకి కూడ షిరిడీ సాయి సంస్థాన్ వారు మూడు రోజులు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. నాల్గవనాడు ఆ మువ్వురు సాధువులు కాశీకి ప్రయాణమై వెడలిపోగా స్వామిజీ మాత్రం షిరిడీలోనే ఉండిపోయారు.

స్వామిజీ షిరిడీ చేరే నాటికి ఆయన వయస్సు 26 సం॥లు అంత యవ్వన వయస్సులో అరిషడ్వర్గాలను జయించడమే గాక ప్రతి క్షణాన్ని సాయి సేవకే వినియోగించిన ధన్యజీవి. ద్వారకామాయి, గురుస్థాన్, చావడి, లెండీబాగ్,



బుట్టివాడ, కానీఫ్‌నాథ్, మారుతి, గణేశ్, శంకర, శని మరియు అష్టలక్ష్మి మందిరాలలో కూడ సేవ చేసేవారు. పగలంతా సేవచేసి రాత్రులందు షిరిడీ సాయి స్టోర్స్ వెనుక భాగములో గల చిన్న గదిలో తలదాచుకునే వారు. ఆ సమయంలో ఆ షాపులో దొంగతనము జరగగా స్వామిజీ ఆ గదిని ఖాళీ చేసారు. కొన్ని దినములు గడచిన పిదప కానీఫ్‌నాథ్ మందిర పూజారి స్వామిజీ నిస్వార్థ సేవకు ముచ్చటపడి స్వామిని కానిఫ్‌నాథ్ మందిరంలో ఉండటానికి అనుమతించటమే గాక రోజు రొట్టె, టీ కూడా ఇచ్చేవాడు. కానిఫ్‌నాథ్ మందిర పూజారి అయిన చాంద్ భాయ్ షిరిడీ సాయి సంస్థానంలో వాచ్‌మెన్‌గా పని చేసేవాడు.

స్వామిజీ ప్రతినిత్యము వేకువ జామున 3 గం॥లకే నిద్రలేచి ఖండోబా

మందిరము దగ్గర గల 'శివఉఢ' లో స్నానమాచరించేవారు. ఆ రోజుల్లో 'శివఉఢ'లో నీరు పుష్కలంగా ఉండటంతో ఆ నీటితో ఆ చుట్టుప్రక్కల భూములు సైతం సాగు చేసుకునేవారు. ఒకసారి వర్షాకాలంలో నీటి మట్టం బాగా పెరిగి వేగంగా ప్రవహిస్తున్న సమయంలో స్నానానికి దిగిన స్వామి ఆ వేగానికి నీటిలో కొట్టుకు పోతుంటే ఏమి చేయాలో పాలుపోక **"బాబా బాబా"** అని ఆర్తితో బాబాను వేడుకొనగానే బాబాయే స్వామిని సురక్షితముగ ఒడ్డుకు చేర్చారు. **"నన్ను నమ్మిన వారినెన్నడును నేను పతనం కానివ్వను"** అన్న బాబా అభయహస్తం స్వామీజీ జీవితంలో అక్షర సత్యమైనది. ప్రతి నిత్యం స్నానానంతరం సుమారు ఒక గంట సేపు ధ్యానస్థులై 4 గం॥లకు ద్వారకామాయి తెరిచే సమయానికి అక్కడకు వచ్చి లెండీబాగ్‌లోని **'బుడ్కి'** అనే బావి నుండి నీరు తెచ్చి ద్వారకామాయిని శుభ్రపరచెడి వారు. **'బుడ్కి'** అనే ఈ బావిని బాబాయే స్వయముగా త్రవ్వుట ప్రారంభించగా భక్తులందరు చేరి ఆ కార్యక్రమమును పూర్తి చేసిరి. బాబా ఈ బావిని **'బుడ్కి'** అని పిలచెడి వారు. బాబా స్వహస్తములతో త్రవ్విన ఈ బావినీటికి దివ్య శక్తులు గలవు. ఈ నీటిని సేవించినచో అనారోగ్యులు ఆరోగ్యవంతులగుదురు. అలనాటి షిరిడీ గృహస్తులు ఈ నీటిని తమ గృహావసరాలకు సహితము ఉపయోగించెడి వారు. 1983 సం॥లో ఈ బావి ఎండిపోగ ఎ.ఆర్. షిండే అనే సాయి భక్తుడు తన స్వంత ఖర్చుతో బావిలోని పూడిక తీయించగా పుష్కలముగా నీరూరెను. స్వామీజీ ద్వారకామాయిని అద్దమువలె శుభ్రపరచెడి వారు. అటుపిమ్మట బాబా ఛాయా చిత్రములకు, కూర్మమునకు, బాబా ఆసీనుడైన బండకు, బాబా పాదుకలకు గంధము, కుంకుమ బొట్లు పెట్టి పూలమాలలను వేసి అలంకరించెడి వారు. శివఉఢ నీటితో శని, శంకర, గణపతి, మారుతి మందిరములను శుభ్రపరచెడి వారు. మధుర మహరాజ్ లాల్ బాబా అనే సాయి భక్తుడు బాబా తోటనుంచి పుష్పములను తెచ్చి ద్వారకామాయిని అలంకరించెడి వారు. ఆయన షిరిడీ నుంచి నిష్క్రమించిన తరువాత స్వామీజీ



**బుడ్కి చెంత స్వామీజీ**





ఆ పనిని చేసెడి వారు. ఈ బాబా పూల తోట 'భక్త నివాస్' దగ్గర ఉండేది.

సాయి బాబా షిరిడీలో గల పురాతన దేవాలయములన్నిటిని తనకు లభించిన దక్షిణ ధనంతో బాగుచేయించగా ఆ మందిరములన్నిటిలోను సేవచేసి తరించిన ధ్యనజీవి మన స్వామిజీ.

స్వామిజీ కానిఫ్‌నాథ్ మందిరంలో ఉంటున్న తరుణంలో వేరొక సాధువు వచ్చి అక్కడ మకాం చేయడంతో అక్కడ ఇద్దరు ఉండటానికి వీలుకాక స్వామిజీ తన మకామును మారుతీ మందిరానికి మార్చారు.

ఆ రోజుల్లో కొంతమంది భక్తులు సాధువుల మీద సంస్థానం వారికి ఫిర్యాదు చేయగా సాధువులెవ్వరూ మూడు రోజులకు మించి షిరిడీలో ఉండకూడదని ఉత్తర్వులు జారీ చేసి సాధువులందరినీ షిరిడీ నుండి పంపివేసినారు. కానీ సాయికి అత్యంత ప్రీతి పాత్రుడు, నిస్వార్థ సాయి సేవకుడు, నిరంతర సాయి కీర్తనాభిలాషి అయిన మన స్వామిజీని మాత్రం షిరిడీలో ఉండటానికి అంగీకరించారు సంస్థానం వారు.

అప్పట్లో స్వామికి రోజు గడవటానికి నాల్గు అణాలు సరిపోయేవి. అంత దక్షిణ లభించని రోజు ఒక బన్ను తిని టీ త్రాగే వారు వాటికి కూడ డబ్బులు లేని రోజున లెండీబాగ్ లోని బావి నీరు త్రాగి కాలం గడిపేవారు. ఎట్టి పరిస్థితులలోను దేనికీ ఎవ్వరినీ యాచించే వారు కాదు. ఆకలికి తాళలేని స్వామిజీ **"బాబా నాకు ఆస్తిపాస్తులు వద్దు, ఆకలి బాధ తీరడానికి అన్నమైనా పెట్టించు లేక ఆకలైనా లేకుండా చేయి"** అని ప్రార్థించేవారు. స్వామిజీ జీవితంలో పస్తులున్న రోజులు లెక్కించ తరము గాదు. అటువంటి పరిస్థితులలో సహితం సాయి సేవకు దూరమగుటగాని, భగవంతునిపై తనకు గల నమ్మకము సడలుటగాని జరగలేదు.

ఒక వైపు ఆకలి బాధను భరించలేక మరియొక వైపు ప్రజలు పెట్టే కష్టాల నోర్చుకోలేక షిరిడీ వీడి ఎక్కడికైనా వెళ్ళిపోదామని తలంచి తనకు గల ఒక జత బట్టలను, పుస్తకాలను మూటగట్టుకుని కాలి నడకన షిరిడీ పొలిమేరలు దాటారు. మధ్యాహ్న సమయం వరకు నడక సాగించి అలసి, సొలసిన స్వామిజీ ఒక చెట్టు క్రింద సేద తీరుతూ నిద్రలోనికి జారుకున్నారు. సాయంకాల సమయానికి అలసట తీరి నిద్రమేల్కాంచి చెట్టు పైకి చూడగా అచట బాబా చిత్రపటమొకటి వ్రేలాడుతూ అగుపించెను. తాను నిద్రించుటకు ముందు లేని

ఈ బాబా చిత్రపటం ఎక్కడ నుండి వచ్చినది, ఇదేమి విచిత్రమని తలపోస్తూ దాహం తీర్చుకోవడానికి ఆ చెట్టు చెంతనే గల బావిలోనికి చూడగా నీరు పుష్కలముగా పైకే ఉన్నవి కాని చేతికి అందేరీతిన లేవు. చెట్టు కొమ్మ మీద నుంచి బావిలోనికి వంగి చెంబుతో నీరు అందుకోవచ్చని తలంచిన స్వామి తన జోలెలో చెంబు కొసం గాలించగా అది కనిపించలేదు. దీని సారాంశాన్ని స్వామి తాను బాబాకు దూరంగా వెళితే నీరు కూడ లభించవని ఇదంతా బాబా లీలయే నని గ్రహించి వెనువెంటనే షిరిడీకి తిరుగు పయనము సాగించి ఆ రాత్రికే షిరిడీ చేరి తాను చేసిన తప్పిదమునకు సాయి నాథుని మనసారా క్షమించిమని వేడుకొని తిరిగి తమ నిత్య కృత్యములను కొనసాగించెను.

ఒక పర్యాయము స్వామీజీ వస్త్రాలు జీర్ణమై పోయి కట్టుకున్న వస్త్రంతో మిగిలారు. ఆ వస్త్రమును శుభ్రపరచు కొనవలెనన్నను వేరొక వస్త్రము లేక ఒండొరులను యాచించుట తెలియని స్వామి తన కష్ట నష్టములను బాపు వాడు బాబాయే నన్న ధృడ విశ్వాసముతో బాబాకు తన గోడు చెప్పుకొని లెండీ బాగ్‌లో ధ్యానస్తులాయెను. ఆ ధ్యానములో ఒక అపరిచిత వ్యక్తి తనకు నూతన వస్త్రాలను బహూకరించి నట్టు అనుభూతి కల్గెను. ధ్యానం ముగిసిన పిదప కొద్ది క్షణాల్లోనే ఒక వ్యక్తి వచ్చి స్వామికి రెండు నూతన వస్త్రములను సమర్పించి తనకు బాబా స్వప్నంలో దర్శనముసంగి లెండీబాగ్‌లో ధ్యానమొనరించుకొనుచున్న వ్యక్తికి నూతన వస్త్రములను బహుకరించమని ఆదేశించగా తాను ఆ వస్త్రములను సమర్పిస్తున్నట్లు విశదీకరించి వాటిని స్వీకరించమని స్వామిని వేడుకొనెను. వాటిని బాబా ప్రసాదముగా తలంచి ఆ వస్త్రములను బహూకరించిన వ్యక్తికి కృతజ్ఞతలు తెలియచేసి వాటిని స్వీకరించి వాటికి మూలకారణమైన బాబాకు కృతజ్ఞతలు తెల్పుకొనెను.

మరొక పర్యాయము స్వామీజీ దుస్తులు మురికితో మాసిపోగా ఉతుక్కోవడానికి సబ్బులేక కొనుక్కోవటానికి డబ్బులేక లెండీబాగ్‌లో అదే ధ్యాసతో అలోచిస్తూ కూర్చున్నారు. అది సాయంకాల సమయం. సూర్చుడస్తమించే సమయం. చల్లని వాతావరణం ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. స్వామీజీ ఆ ప్రశాంత వాతావరణంలో బాబా నామస్మరణ చేసుకుంటూండగా ఒక ఆవుల మంద లెండీ బాగ్ నుండి బయటకు వెళ్ళింది. అవి వెళ్ళిన తరువాత చూస్తే ఒక గోవు పాద ముద్రమీద క్రొత్తది బట్టలు ఉతుక్కునే సబ్బు దొరికింది. గోవులు





వెళ్ళిన తురువాత ఎవ్వరు అటు వైపు రాలేదు అటువంటప్పుడు ఈ సబ్బు అచటకు ఎలా వచ్చింది? అని స్వామీజీ ఆలోచించగా అదంతయూ బాబా లీలయే నని బోధపడింది. ఆ సబ్బుతో బట్టలు శుభ్రపరచుకున్నారు. ప్రతి చిన్న విషయానికి సాయి నాథుడు స్వామికి అండదండగా నిలచి **“నేనుండగా బయమేల?”** యని స్వామి కష్టాలను కడతేర్చేవారు.

ఒక రోజు స్వామీజీ సమాధి మందిరంలో ధ్యానమొనరించుకొను సమయంలో ఆయన బట్టలు (ఒక తుండు) ఆధ్యాత్మిక గ్రంథాలు దొంగిలింప బడెను. స్వామీజీ కట్టు బట్టలతో మిగిలారు. దీనికి స్వామీజీ ఏమాత్రం విచారించలేదు. **“నాకు చేదోడు వాదోడుగ బాబా ఉండగా నా కేమి?”** యని నిశ్చింతగా లెండీబాగ్‌లో ఆసీనులై ధ్యానమొనరించ సాగెను. ధ్యానంలో ఒక అపరిచిత వ్యక్తి తనకు బాబాకు అలంకరించి నటువంటి వస్త్రంలాంటిది ఇస్తున్నట్లుగా భ్రమ కలిగింది. ఒక అర్ధ గంట గడచిన తురువాత ఒక వ్యక్తి స్వామీజీ ధ్యానంలో కనబడినటువంటి వస్త్రాన్ని బహూకరించాడు. మరి కొద్ది క్షణాలకే వేరొకతను వచ్చి స్వామీజీకి వస్త్రాలు బహూకరించిన వ్యక్తికి నూతన వస్త్రాలనిచ్చి వెళ్ళిపోయాడు. స్వామీజీకి మొదట వస్త్రాల నిచ్చిన వ్యక్తి బాబా స్ఫూర్తితో తాను స్వామికి వస్త్రాల నివ్వగా బాబాయే స్వయంగా తనకు నూతన వస్త్రాలను ప్రసాదించాడని పరమానంద భరితుడయ్యాడు. ఆ ఆనందంలో స్వామికి భోజనం కూడ పెట్టించాడు. ఆపదలో నున్న వారిని, మంచి వారికి మనం సహాయం చేస్తే భగవంతుడు ప్రసన్నుడై తన కృపార్ణవాన్ని మనపై కురిపిస్తాడని ఈ సంఘటన స్పష్టము చేయుచున్నది. స్వామికి వస్త్రాలను సమర్పించిన వ్యక్తి తన గ్రామములో బాబా మందిరం నిర్మించ దలచి బాబా ఆశీస్సులకై షిరిడికి వచ్చాడు. బాబా ఆశీర్యాదం లభించే వరకు అన్న పానీయములు ముట్టనని నిరాహార దీక్షను ప్రారంభించెను. **“నా భక్తులను ఎన్నడును పస్తులుంచను”** అని అభయమిచ్చిన బాబా తన మందిరము నిర్మించ దలచిన భక్తుని పస్తులుంచుతారా? ఆ మరుసటి రోజే ఆ భక్తుని సంచిలో రెండు రజిత నేత్రములు లభ్యమవ్వగా అదే బాబా ఆశీర్వాదమునకు చిహ్నామని స్వామీజీ తెలియజేయగా అతను నిరాహార దీక్షను విరమించి తన స్వగృహమునకు పయనమాయెను.

ఒక పర్యాయము అనేక దినములు పస్తులుండుటచే స్వామీజీకి

కడుపులో మంటరాగా పెరుగు త్రాగుదామనుకుంటే డబ్బులేక వేరే మార్గమేమిలేక గత్యంతరము లేక షిరిడీ సాయి స్టోర్సు యజమాని నడిగి ఒక రూపాయి అప్పు తీసుకుందామని వెళ్ళగా ఆ షాపు యజమాని లేని కారణముగా గుమస్తా స్వామికి అప్పివ్వ నిరాకరించాడు. ఏ దిక్కులేని వాడికి దేముడే దిక్కని తనను ఎల్లవేళల కంటికి రెప్ప వలె కాపాడుచున్న బాబాయే తనకు రక్ష యని తలంచి లెండీబాగ్‌కు వెళ్ళి అచట గల కాలువలో ముఖప్రక్షాళన గావించు కొనుచుండ ఆ నీళ్ళలో అర్ధ రూపాయ నాణెం ఒకటి, పావలా నాణెం ఒకటి, బేడ నాణెం ఒకటి, రెండు అణాకాసులు మొత్తం రూపాయి లభించినది. తనను ఆపద నుండి రక్షించుటకు బాబాయే ఈ రీతిగా తనకు కావలసిన ధనమును సమకూర్చాడని అవగతము చేసుకున్న స్వామీజీ బాబాకు కృతాజ్ఞతా పూర్వక నమస్కారములు తెలియ జేసుకుని ఆ రూపాయితో పెరుగు త్రాగగా బాధా నివారణ కలిగింది. సాయిని ఎంత ధృఢ భక్తితో కొలిస్తే అంత వేగిరమే మన మనో వాంఛలు నీడేరుస్తాడని ఈ సంఘటన రుజువు చేస్తోంది.

స్వామీజీ షిరిడీ వచ్చిన ప్రథమంలో తమ బట్టలను ఎల్లప్పుడు తెల్లగా ఉండేటట్టు శ్రద్ధ వహించేవారు. కానీ ద్వారకామాయిని శుభ్రపరచే టప్పుడు, దీపాలను శుభ్రపరచేటప్పుడు బట్టలకు నూనె మరకలై మురికి అయ్యేడివి. కొన్ని రోజులు గడచిన పిదప వస్త్రాలను తెల్లగా ఉంచుకొనుటకంటే మనస్సును



ద్వారకామాయిలో స్వామీజీ

స్వచ్ఛంగా ఉంచు కోవాలని గ్రహించి బట్టలయందు శ్రద్ధ చూపే వారు కాదు. ఏ భక్తుడైనను బట్టల మురికిని గురించి ప్రశ్నించగా ఇది మురికి కాదు మన పాపాలను ప్రక్షాళన చేసే పరమ పావన ద్వారకామాయి ప్రసాదితము అని అణకువగా చెప్పెడి వారు. స్వామికి ద్వారకామాయి అనగా అత్యంత శ్రద్ధా భక్తులు. స్వామి శుభ్రపరచిన పిదప ద్వారకామాయి అద్దము వలె నుండెడిది. ద్వారకామాయి లోని దీప స్తంభములు సువర్ణ కాంతులీను నట్లు శ్రద్ధ తీసుకునెడి





వారు. బాబాచే 'మాయి' అని పిలుపించుకుని ధన్యత చెందిని ద్వారకామాయిని ఎంత శుభ్రపరచితే మన పాపములు అంత వేగిరమే ప్రక్షాళన మగునని శలవిచ్చెడి వారు. స్వామీజీ ఎల్లవేళల ద్వారకామాయిని అతి శుభ్రముగా నుంచెడి వారు. ఈ కార్యక్రమమును మనస్ఫూర్తిగా నిర్వహించెడి వారు. ఇది బాబా తనకు కలగ జేసిన అదృష్టమని మురిసి పోయెడి వారు. స్వామీజీ చాల కాలం వరకు ఒక తుండును కట్టుకుని మరొక తుండును తలపాగాగ ధరించెడి వారు. శరీరముపై చొక్కాగాని కనీసం బనీను గాని ధరించెడి వారు కాదు. వయస్సు మీరిన తరువాత స్వామీజీని తరచూ ఆస్తమా బాధించుటచే వైద్యుల సలహాపై ఖద్దరు బనీను ధరించుట మొదలు పెట్టెను. ఒక నాడు బొంబాయి నుండి ఒక భక్తుడు సాయి దర్శనార్థమై షిరిడీకి వచ్చి తాను రోజు ఒక భక్తునికి భోజనమేర్పాటు చేయదలంచి అందుకు గాను కొంత పైకాన్ని సమాధి మందిర పూజారిగా పనిచేస్తున్న ఉద్ధవరావు ధేశ్‌పాండే గార్కి సమర్పించెను. స్వామీజీ అంత పిన్న వయస్సులోనే ఎంతో పరిణితి చెందిన వ్యక్తులకన్నా మిన్నగా సాయి సేవ చేస్తూ ఆ సేవకే తన జీవితాన్ని అంకితము చేసిన స్వామీజీకన్న మిన్న యైన భక్తుడు లేడని తలంచి బొంబాయి భక్తుడు సమర్పించిన ధనముతో భోజనాన్ని బాబాకు నివేదించి దానిని స్వామికి ఇచ్చేవారు. ఆ నాటి నుండి అదే ఆచారంగా మారి స్వామి సమాధి చెందేవరకూ సాయికి నివేదించిన ప్రసాదాన్ని స్వామికి ప్రసాదించే వారు షిరిడీ సాయి సంస్థాన్ వారు. స్వామీజీకి పూర్వము గాని స్వామి సమాధి చెందిన తరువాత గాని ఈ అదృష్టము మరియొక భక్తునకు కలగ లేదంటే బాబాకు స్వామిపై ఎంతటి ఆదరాభిమానములున్నవో చదువరులు గ్రహింతురు గాక. ఈ విధముగా స్వామీజీకి ఆకలి ఆమడ దూరమాయెను. ఏ చీకు చింతా లేక స్వామీజీ తన పూర్తి కాలాన్ని సాయి సేవకే అంకిత మొనరించి ప్రశాంత జీవనము కొనసాగించెను.

ఒక పర్యాయం స్వామిజీకి ద్వారకామాయిలో పడమర కుడ్యమునకు గల బాబా బండపై ఆశీనుడైన ఛాయాచిత్రంలో ముఫ్వరు వ్యక్తులు దర్శన మిచ్చెను. అందులో ఒకరు లక్ష్మీనాథ్ జటాశంకర్ త్రివేది. ఈయనను స్వామీజీ ప్రథంగా ఖండోబా మందిరం చెంత కలుసుకున్నారు. బాబా పటంలో అగుపించిన వ్యక్తి కళ్ళెదుట కనిపించే సరికి స్వామి ఆశ్చర్య భరితులై ఆయనకు సమస్కరించి పరిచయం చేసుకున్నారు. ఇరువురూ అకుంఠిత సాయి

భక్తులగుటచే అనతి కాలమందే మంచి మిత్రులయ్యారు. త్రివేది నూట ఎనిమిది పర్యాయములు షిరిడీకి వచ్చి బాబాను దర్శించుకునెను. ప్రతి పర్యాయము తనతో భక్తులను షిరిడీకి తీసుకు వచ్చి వారికి బాబా లీలను వివరించుట, షిరిడీలోని పవిత్ర ప్రదేశాలను చూపించుట చేసి వారిలోని సాయి భక్తిని పెంపొందిచే వారు. బీదలకు విరివిగా అన్నదానము, వస్త్ర దానము చేసేవారు. ధునికి సమర్పించ డానికి ఆవు నెయ్యి, సాంబ్రాణి, అగరువత్తులు, మొ॥ దీపాలు వెలిగించ డానికి నూనె, స్వామిజీకి వస్త్రములు, ఆధ్యాత్మిక గ్రంథాలను సమర్పించేవారు. ఒకసారి ఈయన పెద్ద డబ్బా నిండా నూనెను తెచ్చి స్వామిజీకి ఇచ్చి ద్వారకామాయిలో దీపాలను వెలిగించమని కోరారు. ఆ రోజు ఆ నూనెతో ద్వారకామాయిలో బాబా సశరీరులుగా ఉన్నప్పుడు వెలిగించే దీపాల సంఖ్యకు తగ్గకుండా ద్వారకామాయి మొత్తం దీపాలతో అలంకరించగా అది గాంచిన భక్తవరేణ్యులు ఆ రోజు దీపావళిని మరిపించినదని ఆనంద భరితులయ్యారు. మరొకసారి త్రివేది గారు స్వామిజీకి అతి విలువైన నూతన వస్త్రాలను సమర్పించగా నిరాడంబరముగా జీవితమును సాగించే స్వామిజీ ఆ వస్త్రములను ధరించుటకు మనస్సంగీకరించక వాటిని ఒక ఫకీరుకు సమర్పించారు. ఆ ఫకీరు ఆ వస్త్రములను ధరించి అక్కడకు అతి సమీపమున పారాయణ చేసుకుంఉటున్న త్రివేది చెంతకేగెను. ఆ ఫకీరును గాంచిన త్రివేది ఆ వస్త్రములను తాను శివనేశన్ స్వామికివ్వగా ఈ ఫకీరు దగ్గరకు ఎలా వచ్చినవా యని ఆలోచించు చుండగా ఆ ఫకీరు **“నీవు నాకు చాల కాలం నుండి తెలుసు. ఈ వస్త్రాలను నీవు శివనేశన్‌కు సమర్పించినవే”** అని చెప్పి అచట నుండి వెడలి పోయెను. అది చూచిన త్రివేది ఆ ఫకీరును తానింతకు పూర్వము చూచి ఉండక పోయినను అతను చాల కాలం నుండి తెలుసునని చెప్పాడు, ఇదేలా సాధ్యమా అని స్వామిజీ దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వివరించగా స్వామిజీ వెంటనే “ఆ ఫకీరు ఎవ్వరో కాదు సాక్షాత్తు సాయినాథుడే. లేకపోతే ఈ వస్త్రాలను నీవు నాకిచ్చావని అతని కెట్లా తెలుస్తుంది? ” ఇది సాయినాథునికి తప్ప అన్యులకు అసాధ్యమని వివరించగా త్రివేది మనస్సు ఆనంద డోళికలలో తేలియాడి సాయినాథుని దర్శనమునకు కారణమైన స్వామిజీని కొనియాడి ప్రేమాభిమానములతో కౌగిలించు కొనెను. సాయి సాక్షాత్కారమునకు ‘నీవంటే నీవే కారణమని’ ఒకరినొకరు అభినందించు కొనిరి. ఈ సంఘటన మనం సాయినాథుని పేరిట ఎవ్వరికి ఏమి సమర్పించినా అది బాబాకే చెందునని





తేటతెల్లము చేయు చున్నది గదా!

స్వామిజీకి బాబా చిత్రపటంలో అగుపించిన రెండవ సాయి భక్తుడు శ్రీ యం. ప్రభు. ఈయన తమిళనాడుకు చెందిన వారు. ఈయన కుటుంబ సభ్యులంతా బాబాకు అనన్య భక్తులే. వీరి కుటుంబమును గూర్చి కొంతలోకొంతైనను వివరించకపోతే ఈ గ్రంథము అసంపూర్ణమే యగును. ప్రభు కెమిస్టుగా ఉద్యోగము చేసెడి వారు. ఈయన శ్రీమతి వారిజ తీవ్ర అస్వస్తతో బాధపడుచుండ ఎంతో మంది ప్రముఖ వైద్యులను సంప్రదించినను ఆమెకు ఉపశమనము కలుగలేదు. మృత్యువుతో పోరాడుచు జీవితమును కొనసాగించు చుండెను. ఒకనాడు ‘ది హిందూ’ దిన ప్రతికలో పూజ్య నరశింహ స్వామిజీ కోయంబత్తూరులో ‘నాగ సాయి’ మందిరమునకు విచ్చేయు చున్నారనియు, సాయినాథుని అనుగ్రహముతో అసంఖ్యాక అనారోగ్యులను ఆరోగ్యవంతులుగా చేసిరనియు కూడ ప్రకటింప బడెను. చిట్ట చివరి ప్రయత్మముగా ప్రభు తన శ్రీమతిని వారి చివరి సంతానమైన చి. విన్నీని తీసుకొని నరశింహ స్వామిజీ దర్శనార్ధమై కోయంబత్తూరు వెళ్ళి స్వామిజీని దర్శించి తన భార్య అనారోగ్యమును బాపుమని వేడెకొనెను. నరశింహ స్వామిజీ శ్రీమతి వారిజకు ‘అచ్చుతానంత గోవింద’ యను మంత్రము నుపదేశించి దినమునకు ఇరువది ఒక్క మార్లు ఇరువది ఒక్క దినములు నిష్టతో పఠించమనియు, నిత్యము బాబా ఊదిని నీటిలో కలిపి తీర్ధముగా స్వీకరించ వలెనని శలవిచ్చిరి. ఆమె ఆ విధముగా చేయగా ఆరోగ్యము కొంత మెరుగై అతి త్వరలోనే ఆమె సంపూర్ణ ఆరోగ్యవంతురాలయ్యెను. నాటి నుండి ఆ కుటుంబమునకు బాబా ఆరాధ్య దైవమాయెను. స్వామిజీ చేసిన ఉపకారమునకు ధన్యవాదములు చెప్పుటకు గాను మరల స్వామిజీని కలవగా ఆయన చిరునవ్వుతో ‘నేను నిమిత్త మాత్రుడను, చేసెడిది, చేయించెడిది అంతా బాబాయే’ అని వినయముగా పలికి ప్రభూ ‘నీవు మధ్య భారత దేశములో బాబా ప్రచారము చేయుము’ అని శలవిచ్చెను. అటు పిమ్మట అనతి కాలముననే ప్రభూకి మధ్యప్రదేశ్‌లో గల జబల్‌పూర్‌కు బదిలి ఆయెను. అచట ఉద్యోగము చేయుచునే బాబా భజనలు, సత్సంగములు జరుపుచూ బాబా ప్రచారము ప్రారంభించి బాబా భక్తుల సంఖ్య పెరగగానే ఒక బాబా మందిరమును కూడ నిర్మించి దాని నిర్వహణ బాధ్యతలు కూడ చక్కగా నిర్వహించెను.

వీరి కుటుంబమంతయు ప్రతి సంవత్సరము షిరిడీ వెళ్ళి బాబాను దర్శించి సేవించెడి వారు. వీరి చివరి సంతానమైన బృంద మరియు విన్నీ కూడ వీరితో షిరిడి వెళ్ళెడి వారు. వీరు 1955వ సం॥లో షిరిడీకి వెళ్ళగా స్వామిజీ ప్రభుని చూచి తనకు బాబా చిత్రపటమందు అగుపించినది ఈయనేని గ్రహించి తనను తాను పరిచయము చేసుకొనెను. అందరు సాయి భక్తులగుటచే ఒకే కుటుంబ సభ్యులుగా కలసి మెలసి ఉండెడి వారు. ప్రభు ఆయన శ్రీమతి వారిజ స్వామిజీని తన కుమారుని వలె ఆదరించెడి వారు. బృంద, విన్నీలు తమ సహోదరుని వలె భావించెడి వారు. విన్నీ అందరిలోకి చిన్న దగుటచే అందరును గారాబముగా ముద్దు చేసెడి వారు. స్వామిజీ, విన్నీల బంధము స్వామిజీ సాధకురాలు వలె గాక అన్న అల్లరి చెల్లెల వలె ఉండెడిది. స్వామిజీ, ప్రభూలు ద్వారకామాయిలో ఆశీనులై బాబా లీలను ముచ్చటించుకుంటూ రేయంతయు ద్వారకామాయిలోనే కాలమును సద్వినియోగము చేసుకొనగా, విన్నీ, బృందలు అంగ ప్రదక్షణలు చేయుచును, విష్ణు సహస్రనామములు పఠించు చుండెడి వారు.

ప్రభు చిరుద్యోగి అయినను తన సంతానమైన నలుగురిని ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దెను. ముగ్గురు కుమార్తెలలో ఆష, మరియు విన్నీలను డాక్టర్లగను, ఒక బృందను యం.ఎ. చేయించి కుమారుని ఇంజనీరు గాను చేసెను. వీరి సంతానమంతయు విద్యాధికులై పేరు ప్రఖ్యాతులు సంపాదించినను బాబా సేవను వీడలేదు. ఆష మరియు విన్నీలు అమెరికాలో వైద్య వృత్తిలో మంచి ప్రావీణ్యతను సంపాదించి పేరు ప్రఖ్యాతుల నార్జించెను.

ప్రభు ఉద్యోగ విరమణానంతరము షిరిడీలో స్థిర నివాస మేర్పరచుకొన వలెనని తలంచెను. కాని షిరిడీలో వైద్య సదుపాయములు లేని కారణమున షిరిడీకి సమీపమున గల పూనా పట్టణమున బన్నీర్ రోడ్డులో గల సింధ్ కాలనీలో స్థలము కొనుగోలు చేసి గృహ నిర్మాణమునకు ఏర్పాట్లు గావించుకొని స్టీలు, సిమెంటు బస్తాలు మొ॥ నవి ఆ ఖాళీ స్థలమునందుంచెను. ఆ కాలనీలో చెదురుమదురుగా గృహము లుండుటచే దొంగల భయము నధికముగా నున్నను బాబాపై భారము వేసి గృహనిర్మాణమునకు శ్రీకారాము చెట్టెను. రాత్రులందు సహితము కాపలా మనిషిని నియమించు కొనలేదు. ప్రభు స్థలమునకు అతి సమీపమున గల వేరొక గృహిణి ఒకనాటి అర్ధ రాత్రి సమయమునందు ప్రభు





స్థలము దగ్గర ఒక ఆజాను బాహుడైన ధవళ వస్త్రధారి చేతిలో ఒక చిన్న కఱ్ఱను పట్టుకొని కాపలా కాయుట గాంచెను. తెల్లవారిన పిదప ప్రభు శ్రీమతి యగు వారిజను 'మీరెవరినైనా కాపలా పెట్టినారా?' యన ప్రశ్నించి ఆ రాత్రి తాను గాంచిన వ్యక్తి గురించి వివరించగా శ్రీమతి వారిజ తక్షణమే 'ఆ మహనీయుడు మాకే కాదు ఈ జగత్తు కంతటికి రక్షకుడు, ఆయనే సాయి బాబా' అని చెప్పెను. సాయినాథుడు తాను నమ్మిన వారిని రక్షించుటయే గాక వారి ఆస్తిపాస్తులను సహితము రక్షించుటకు కాపలా దారునిగ మారి తన భక్తుల కొఱకు తాను ఎటువంటి కష్టములైనను అనుభవించునని తెలియజేయు బాబా యొక్క కరుణామృతమును వర్ణింప నెవరికి సాధ్యము?

1987 సం॥ లో హృద్రోగి యైన ప్రభూ తీవ్ర అనారోగ్యముతో బాధపడ సాగెను. విన్నీ తరచు అమెరికా నుండి షిరిడీకి వచ్చి సాయినాథుని మరియు స్వామిజీ చెంత తన తండ్రిని ఆరోగ్యవంతునిగా చేయమని ప్రార్థించెడిది. ఆ సమయంలో స్వామిజీ రామలింగ స్వామి విరచితమైన 'అంబ్రోషియా ఇన్ షిరిడీ' పుస్తకమునిచ్చి "అందరికి అర్థమగు రీతిలో సులభ శైలిలో వ్రాయుము" అని ఆజ్ఞాపించెను. 1987 సం. నవంబరు మాసములో ప్రభు స్వర్గస్తులాయెను. ఆ విచారములో విన్నీ స్వామిజీ చెప్పిన మాటలను ఏ విధముగా అమలు పరచవలెనా యని ఆ లోచించ సాగెను. ఈమె 1994 సంవత్సరములో అమెరికా నుండి తిరిగి వచ్చి షిరిడీలో స్థిర నివాస మేర్పరచుకొని సాయి సేవకే తన జీవితమును అంకిత మొనరించెను.

ఇంతకు పూర్వము ఏ విధమైన రచనానుభవము లేక పోయినను 2000 సంవత్సరములో 'అంబ్రోషియా ఇన్ షిరిడీ' గ్రంథమును కలర్ ఫోటోలతో శులభ శైలిలో అత్యంత సుందరముగా రచించి ప్రచురించెను. మహనీయుల వాక్కులెన్నటికి వృధా పోవని ఈ సంఘటన స్పష్టము చేయుచున్నది గదా! ఈ గ్రంథము బెంగుళూరులో ఆవిష్కృత మైన రోజునే వెయ్యి ప్రతులు అమ్ముడు పోవుట ఈ గ్రంథము యొక్క ప్రాశస్త్యమును తెలియకనే తెలియ జేయుచున్నది. ఈ గ్రంథము హిందీ, కన్నడ మరియు తెలుగు భాషలలోనికి కూడ అనువదించ బడెను. సాయినాథుని మరియు స్వామిజీల ఆశీర్వాద ప్రభావము వలన దీనిని తెనింగించు అదృష్టము నాకు లభించినది. ఈ గ్రంథములో షిరిడీ లోని ముఖ్య దేవాలయములు పూర్తి వివరములతో ఛాయా చిత్ర సహితముగా ముద్రించుటచే షిరిడీని దర్శించే భక్తులకు ఇది మార్గదర్శిగా నుపయోగ

పడుచున్నది. అటు పిమ్మట "అంబ్రోషియా ఇన్ షిరిడీ" రెండవ భాగమును కూడ విన్నీ రచియించి ప్రచురించెను. ఇందులో బాబా మహాసమాధికి పూర్వము జరిగిన లీలలు (సచ్ఛరిత్ర యందు పొందు పరచనవి) పూర్తి వివరములతో వర్ణించ బడెను.

ప్రస్తుతము విన్నీ షిరిడీకి సమీపమున గల కొర్హాలా గ్రామమున బాబా మందిరమును నిర్మించి ఆ మార్గమున వచ్చు బాబా పల్లకీలను తెచ్చు భక్తవరేణ్యులకు అన్ని విధముల సహాయ సహకారము లందించు చుండెను. షిరిడీలో జరుగు ప్రధాన ఉత్సవముల సమయమును పల్లకీలు అధిక సంఖ్యలో తెచ్చు భక్తుల అవసరార్థమై ఉచిత వైద్య సేవలందించుట, భక్తులకు వసతి, ఆహార పానీయములు సమకూర్చుచుండెను. ఈ సమయమందే విన్నీకి మాతృ వియోగము సంభవించెను. అట్టి విపత్కర సమయమునందు కూడా బాబా ప్రచారమును నిరంతరము కొనసాగించు చుండెను. ఇదంతయు బాబా, స్వామిజీలే నా చేత చేయించు చున్నారని సవినయముగా తనను ప్రశ్నించిన వారికి విన్నవించును.

స్వామిజీకి బాబా ఛాయాచిత్రములో అగుపించిన మూడవ వ్యక్తి ఎవ్వరైనదీ స్వామిజీ వివరించలేదు.

స్వామిజీ యొక్క నిస్వార్థ సాయి సేవను, భక్తి తత్పరతలను గుర్తించి నాటి షిరిడీ సాయి సంస్థాన్ కోర్టు రిసీవర్ చావడి బాధ్యతను స్వామిజీకి అప్పగించారు. ఆ రోజుల్లో చావడిని గురువారం మాత్రమే ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉంచే వారు. ప్రతి గురువారం చావడి తెరచి శుభ్రం చేసి ఎంతో అందంగా భక్తుల హృదయాలను అలరించే రీతిన అలంకరించి అచటకు వచ్చిన భక్తులకు సాయి లీలలను వివరించి వారికి బాబా పై గల భక్తి, విశ్వాసాలను పెంపొందించే వారు. చావడి తెరచి ఉన్నంత సేపు అచటనే ఆశీనులై చావడిని అత్యంత పరిశుభ్రముగా నుంచెడి వారు. ఎంతో శ్రద్ధా భక్తులతో చావడి బాధ్యతను నిర్వర్తించు చున్న స్వామిని అందరు **'చావడి బాబా'** యని పిలవ సాగిరి. స్వామిజీ చావడి బాధ్యతను అత్యంత బాధ్యతా యుతముగను, భక్తి, శ్రద్ధలతో నిర్వహించుట గాంచిన కోర్టు రిసీవర్ భక్తులకు పంపే బాబా ప్రసాదం కవర్లపై చిరునామాలు వ్రాసే పనిని కూడ







చావడిలో 'చావడి బాబా'

స్వామికి అప్పగించి అందుకు గాను నెలకు రూ. 15/ గౌరవ భృతిని కూడ ఏర్పాటు చేసి స్వామిజీకి ద్వారకామాయిలో పల్లకి గదికి ప్రక్కనే గల గదిలో నివసించటానికి అనుమతి నొసంగెను. **"ద్వారకామాయి ప్రవేశమే సర్వ దుఃఖ పరిహారము"** ని బాబాయే స్వయముగా నుడివెను. మసీదుమాయి బాబా పాదస్పర్శతో అణువణువు పావనమై సాక్షాత్తు పరబ్రహ్మయైన సాయినాథుని తన అక్కున చేర్చుకొని సాయి లీలను కనులార గాంచి మనసార ఆస్వాదించి సాయి లీలకు సాక్షీభూతమై అందరికి అమ్మయై అలరారు చున్నదీ ద్వారకామాయి. సకల ప్రాణికోటిని ఉద్ధరించునదే ఈ ద్వారకామాయి. సర్వమత సమ్మేళనానికి ఒక ప్రతీక ఈ ద్వారకామాయి. కుల మతాలకతీతమై అందరిపై ఆప్యాయానురాగాలు కురిపించుచు బాధా తప్త మానవులకు ఇదొక మానస సరోవరము. ఇందదుగిడిన ప్రతి వ్యక్తి తన ఉనికినే మరచి మరో ప్రశాంత ప్రపంచంలో అడుగిడిన అనుభూతికి లోనగును. సాయి నాథుడు స్వహస్తములతో ప్రజ్వలింప జేసిన ధుని మాత కూడ ఇందు గలదు. హిందువులకు ఆరాధ్యనీయమైన తులసి బృందావనము, మహమ్మదీయులకు పరమ పవిత్రమైన నింబారు, బాబా ఆశీసుడైన శిల మొ॥ నవి ఎన్నిటికో నిలయమై ఈ ద్వారకామాయి షిరిడీలో ముఖ్య మందిరమై విరాజిల్లు చున్నది. ఇంతటి మహిమాన్విత మందిరము ప్రపంచములో మరెక్కడా కానరాదు. సర్వ మానవులకు ఆరాధ్యనీయమైన మందిరము లుండిన ఉండుగాక సర్వ ప్రాణులను ఉద్ధరించే మందిరము మాత్రము ఇలలో ఇదొక్కటే. ఇంతటి మహిమాన్విత మందిరములో నివసించు భాగ్యము బాబా మన స్వామిజీకి కల్పించాడంటే స్వామిపై సాయినాథుని



కరుణా కటాక్షములు ఏ స్థాయిలో నున్నవో మన ఊహకందనివి. బాబా స్వయముగా స్వామిని తన చెంతకు కోరి రప్పించుకుని ఇంతటి మహద్భాగ్యాన్ని కలిపించాడంటే అది స్వామి చేసుకున్న జన్మ జన్మల పుణ్య ఫలమే కాని వేరొకటి కాదు. స్వామిజీకి ముందు గాని స్వామిజీ మహాసమాధి చెందిన తరువాత గాని మరే భక్తునికి ఇంతటి సదవకాశము లభించ లేదంటే స్వామిజీ ఎంతటి పుణ్య పురుషుడో, ఎంతటి భక్తాగ్రేసరుడో మనందరము గ్రహించి ఆయన అడుగు జాడలలో నడచిన మన జన్మ ధన్య మగుట తథ్యము. బాబా తన ప్రసాదమును స్వామికే చెందేలాగ చేసి, తాను నివసించిన ద్వారకామాయిలోనే నివాసమేర్పాటు చేసి అనంత మైన తన కరుణా కటాక్షములకు అవధులు లేవని నిరూపించు కొనెను.

స్వామిజీ సేవా తత్పరతను, నిరాడంబర, నిరంతర సాయి ప్రచారమును అసంఖ్యాక సాయి భక్తులు గుర్తించి మంచి విలువైన దుస్తులు, దక్షిణలు సమర్పించే వారు. స్వామికి సమర్పించిన ప్రతిదీ సాయికే చెందునని చాలా మంది సాయి భక్తులు ప్రగాఢంగా విశ్వసించేవారు. స్వామిజీ చేతిలో చిల్లి గవ్వ లేక ఆకలితో పస్తులున్న దినములను మరువక అటువంటి దుర్భర బాధ ఇతరులకు కలుగ కూడదని తనకు లభించిన దక్షిణ మొత్తాన్ని అన్న దానానికి వినియోగించే వారు. సాయి భక్తులు తనకు సమర్పించిన విలువైన వస్త్రాలను బీద సాదలకు వితరణ చేసి తాను మాత్రము కొల్లాయి గుడ్డతోనే తన జీవితాన్ని కొనసాగించారు. సాయి తత్వాన్ని నరనరాన జీర్ణించుకుని సాయి నాథుని అడుగు జాడలలోనే జీవనయానము సాగిస్తున్న స్వామిజీ బాబా వలెనె తనకు లభించిన దక్షిణ ధనమును ఏ రోజుకారోజే బీదసాదలకు దానము చేసి సాయంకాలమునకు రిక్త హస్తములతో మిగిలెడి వారు. పైసాలోనే పరమాత్మను దర్శించే వారు కొందరు కాగా, ధనం కోసం ఇతరుల ప్రాణాలను తీసేవారు మరి కొందరు. తరతరాలకు సరిపడినంత సంపాదించినా సంతృప్తి చెందని వారు ఇంకొందరు. శ్రమజీవులు స్వేద బిందువులు చిందించి కట్టిన సౌధములలో సుఖ సౌఖ్యాలనుభవించుచు ఆ సౌదములను నిర్మించిన కూలీల శ్రమకు సరియైన కూలీ కూడ ఇవ్వని వారు మరి కొందరు. ఇతరులను కష్టనష్టాలకు గురి చేసి అన్యాయంగా, అక్రమంగా ధనార్జన చేసి ధనమే సర్వస్వం అన్న భావనతో ఏ రీతిలోనైనా ధనాన్ని కూడబెట్టటమే జీవిత ధ్యేయంగా పెట్టుకున్న వారి సంఖ్యే అత్యధికం. నేటి సమాజంలో ధనం ఎంతో ప్రముఖ





పాత్రను పోషిస్తూ అవధులు లేక కరాళ నృత్యం చేస్తోంది. ప్రతి మానవుడు పైసా కోసం ప్రాకులాడుతూ అనుక్షణం ధనార్జన కోసమే ఆలోచిస్తూ ఈ సర్వ జగత్తుకు మూలాధారం ధనమే నన్న అపోహతో ఎంతో ఉత్కృష్టమైన మానవ జన్మ యొక్క సార్థకతను మరచి పోయి ఎంతో అమూల్యమైన ఈ మానవ జన్మను వృధా చేసుకుంటున్నాడు. Money makes many things (ధనం ఎన్నో పనులు చేస్తుంది) అన్నది నానుడి. Money makes many things but not all the things (ధనం ఎన్నో పనులు చేస్తుంది కాని అన్ని కాదు) అంటే మరింత అర్థవంతముగా ఉంటుంది. మానవుడు ఈ సమాజంలో జీవించటానికి ధనం అవసరమే కాని ఆ ధనమే జీవిత పరమార్థం కాకూడదు. సంపాదన న్యాయార్జితమైనదిగా ఉండాలి అట్టి సంపాదనలో ఎంత చిన్న మొత్తాన్ని సత్కార్యములకు వినియోగించినా బాబా సంతసించి వారిని ఆశీర్వదిస్తాడు అని స్వామిజీ చెప్పేవారు. చెప్పటమే కాదు ఆచరించి ఇతరులకు ఆదర్శ ప్రాయంగా నిలచారు. ధనంతో తనకు పని లేదనియు సాయి సేవయే తన పరమావధియని చెప్పెడి వారు.తనకు భక్తులు సమర్పించిన దక్షిణ ధనాన్ని బీద సాదలకు అన్న దానం, వస్త్రదానం చేయుటకు వినియోగించేవారు. బాబా తనకు లభించిన దక్షిణతో తరచు అన్న దానం చేయుట మనందరికి విదితమే. ఈ అన్న దాన కార్యక్రమములో బాబాయే స్వయముగా అన్ని పనులు చేసి రుచికరమైన మరియు పౌష్టికాహారమును భక్తులకు కొసరి కొసరి వడ్డించెడి వాడు. సాయి బాటలోనే నడచే మన స్వామిజీ కూడ తరచు తానే స్వయముగా అన్నము, సాంబారు తయారు చేసి భక్తులకు అన్న దానము గావించెడి వారు. స్వామిజీ చేతి వంట ఎంతో రుచికరముగా నుండెడిది. స్వామిజీ వచ్చిన వారికి తృప్తికరముగా వడ్డించి వారు భుజించిన తరువాత వారిని సాయి స్వరూపులుగా భావించి వారికి దక్షిణ సమర్పించి తన కోర్కెను మన్నించి వచ్చినందులకు వారికి సాష్టాంగ నమస్కారము చేసి 'అతిథి దేవోభవ' అన్న ఆర్యోక్తిని త్రికరణ శుద్ధిగా ఆచరించే వారు. స్వామిజీ అన్న దాన కార్యక్రమంలో భక్తులు ఎంతో ఉత్సాహంతో పాల్గొనేవారు. స్వామిజీ అన్న దాన కార్యక్రమమున్న రోజున షిరిడిలో అధిక సంఖ్యాకులు వారి గృహములందు వంట చేసుకొనక కుటుంబ సభ్యులందరు స్వామిజీ అన్న దాన కార్యక్రమమునకు అతి సంతసమున విచ్చేసెడి వారు. బాబా సశరీరులుగా నున్నప్పుడు బాబాను దర్శించి బాబా అన్న దాన కార్యక్రమములో పాలుపంచుకొను భాగ్యమునకు నోచుకొనని వారు స్వామిజీ

అన్న దాన కార్యక్రమములో తృప్తిగా భుజించి స్వామిజీలోనే బాబాను చూసు కుంటూ స్వామిజీని మనసార **'బాబా'** అని గౌరవపూర్వకముగా సంభోధించెడి వారు. అన్ని దానములలోకి అన్న దానమే మిన్న యన్న సాయి సూత్రాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మి ఆచరించి ఇతరులకు ఆదర్శప్రాయముగా నిలచిన మన స్వామిజీ ధన్యజీవి. స్వామిజీ అన్న దాన కార్యక్రమమును కనులార గాంచి గ్రామస్తులందరు పాలుపంచుకొనుట గ్రహించి పటేల్ అనే షిరిడీ నివాసి బాసుమతి బియ్యం, వంట చేయుటకు వంట పాత్రలను స్వామిజీకి సమకూర్చేవాడు. పురోహిత్ అనే మరియొక భక్తుడు కూడ వంట పాత్రలకు బాడుగ తీసుకొనకుండా ఉచితంగా ఇచ్చేవాడు. సహృదయంతో ఒక సత్కార్యాన్ని ప్రారంభిస్తే సాయినాథుని స్ఫూర్తితో ఎంతో మంది ఆ కార్యక్రమానికి ఇతోధికంగా సాయమందిస్తారని మనందరము గ్రహించవలెను. అన్నదానము చేసిన తురువాత ఇంకనూ మిగిలిన ధనంతో అనేక భాషలలో వెలువడే సాయి సచ్చరితలు, బాలబాలికల కోసం సులభశైలిలో చిత్రాలతో వెలువడే పుస్తకాలను కొని అందరికి వితరణ చేసేవారు. సాయి మందిరములు నిర్మించే భక్తులకు, అన్న దానము గావించే వారికి, బాబా నామ సప్తాహములు చేసే వారికి ఇతోధికముగా ధనసాయమందించేవారు మన స్వామిజీ. కీర్తి ప్రతిష్టలకు ఆమడ దూరంలో ఉండే స్వామిజీ తన జీవిత కాలంలో ఎక్కడ మందిరాలు గాని ఆశ్రమాలు గాని నిర్మించుట చేయలేదు. తన సహాయముతో జరిగే కార్యక్రమములలో సహితము తన పేరు బహిర్గతము కాకుండ జాగ్రత్త పడేవారు. 'చేసేవాడు, చేయించేవాడు సాయినాథుడు, నేను నిమిత్త మాత్రుడను' అని వినయ విధేయతలతో తెలిపెడి వారు. స్వామిజీ తనకు లభించిన దక్షిణను సాయి సొత్తుగానే భావించి సాయి స్వరూపులైన సాయి భక్తులకే దానిని వినియోగించి తాను మాత్రము **'సాయి సేవకుడు'** మిగిలి పోయారు. **"తన, ధన, మన, అర్పణ తుఝుకో"** అని ప్రతి నిత్యం చావడిలో భజన చేసే స్వామిజీ దానిని త్రికరణ శుద్ధిగా ఆచరించి చూపి అందరికి ఆదర్శ ప్రాయంగా నిలచారు.

నాసిక్ నివాసి శ్రీ రామానంద్ బాబాకి సుమారు 1960 వ సంవత్సరము నుంచి మన స్వామిజీతో పరిచయం గలదు. రామానంద్ బాబా తరచు షిరిడీ వచ్చి బాబాను దర్శించుకుని తిరిగి నాసిక్ వెళుతుండే వారు. వీరు అవధూతల దర్శనార్థము వివిధ ప్రాంతాలు సందర్శించేవారు. రామానంద్ బాబాకు షిరిడీలో చాల మంది దక్షిణ సమర్పించే వారు. అందులో





తమకు అత్యవసర ఖర్చులకు అతి కొద్దిగా ఉంచుకొని మిగిలినది స్వామిజీకి షిరిడీ వచ్చే యాత్రికులకు అన్నదానం, వస్త్ర దానం కొరకు ఇచ్చేవారు. రామానంద బాబా తరచూ విదేహి సతీ అనసూయమాత, పారాడ్‌శింగా (నాగపూర్ జిల్లా, మహారాష్ట్ర) మరియు శబరి మాత (ఆంధ్రప్రదేశ్)లను దర్శించే వారు. మన స్వామిజీ రామానంద బాబాతో వారికి బాబా ప్రసాదాన్ని, ఊదిని పంపి వారి ఆశీస్సులను కోరమనే వారు. శబరి మాత రామానంద బాబాను చూడగానే **"షిరిడీ ప్రసాదం వచ్చింది"** అని అతి సంతోషంతో దానిని స్వీకరించే వారు. రామానంద్ బాబా షిరిడీకి తిరిగి వెళ్ళేటప్పుడు స్వామిజీకి ప్రసాదం పంపే వారు. స్వామిజీ ఏనాడు షిరిడీ దాటి వెళ్ళక పోయినా ఎంతో మంది అవధూతల దర్శనము, ఆశీర్వాదము స్వామిజీకి లభించిన వైనాన్ని స్వామిజీ కృపతో ముందు ముందు మీకు వివరిస్తాను.

సాయికి అంకిత భక్తుడు, ప్రప్రథమంగా బాబాను గురించి దక్షిణ భారత దేశంలో ప్రచారం చేసి మనకందరికీ బాబాను పరిచయం చేసిన పుణ్యమూర్తి శ్రీ నరసింహస్వామిజీ. వీరు తమిళనాడులోని మద్రాసు నగరానికి చెందిన వారు. 1936 సం॥ లో కలిగిన ఒక మహత్తర స్వీయానుభూతి ప్రభావం వల్ల బాబాకు అంకిత భక్తునిగా మారి బాబాను గూర్చి అనేక విషయాలను, లీలలను అత్యంత ప్రయాసలతో సేకరించి వాటిని బహుళ ప్రచారం చేసిన



పావన మూర్తి శ్రీ నరసింహ స్వామిజీ. బాబా ప్రేరణతో వీరు లక్షలార్జిస్తున్న న్యాయవాద వృత్తిని త్యజించి "ఆలిండియా సాయి సమాజ్ - మద్రాసు"ను స్థాపించి దాని వ్యవస్థాపక అధ్యక్ష పదవిని సమర్థవంతంగా నిర్వహించి దక్షిణ భారత దేశంలోనే గాక యావత్ భారత దేశంలోను, విదేశీయులకు సహితం సాయి తత్వాన్ని అందజేసిన ఘనత వీరికే దక్కింది. ప్రతి నిత్యము సాయి భక్తులు పఠించే 'సాయి బాబా అష్టోత్తర శతనామావళి' శ్రీ నరసింహ స్వామిజీ విరచిత మైనదే. శ్రీ నరసింహ స్వామిజీ పట్ల మన స్వామిజీ ఎంతో పూజ్య భావము కలిగి ఉండెడి వారు. ఈ నాడు దక్షిణ భారత దేశం నుంచి కోటానుకోట్ల మంది బాబా భక్తులయ్యారంటే దానికి మూల పురుషుడు శ్రీ నరసింహ స్వామిజీనే. ఈయన భక్తులు షిరిడీ వచ్చి బాబాను దర్శించుకొని బాబా

భజనలు, కీర్తనలు గానం చేయుట, భక్తులకు విరివిగా అన్న దానము చేయుట చేస్తుండే వారు. శ్రీ నరసింహ స్వామీజీ తరువాత అంతటి కృషి సల్పిన వారు శ్రీ రాధాకృష్ణ స్వామీజీ మరియు శ్రీ కేశవయ్య స్వామీజీ. మన స్వామీజీ షిరిడీ చేరిన క్రొత్తలో సాయిని సేవించి తరించిన అనేక భక్తులు షిరిడీ వచ్చేవారు. స్వామీజీ వారికి అన్ని సదుపాయములు సమకూర్చి వారితో కలసి మెలసి తిరుగుతు వారినుంచి అనేక సాయి జీవిత విశేషాలను, బాబా మహాత్మ్యాలను సేకరించి మన తరం వారికి అందిచారు. అటువంటి విశేషాలను బాబా భక్తులకు తెలియజేసి వాటిని మాస పత్రికలలోను చిన్న, చిన్న పుస్తకాల గాను ప్రచురించమని ప్రోత్సహించే వారు.

స్వామీజీ సాయిసేవలో తానింకా బాల్య దశలనే ఉన్నానని గ్రహించి మరింత పట్టుదలతోను, ఉత్సాహంతోనూ సాయి సేవను కొనసాగించారు.

స్వామీజీ ప్రతి నిత్యం షిరిడీలోగల మందిరాలలో 13 దీపాలను (ద్వారకామాయిలో 5, చావడిలో 2, గురుస్థానంలో 2, దీక్షిత్ వాడాలో 1, పూర్వం సత్యనారాయణ వ్రతాలు జరిగే పై అంతస్థులో 1, సమాధి మందిరంలో 1, లక్ష్మీమందిరంలో 1) వెలిగించే వారు.

ఏ భక్తుడైనా ఆర్తితో 'సాయీ' అని పిలవగానే సాయినాథుడు కరుణించి కనికరిస్తాడని మనందరికీ తెలుసు. అటువంటి సాయికి తన సర్వస్వాన్ని సమర్పించిన స్వామీజీని ఉపేక్షిస్తారా! సాయినాథుడు మన స్వామిని ఏ తీరున కరుణించినదీ తెలియచేయటానికి ఈ క్రింది సంఘటనలే సాక్ష్యం.

స్వామీజీని షిరిడీకి వచ్చే భక్తులంతా గౌరవ మర్యాదలతో చూడటం, దక్షిణ, నూతన వస్త్రాలను బహుకరించడము, రిసీవరు చావడి బాధ్యతను అప్పగించి నెలకు రూ.15/- గౌరవ వేతనం ఏర్పాటు చేయుట, స్వామీజీ గౌరవము దిన దినాభి వృద్ధి చెందుట గాంచిన స్వామీజీ మిత్రుడొకడు అసూయా ద్వేషములతో స్వామీజీకి బాబా ప్రసాదంలో ప్రాణాంతకమైన విషమును కలిపి తినిపించాడు. ఆ ప్రసాదమును స్వీకరించిన స్వామీజీ వాంతులు, విరేచనములతో చిక్కి శల్యమయ్యారు. స్వామీజీ ఆరోగ్య పరిస్థితి దిన దినమునకు దిగజారి ప్రాణాంతకము కాగా షిరిడీ సంస్థాన్ ఆస్పత్రిలో చేర్పించారు. మాసము రోజులు ఆస్పత్రిలో ఉండి మందులు వాడినా గాని





స్వామీజీ ఆరోగ్యంలో కించిత్తైనా మార్పు రాలేదు. వైద్యులు తమవల్ల కాదని ఆస్పత్రి నుండి పంపివేసినారు. స్వామీజీ మిత్రుడైన కరుణాకరన్ తుకారం పరదేశి అనే అతని ఇంటిలో ఒక గదిలో బాడుగకు ఉండేవాడు. అతనే స్వామీజీని తన గదికి తీసుకు వచ్చి ఉంచుకున్నాడు. ఇంటి యజమాని స్వామీజీ పరిస్థితికి చాల భయపడ్డాడు. కరుణాకరన్ స్వామీజీ గురువుగారైన ముత్తయ్య గారికి ఈ విషయమంతా విపులంగా జాబు ద్వారా తెలుపగా వారు వెంటనే జరీ బుట్టి మొదలగు ఆయుర్వేద మందులతో షిరిడీకి వచ్చి నెల రోజుల పాటు వైద్యం చేయటంతో స్వామీజీ శరీరంలోని విషమంతా పోయి సంపూర్ణ ఆరోగ్యవంతులైనారు. ముత్తయ్య గారు భక్త నివాస్‌లో బస చేస్తూ స్నానం చేయటానికి రామచంద్ర దేశ్‌ముఖ్ ఇంటికి వెళ్ళేవారు. స్వామీజీ ఆరోగ్యవంతులైన పిదప ఓంకారేశ్వర్ వెళ్ళి తలనీలాలు సమర్పించి రమ్మని పంపారు. స్వామీజీ ఓంకారేశ్వర్ వెళ్ళి తన గురువు గారు ఆజ్ఞాపించిన రీతిన మ్రొక్కు చెల్లించి వెంటనే షిరిడీకి తిరిగి వచ్చారు. తమ ప్రియతమ శిష్యులను రక్షించుటకు గురువు ఎంత శ్రమిస్తాడో తెలుసుకొనుటకు ముత్తయ్య గారే ఒక ఉదాహరణ. గురువాజ్ఞను ఏ రీతిగా ఉత్తమ శిష్యుడు శిరసావహిస్తాడో తెలుసుకొనుటకు మన స్వామీజీ మనకు ఆదర్శము. అటు పిమ్మట స్వామీజీ తన మహాసమాధి పర్యంతము వరకు షిరిడీ పొలిమేరలు దాటి వెళ్ళలేదు. స్వామీజీ షిరిడీలో ప్రవేశించిన తరువాత రెండు పర్యాయములు మాత్రమే షిరిడీ పొలిమేరలు దాటిన వైనం భక్తులు గ్రహింతురు గాక! స్వామీజీపై విష ప్రయోగం చేసిన వ్యక్తి ఎవరో స్వామికి తెలిసినా అతనిపై ఏ మాత్రం ఆగ్రహించక పోగా పూర్వం వలెనే అతనితో తన స్నేహాన్ని కొనసాగించారు. తనను హత్య చేయదలచిన వ్యక్తిని సహితం క్షమించి అతనికి మిత్రత్వంలోని మాధుర్యాన్ని, అనురాగాన్ని పంచి ఇచ్చిన మమతానురాగ మూర్తి మన స్వామీజీ. కక్షలు కార్పణ్యాలతో రావణా కాష్టమునే మరిపించే నేటి సమాజంలో స్వామీజీ వంటి ఉత్తములు, సాత్వికులు ఉండబట్టే ఈ ధరిత్రిపై ధర్మం, న్యాయం మిగిలి ఉన్నాయి. సాయినాథుడు సదా బోధించే శ్రద్ధ, సహనాలను నరనరాన జీర్ణింప చేసుకొని తాను చేసే ప్రతి పనిని అత్యంత శ్రద్ధతోను, ఓర్మితోను చేసేవారు. సాయి భక్తులంతా ఇదే విధంగా నడచుకుంటే ఈ భువి దివికంటే మిన్నయే యగును కదా!

స్వామీజీకి మరొక పర్యాయము అనారోగ్యం చేసినప్పుడు లెండీబాగ్



బుడ్కి

లోని బాబా బావి 'బుడ్కీ' నీరు త్రాగి ఊదిని సేవించి నాలుగు హారతులకు హాజరు కాగ కొద్ది రోజులలోనే స్వామీజీ పూర్తి ఆరోగ్యవంతులయ్యారు. స్వామీజీకి ఏ అనారోగ్యం కలిగినా ఊదిని మాత్రం సేవించే వారు. భక్తులు తెచ్చిన మందులను భక్తుల తృప్తి కొరకే తీసుకునే వారు. స్వామీజీ ఎల్లప్పుడు ఊదీ దివ్య ఔషధం అని ఎటువంటి రోగగ్రస్తులైన బాబాపై విశ్వాసం ఉంచి సేవిస్తే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చెప్పేవారు.

బాబా మహాసమాధి చెందిన తరువాత భక్తులు చాల తక్కువ సంఖ్యలో షిరిడీకి వచ్చే వారు. చాల అరుదుగా వి.ఐ.పి. లు వచ్చే వారు. ఆ రోజుల్లో బాబా లేని షిరిడీలో ఏమున్నదనుకునే వారు సామాన్యులు. కానీ ***"నా సమాధి మాట్లాడుతుంది నా ఎముకలు మీ ప్రశ్నలకు జవాబిస్తాయి"*** అని అభయమిచ్చిన బాబా మహాసమాధి చెందిన తరువాత కూడ తన నాశ్రయించిన వారి మనోవాంఛల నీడేర్చుతూ తనను నమ్ముకున్న వారి నమ్మికను వమ్ము చేయక వారిపై తన కరుణా రసాన్ని కురిపించుట వల్ల ఈనాడు ప్రతినిత్యం లక్షలాది భక్తులు షిరిడీని దర్శించి పునీతులవుతున్నారు. పూజ్య శ్రీ నరసింహ స్వామీజీచే విరచించ బడిన గ్రంథాలు చదివి కొంత మంది, శ్రీ మనోజ కుమార్ నిర్మించిన 'షిరిడీ కే సాయి బాబా' చలన చిత్రాన్ని చూచి మరి కొంత మంది బాబాను గురించి తెలుసుకొని షిరిడీకి వచ్చే భక్తుల సంఖ్య దిన దినాభి వృద్ధి చెందెను.

స్వామీజీకి కలిగిన ప్రతి చిన్న అసౌకర్యం నుంచి ప్రాణాంతకమైన విష ప్రయోగాల నుంచి కూడ సాయి కాపాడిన వైనాన్ని ఇంతవరకు చదివారు. ఇవే గాక సాయి స్వామిని మరెన్నో ఆపత్తుల బారి నుండి ఆదుకున్న వైనాన్ని సాయి అనుగ్రహంతో ఇప్పుడు మీ ముందుంచుతాను.

ఒకనాటి రాత్రి స్వామీజీ లెండీబాగ్ నుంచి తిరిగి వస్తున్న సమయంలో ఒక నాగు పాము దారికి అడ్డంగా పడగ విప్పి నిల్చుంది. ఆ నాగును గాంచిన స్వామీజీ ఏమాత్రం తత్తరపాటు పడక బాబాపై భారం వేసి "నన్ను వెళ్ళనివ్వు







లేక నీవైనా వెళ్ళు" అనగా ఆ నాగు స్వామీజీకి దారి ఇచ్చి తన దారిన తాను వెళ్ళి పోయింది. మరొక పర్యాయం కూడా స్వామీజీకి పాము తారస పడగా అక్కడకు అతి సమీపమున నున్న సంస్థాన్ వాచ్‌మెన్ పామును కర్రతో కొట్టబోగా స్వామీజీ అతనిని వారించి ప్రక్కకు తీసుకు వెళ్ళారు. అంతలోనే ఆత్మానంద స్వామీజీ ఆ వాచ్‌మెన్ దగ్గర నుండి కర్రను తీసుకొని పాముకు అతి సమీపముగా వెళ్ళి కర్రతో దానికి రెండు వైపులా కొట్టి దారి చూపంచగా ఆ నాగు ఆ దారి వెంబడి వెళ్ళిపోయింది. ***"శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు"*** అని బాబా అనేక సందర్భాలలో తన భక్తులకు వివరించారు. బాబా అడుగు జాడలలోనే తన జీవితాన్ని కొనసాగిస్లున్న స్వామీజీ ప్రాణాంతకమైన విష సర్పములను సహితము సంహరింపక వాటిపై కనికరము చూపి తన జీవితమును ధన్యత చేసుకున్న మహామనీషి మన శివనేశన్ స్వామీజీ.

స్వామీజీకి ఎంతటి విపత్తు కలిగినా దానిని ఓర్మితో భరించే వారే కాని సాయి సేవను మాత్రం నిర్లక్ష్యం చేసేవారు కాదు. స్వామికి తనపై గల ప్రగాఢ విశ్వాసానికి మెచ్చిన సాయి స్వామిని ఎంతో ఉన్నత స్థితికి తీసుకు వెళ్ళారు. కొన్ని కొన్ని సందర్భాలలో ముందు జరగబోయే సంఘటనలను స్వామికి తెల్పేవారు. ఒక రోజు తెల్లవారు ఝామున ద్వారకామాయిలో బాబా పటాలకు గంధపు బొట్లు పెట్టి అలంకరిస్తున్న సమయమున "ఇప్పుడు కొంతమంది భక్తులు వస్తారు. వారి కుమారుడు ఇల్లు వదలి వెళ్ళిపోయినాడు. నేటినుండి సరిగ్గా మూడవ దినాన వారి కుమారుడు వారిని చేరుతాడు" అని చెప్పమని తమిళంలో బాబా చిత్రపటం నుండి మూడు పర్యాయములు వినిపించింది. అంతలోనే తమిళంలో సంభాషించుకుంటూ కొంత మంది భక్తులు ద్వారకామాయిలో ప్రవేశించడం గమనించిన స్వామీజీ వారి చెంతకు వెళ్ళి ఇల్లు విడచి వెళ్ళిపోయిన వారి కుమారుడు మూడవ రోజున వారింటికి

వస్తాడని బాబా చెప్పమని తనను ఆజ్ఞాపించారని చెప్పగానే వారు ఆశ్చర్య చకితులయ్యారు. వారి కుమారుడు తప్పిపోయిన వైనం వారెవ్వరికి చెప్పలేదు. వారు స్వామికి నమస్కరించి ఆ సాయంత్రమే తిరుగు ప్రయాణానికి సన్నాహాలు చెసుకున్నామని స్వామి చెప్పిన విధంగా జరిగితే వెంటనే తెలియ చేస్తామని చెప్పి శలవు తీసుకున్నారు. ఈ కలియుగంలో బాబా వాక్కుకు ఎదురు లేదని ఋజువు చేస్తూ ఆతప్పి పోయిన వారి కుమారుడు మూడవ నాటికి తనంతట తానే ఇంటికి వచ్చి తల్లిదండ్రులను కలిసాడు. ఇటువంటి అనేక లీలలు చేసిన బాబా వాటికి స్వామిని కారణ భూతునిగా చేసేవారు. మరి కొన్ని సందర్భాలలో బాబా స్వామిజీ రూపంలో దూర ప్రాంతాలలో సహితం దర్శన మిచ్చి వారి బాధలు నివారించేవారు.

కరుణాకరన్ అనే భక్తుడు షిరిడీలో గల 'స్వామి మద్రాసు' హోటల్‌లో పనిచేస్తూండే వాడు. స్వామిజీకి మంచి మిత్రుడు కూడా. ఇతను ఉబ్బసము వ్యాధితో బాధపడేవాడు. ఒక నాటి రాత్రి విపరీతంగా ఆయాసము వచ్చి ద్వారకామాయిలో దుప్పటి కప్పుకొని స్తంభానికి ఆనుకుని కూర్చుని బాబా నామస్మరణ చేస్తుండగా స్వామి అతను కప్పుకున్న దుప్పటి లాగి ఒక మూలికనిచ్చి "దీనిని నోట్లో పెట్టుకో, నీ బాధ తగ్గుతుంది" అని చెప్పారు. కానీ అతను ఆ మూలికను జేబులో వేసుకొని తెల్లవారిన తరువాత స్వామిని ఆ విషయం అడుగగా స్వామిజీ తానా సమయంలో తమ గదిలోనే ఉన్నట్లు తాను ఏ మూలికనూ ఇవ్వలేదని చెప్పారు. కరుణాకరన్ ఆ మూలికను తీసి చూపించగా, ఇది బాబా లీలయే గాని మరొకటి కాదని ఇరువురు గ్రహించారు. ఆ మూలికను తిన్న కరుణాకరన్‌కు ఛాతిలో పేరుకున్న కఫం బయటకు వచ్చి ఉపశమనం కలిగింది. ఆ మూలికలో కొంత భాగాన్ని తీసుకున్న స్వామిజీ దాని పేరు తెలుసుకొని తమ భక్తుల ద్వారా దానిని సేకరించి ఉబ్బసం ఉన్న వ్యక్తులకు ఇవ్వగా అది దివ్యౌషధంగా పని చేసింది.

నేను (ఈ గ్రంథ సంకలన కర్త) 1985 ఫిబ్రవరి మాసములో కుటుంబ సమేతంగా బాబా దర్శనానికి షిరిడీ వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన స్వామిజీ ఎంతటి నిరాడంబరుడో, బాబా కృపాకటాక్షములు ఆయనకు ఎంతగా లభించినవో మీకందరికి తెలియజేస్తుందన్న విశ్వాసంతో మీ కందిస్తున్నాను. ఒక రోజు కాకడ హారతి పూర్తి అయిన పిమ్మట ద్వారకామాయి ప్రక్కనుంచి





వెళుతుంటే స్వామిజీ నాకు ఎదురు వస్తున్నారు. ఆయన ఎవరో అప్పటి వరకు నాకు తెలియదు. ఇంతలోనే షుమారు పది మంది ఆంధ్రా నుండి వచ్చిన భక్తులు ఆయనను చుట్టుముట్టి పాద నమస్కారాలు చేస్తుంటే ఆయన విసుగుతో "పొండి, పొండి నా కెందుకు నమస్కారాలు చేస్తారు, బాబా దగ్గరకు పొండి" అని కసురు కుంటూ వారిని తప్పించు కోవటానికి ప్రయత్నిస్తుండగా ఆ భక్తులలో ఒకరు "మీరు మా అమ్మాయికి జ్వరం వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చి మా అమ్మాయి నుదుట ఊదిని పెట్టగానే నెల రోజుల నుండి జ్వరంతో బాధపడుతున్న మా అమ్మాయికి స్వస్థత చేకూరింది" అని చెప్పగా స్వామిజీ తానెవరింటికీ వెళ్ళలేదనీ, వారెవరో తనకు తెలియదని ప్రక్కనుంచి వెళ్ళబోతుంటే ఆరు లేక ఏడు సంవత్సరాల వయసున్న చిన్న పాప స్వామిని చూపించి "ఈ తాతే నాకు జ్వరం వచ్చినప్పుడు బొట్టు పెట్టారు" అని చెప్పింది. బాబాయే తన రూపంలో దర్శనమిచ్చారని, అది బాబా లీలేననియు, బాబానే నమ్ముకోమని వారికి తెలిపి తన దారిన తాను వెళ్ళి పోయారు.

ఇంతటి మహిమలు గల స్వామిజీ తాను ***"సాయి సేవక్"*** (సాయి సేవకుడు) నని మాత్రమే చెప్పుకునే వారు. సాయి భక్తుడనని కూడా చెప్పటానికి సాహసించే వారు కాదు. ఆడంబరాలకు ఆమడ దూరంలో ఉండే వారు. ప్రతి నిమషం ఆయనకు ఎంతో విలువైనది. ప్రతి క్షణాన్ని సాయి సేవకే వినియోగించే వారు. సాయి భక్తులు తమ జీవితాలను ఎలా మలచుకోవాలి, సాయి సేవను ఏ విధంగా చేయాలి, సాయి కరుణా కటాక్షాలను ఏ తీరున పొందాలి తెలుసు కోవటానికి స్వామిజీ జీవిత విధానమే మనకు మార్గ దర్శకం. సాయి సేవలో అగ్రగణ్యులైన స్వామిజీ జీవితం ఒక తెరచిన పుస్తకం. అందులోని ప్రతి అక్షరం అమృత తుల్యమే. అందులో నుంచి ఒక్క అమృత బిందువును మనం ఆస్వాదించినా మన జన్మ సార్థక మగును.

ఈ నాడు ఆంధ్రప్రదేశ్ నుంచి షిరిడీ దర్శించే భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్న సంగతి మీకందరకూ విదితమే. షిరిడీలో ఎక్కడ చూచిన ఎక్కువగా తెలుగు మాట్లాడే వారే తారస పడతారు. తెలుగునాట మారుమూల పల్లెలలో సహితం బాబా మందిరాలు వెలిశాయంటే అతిశయోక్తి కాదు. ఆంధ్రప్రదేశ్‌లో బాబా ప్రచారం ఇంత విస్తృతంగా జరగటానికి మూలకారణం మన పూజ్య స్వామిజీయే. తెలుగు భాషలో ప్రథమంగా బాబా

సంపూర్ణ జీవిత చరిత్రను శ్రీ పత్తి నారాయణ రావు గారు ***"బాబా సంపూర్ణ జీవిత చరితము"*** అనే నిత్య పారాయణ గ్రంథాన్ని అందించగా దాని తురువాత ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు అందించిన ఆణిముత్యం ***"సాయి లీలామృతం".*** ఈ గ్రంథరాజము నిజంగా సాయి భక్తులకు ఒక అమృత భాండమే. దీని తరువాత ప్రముఖ నటుడు శ్రీ విజయచందర్ బాబా పాత్రను పోషించగా విడుదలైన చిత్రం ***"శ్రీ షిరిడీ సాయి బాబా మహాత్మ్యం"*** . వీటివల్ల సాయి లీలలను చవి చూచిన అసంఖ్యాక ప్రజానీకం బాబాకు అంకిత భక్తులుగా మారి షిరిడీని దర్శించటం ప్రారంభించారు. అన్నిటికంటె అతి ప్రభావితం చేసినవి ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి కలం నుండి జాలువారిన ఆణిముత్యాలు. ఈయనను సాయి భక్తులందరు గౌరవ పూర్వకంగా **'మాస్టారు'** అని సంభోదిస్తారు. ఈయన షుమారు రెండు దశాబ్దాల కాలం శ్రమించి బాబాను దర్శించి సేవించిన భక్తులనుంచి వారి వారసుల నుంచి మరియు అనేక భాషలలో వెలువడిన సాయి బాబా గ్రంథాలను పరిశోధించి ***"సాయి లీలామృతం"*** లో పొందు పరిచారు. వీరి కృషిని ప్రోత్సహించి, ఇతర భాషల (ముఖ్యంగా మరాఠీ)లో వెలువడిన అసాంఖ్యాక సాయి లీలలను అనువదించి మరియు తాను సేకరించిన సాయి లీలలను మాస్టారు గారికి అందించిన అమృతమూర్తి మన పూజ్య శ్రీ శివనేశన్ స్వామిజీయే. ఈ విషయాన్ని మాస్టారే స్వయంగా తమ గ్రంథాలలో పేర్కొన్నారు. మాస్టారు గారిని గురించి వారి కృషిని గురించి నేను మీకు తెలియ జేయటం కొంతవరకు హాస్యాస్పదమే యగును. మన పూజ్య స్వామిజీని గురించి ప్రథమంగా తెలుగు వారికి పరిచయ మొనర్చిన మాస్టారు గారి గురించి కొంతైనా ప్రస్తావించక పోతే అది తెలిసి చేసిన తప్పిదమే గాక ఈ గ్రంథం అసంపూర్ణమే యగును. వీరు బాబాను గూర్చి ప్రథమంగా వెలువరించిన గ్రంథరాజమైన సాయి లీలామృతం నాటికి నేటికి ఏనాటికీ కూడ ప్రామాణికమైనదని చెప్పటంలో ఏమాత్రము అతిశయోక్తి లేదు. వీరు రచించిన ప్రతి గ్రంథము ఒకదానికి మించి మరొకటి. దేనికదే సాటి. ఒక్క బాబాను గురించే గాక







అనేక అవధూతల చరిత్రలను మన కందించిన ఘనత మాస్టారు గారిదే. ఈయన తన చివరి శ్వాస వరకు తన జీవితాన్ని బాబా సేవకే అంకితం చేసిన పావనమూర్తి. తనకు లభించిన అత్యుత్తమైన ఐ.ఏ.యస్. ఉద్యోగమును సహితం త్రోసిరాజని తన జీవితాన్ని బాబా సేవకే అంకితం చేయటమేగాక బాబా తత్త్వాన్ని అతి విపులంగా అందరికి అందించి తన శిష్యుల హృదయాలలో స్థిర నివాస మేర్పరచుకున్న ధన్యజీవి మన మాస్టారు. వీరు రచించిన అనేక గ్రంథాలు ఆంగ్లము, హిందీ, తమిళం, మలయాళం మొ॥ భాషలలోకి అనువదించబడి ప్రపంచ ప్రఖ్యాతి గాంచినవి. వీరు అర్ధ శతాబ్ది కాలమే జీవించినా సాయి భక్తులకు అనేక జన్మలకు సరిపడా సాయి లీలామృతాన్ని అందించిన అమరజీవి. నేడు మాస్టారు గారే మన మధ్యన ఉంటే స్వామిజీ సేవా తత్పరతను చక్కటి శైలిలో మరే ఇతర గ్రంథానికి సాటిలేని గ్రంథంగా మలచి మనకందించి ఉండేవారు. షిరిడీని దర్శించిన ఏ భక్తుడైనా షిరిడీ మహారాష్ట్రలో నున్నదా లేక ఆంధ్రప్రదేశ్‌లో నున్నదా అన్న అనుమానం కలగటం సహజం. దీనికి కారణం షిరిడీని దర్శించే భక్తులలో అత్యధిక శాతం ఆంధ్రులు కావటమే. దిన దినానికి పెరుగుతున్న ఆంధ్ర భక్తులను చూచిన స్వామిజీ తెలుగు వారు బాబాను ఆంధ్ర రాష్ట్రం తీసుకు పోతారేమోనని అనుమానం కలుగుతోందని ఛలోక్తిగా అనే వారు. స్వామిజీకి షుమారు పది భాషలలో ప్రవేశమున్నది. మరాఠి, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, ఆంగ్లము, మొ॥ భాషలు మాట్లాడ గలగటంతో సాయి లీలలను భక్తుల యొక్క మాతృ భాషలో వివరించ గలిగేవారు. దీని వలన భక్తులు సులభంగా అర్థం చేసుకో గలిగేవారు. సాయి లీలలను వివరించేటప్పుడు స్వామిజీ తన్మయులై తమ కళ్ళెదుట కదలాడుతుంటే ప్రత్యక్షంగా గాంచి దానిని వివరిస్తున్నారా అనిపించెడిది.

ఎవ్వరైనా బాబాను చులకన చేసి మాట్లాడినా లేక సాయి తత్వాన్ని తప్పుగా వివరించినా వారితో వాదించి వారికి సాయి నిజతత్వాన్ని తెల్పి వారిని సాయి మార్గంలో నడిపించేవారు.

ఒక పర్యాయం ఆర్య సమాజానికి చెందిన ఒక వ్యక్తి విగ్రహారాధన కూడదని వాదిస్తుంటే, ఒక షాపు యజమాని మరిద్దరు సంస్థాన్ ఉద్యోగులు అతని వాదాన్ని బలపరచ సాగారు. అంతలోనే స్వామిజీ అక్కడకు వెళ్ళి షాపు యజమానితో విగ్రహారాధన మంచిది కానప్పుడు బాబా చిత్రపటాలను,

విగ్రహాలను, లాకెట్లను నీ వెందుకు అమ్ముతున్నావని ప్రశ్నించగా అతను నిరత్తురుడయ్యాడు. బాబా సమాధి అన్ని సమాధుల వంటిదే అయితే దానిని దర్శించాటానికి నిత్యము వేలాది మంది భక్తులు షిరిడీకి వస్తున్నారు? బాబా విగ్రహాన్ని మలచే సమయంలో బాలాజీ వసంతరావ్ తాలీం (బాబా విగ్రహాన్ని మలచిన మహా శిల్పి) కి స్వప్న దర్శనం ఇవ్వలేదా? నేటికి బాబా అనేక మంది భక్తులకు సశరీరులుగా దర్శనమిచ్చి వారిని బాధా విముక్తులను చేస్తున్న వైనం మీకు తెలియదా? అని సంస్థాన్ ఉద్యోగులను ప్రశ్నించగా వారు స్వామీజీ చెప్పిన నగ్న సత్యాలను ఖండించ లేక మౌనం వహించారు.

స్వామీజీ వాగ్ధాటికి ముగ్దుడైన ఆర్య సమాజానికి చెందిన వ్యక్తి, "భగవంతుడు నిర్గుణ స్వరూపుడని వేదాలు వక్కాణించు చున్నవి గదా, మరి అటువంటప్పుడు బాబా భగవంతుడా లేక భగవంతుని అవతారమా?" అని వినయ విధేయతలతో ప్రశ్నించగా స్వామీజీ ***"బాబా జ్యోతి స్వరూపుడు. నిర్గుణుడైన ఆ భగవంతుని సామాన్యుల మైన మన మదిలో నిల్పి ధ్యానించుట కష్టసాధ్యమని మన యందు దయదలచి మాయా శరీరంతో ఒక ఆకారాన్ని ధరించి ఆ రూపాన్నే మన మదిలోను హృదిలోను పదిలంగా నిలుపుకోవటానికే సాక్షాత్తు ఆ పరబ్రహ్మమే సాయిగా అవతరించారు"*** అని వివరించారు. ఎల్లప్పుడు ఒకే రూపాన్ని ధ్యానించటం మంచిదని ఆ రూపం మన మదిలో చిరస్థాయిగా నిలచి ధ్యాన మార్గాన్ని సుగమం చేస్తుందని శలవిచ్చారు మన స్వామీజీ.

సాయి భక్తులు బాబా మందిరాలు నిర్మిస్తున్నామని గాని మరికొంతమంది బాబా గ్రంథాలను ప్రచురిస్తున్నామని ఆ కార్యక్రమం జయప్రదంగా జరగాలని ఆశీర్వదించమంటే "పొండి, పొండి, బాబాకు చెప్పుకోండి, బాబాను వేడుకోండి అంతా ఆయనే చేయించుకుంటాడు, బాబాకే చెప్పుకోండి" అనే వారు. స్వామీజీ మాటలను సరిగా అర్థం చేసుకోలేని వారు స్వామి కసురు కుంటున్నారనుకునేవారు కాని స్వామీజీ దృష్టిలో సర్వం సాయి మయమే అంతా ఆయనలోనే ఉంది, అన్నిట సాయానాథుడే ఉన్నాడు, చేయించేది, చేయించుకునేది కూడ సాయినాథుడే మనం నిమత్త మాతృలం అని స్వామీజీ ప్రగాఢంగా విశ్వసించే వారని మనం అర్థం చేసుకోవాలి.

స్వామీజీ ఎల్లప్పుడు సాయి సర్వాంతర్యామి, అంతటా, అందరిలోను, అన్నిటిలోను సాయి ఉన్నాడు, సాయి లేనిదే ఈ జగత్తు లేదు అని ఘంతాపథంగా





చాటేవారు. వ్యాపార సరళి సరిగా తెలియని ఒక వర్తకుడు షిరిడీలో అంగడి పెట్టుకుని విపరీతంగా నష్టపోయాడు. స్వామిజీ ద్వారకామాయిలో ఉండగా కోపంతో అక్కడకు వచ్చి "సాయి సర్వాంతర్యామి, అంతటా ఉన్నాడు, అన్నిటిలోను ఉన్నాడు అని మీరు చెపుతున్నారు గదా! అది నిజమేనా!! నిరూపించగలరా?" అని ఎంతో ఉద్వేగంతో ప్రశ్నించగా స్వామి అంతకంటే ఎన్నో రెట్లు ధృడంగా "అవును నిజమే" అని సమాధాన మివ్వగా ఆ వచ్చిన వ్యక్తి చేతిలో గల ఖాళి అగరు బత్తి ప్యాకెట్టును నేలపై విసిరి "ఇందులో కూడా బాబా ఉన్నాడా? ఉంటే చూపించు" అని స్వామికి సవాలు విసిరాడు. అగరు బత్తి ప్యాకెట్టు నేలకు తాకి కొంత దూరం జారి అందులో నుండి సాయి బాబా ఫొటో బయటకు వచ్చింది. ఇది గాంచిన ఆ వ్యక్తి అచేతనుడవ్వగా స్వామీజీ అతనిని ఓదార్చి "సాయిని నమ్ముకున్న వారిని సాయి ఎన్నడు అలక్ష్యం చెయ్యడు. ఆయననే విశ్వసించి ఆయన యందు ధృఢ భక్తిని కల్గి ఉండు నీకు మేలు జరుగుతుంది" అని స్వాంతన వచనములు పలికి అతనిని పంపించి వేసినారు. అతను సాయిని భక్తి, విశ్వాసాలతో కొలవగా అనతి కాలముననే అతని వ్యాపారం వృద్ధి చెంది లాభాలు గడించి భార్యా పిల్లలతో సుఖంగా జీవితాన్ని కొనసాగించాడు. ***"నన్ను నమ్మిన వారినెన్నడును నేను పతనం కానివ్వను"*** అన్న బాబా అభయం మరొకసారి రుజువైనది. బాబా యందు ధృఢ భక్తి, విశ్వాసాలు గలవారి చెంతకు చింతలు చేరవు.

స్వామీజీ ఎల్లప్పుడు ***" బాబా నామ రూప రహితుడు, జనన మరణాల కతీతుడు. నిర్గుణుడు. సాక్షాత్తు పరబ్రహ్మ"*** ఈ సత్యము నెరింగి సాయిని సేవించు వారు సాయిలోనే ఐక్యమొందును అని చెప్పెడి వారు.

షిరిడీకి వచ్చే భక్తుల సంఖ్య దిన దినాభివృద్ధి చెందటంతో చావడిని ప్రతి నిత్యం తెరచి ఉంచడం మొదలు పెట్టారు. సంస్థాన్ వారు స్వామీజీకి కొంత విశ్రాంతి కల్పించాలనే సదుద్దేశ్యంతో స్వామీజీని చావడి బాధ్యతల నుండి తప్పించారు. దాని తరువాత స్వామీజీ చావడిలో ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం జరిగే భజన కార్యక్రమంలో పాల్గొనే వారు. ఉదయం భజన కార్యక్రమం సమాధి మందిరంలో జరిగే అభిషేకానికి, పూజా కార్యక్రమాలకు అంతరాయం కలుగుతోందని సంస్థాన్ వారు ఉదయం భజన కార్యక్రమమును ఆపివేశారు. సాయంత్రం భజన మాత్రం ప్రతి నిత్యం స్వామీజీ మహాసమాధి

చెందే వరకు కొనసాగింది. షుమారు రెండు దశాబ్దాలు ప్రతి నిత్యం చావడిలో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు స్వామీజీ.

స్వామీజీ ఎప్పుడు భక్తికి మూడు మెట్లని అందు మొదటిది పూజ, రెండవది భజన, సత్సంగము కాగా మూడవది ధ్యానం అని చెప్పేవారు. ఏ భక్తుడైనా పూజను నిర్వహించేటప్పుడు మనస్సును పూర్తిగా ఆ కార్యక్రమంలో నిమగ్నం చేయుట కష్టమనియు, భజనలోను, సత్సంగములోను పాల్గొనే భక్తులు చాల వరకు నిమగ్నతను సాధిస్తారని తరువాత భగవంతుని గూర్చి సరియైన అవగాహన నేర్పరచుకుని నిర్గుణ స్వరూపుడైన ఆ భగవంతుని ఆరాధించడానికి ధ్యానం దోహదం చేస్తుందని చెప్పేవారు. నిర్గుణ స్వరూపి యైన సాయి భక్తోద్ధరణ కోసం సాకార రూపాన్ని ధరించాడు కాబట్టి ఎల్లప్పుడు ఒకే రూపాన్ని ధ్యానిస్తే మంచిదని వచించేవారు.

స్వామీజీకి భక్తులు ఎన్నో రకాల నైవేద్యాలను సమర్పించినా వాటన్నిటినీ బాబా భక్తులకు ప్రసాదంగా వితరణ చేసి తాను బాబాకు నివేదించిన ప్రసాదాన్ని మాత్రమే భుజించే వారు. సాయి వలెనే స్వామి కూడ రుచులకు ప్రాధాన్యత నిచ్చేవారు కాదు. స్వామీజీకి ఎందరో భక్తులు, రుచికరమైన మిఠాయిలు, మేలి రకపు పండ్లు, కొన్ని హోటళ్ళ నుండి ఉపాహారాలు, భోజన పళ్ళాలు పంపించే వారు. వాటి రుచినైనా చూడకుండా వాటన్నిటిని బాబా భక్తులకు పంచేవారు. స్వామీజీలోనే సాయిని దర్శించి ఆయనకు సమర్పించిన ప్రతిదీ సాయికే చెందుతుందన్న దృఢ విశ్వాసంతో భక్తులు ఎన్నో కానుకలను స్వామికి సమర్పించే వారు. వాటన్నిటిని సాయి భక్తులలో సాయినే గాంచి వారికి సమర్పించే వారు స్వామీజీ. స్వామీజీని దర్శించిన ఏ భక్తుడు రిక్త హస్తములతో వెళ్ళనిచ్చే వారు కాదు. వారికి బాబా ప్రసాదం, తీర్థం, పండో, ఫలమో, సాయి చిత్రపటమో, సాయి గ్రంథమో ఏదో ఒకటి బహూకరించే వారు. ప్రతి నిత్యం హోటళ్ళ నుండి భోజనం తెచ్చే పిల్లలకు సహితం స్వామీజీ ఏదో ఒకటి ప్రసాదించే వారు. **"నా చెంతకు వచ్చి రిక్త హస్తములతో తిరిగి వెళ్ళిన వారిని ఒక్కరినైనా చూపించండి"** అన్న బాబా అభయం మనందరికి స్ఫురణకు తెస్తోంది స్వామీజీ ఈ చర్య.

స్వామీజీ ఎల్లప్పుడు తాను సాయికి, సాయి భక్తులకు సేవకుడనని వినమ్రతతో విన్నవించే వారు. స్వామీజీ నిరాడంబరత, వారి నిస్వార్థ సాయి





సేవ, వారి అకుంఠిత సాయి దీక్షకు, వారి సంస్కారానికి, వారి దాన గుణమునకు, వారికి గల వేద విజ్ఞానానికి ప్రణమిల్లి వారిని గౌరవ ప్రపత్తులతో **"బాబా" "గురుదేవ్", "స్వామీజీ"** అని సంబోధించే వారు. పండితులు, పామరులు, ధనవంతులు, కడు బీద వారు, పెద్దలు, పిన్నలు, ఉన్నత పదవులలో నున్న వారు, చిరుద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ వేత్తలు, డాక్టర్లు, లాయర్లు, శాస్త్రవేత్తలు మొ॥ వారు స్వామీజీకి భక్తులయ్యారు. స్వామీజీ దృష్టిలో సర్వులూ సమానమే. స్వామీజీ వారికి బాబా యందు ఎంత భక్తి ఉన్నదని మాత్రమే అన్వేషించే వారు గాని ఇతరముల జోలికి పోయెడి వారు కాదు. అందరిని ఒకే తీరున ఆదరించే వారు. ఆయనను దర్శించే ప్రతి భక్తుని తోను **"మనందరికి సర్వం సాయి నాథుడే. ఎట్టి విపత్తు సంభవించినను ఆయన యందు విశ్వాసాన్ని సడలించ కండి, సాయి నామమే మనకు శ్రీరామ రక్ష"** యని బోధించెడి వారు.

## భక్తోద్ధారకుడు స్వామీజీ:

మన పూజ్య శ్రీ శివనేశన్ స్వామీజీ దేశ విదేశాలలో గల అనేక మందిని సాయి అంకిత భక్తులుగా మార్చి వారిని ఉద్ధరించారు. వీరందరి గురించి క్లుప్తంగా ప్రస్తావించినా గాని ఈ గ్రంథం అతి విస్తార మవుతందన్న తలంపుతో స్వామీజీ ఆశీస్సులతో తమ సర్వస్వాన్ని సాయికే అంకితమొనరించిన ఇరువురి సాయి అంకిత భక్తుల గురించి మాత్రం మీకందించక పోతే ఈ గ్రంథం అసంపూర్ణ మవుతుందన్న తలంపుతో స్వామీజీ మరియు సాయి బాబా కరుణా కటాక్షములతో తమ జీవిత గమ్యాలనే మార్చుకున్న శ్రీ అయోధ్య గారిని గురించి మరియు విదేశీయురాలైన కుమారి క్రిస్టియాన (ఓం సాయి) (కాలిఫోర్నియా వాసి) గురించి మాత్రం ఈ గ్రంథంలో పొందు పరుస్తున్నాను.

అయోధ్య గారు అతి పిన్న వయస్సులోనే భగవదనుగ్రహము పొంది బ్రహ్మచారి జీవితాన్ని గడుపుతూ పుణ్యక్షేత్రాలను, అవధూతలను దర్శిస్తూ షిరిడీకి చేరి బాబా దర్శన భాగ్యమును పొంది, శ్రీ శివనేశన్ స్వామీజీ కఠోర దీక్షను, నిత్యము ఆయన చేసే సాయి సేవను కనులార గాంచి ప్రభావితుడై ఆయన అనుమతి పొంది కొంత కాలం షిరిడీలోనే వసియించి స్వామీజీ అడుగు జాడలలో నడచి సాయి సేవను కొనసాగించిన ధన్య జీవి శ్రీ అయోధ్య గారు. స్వామీజీ నుంచి సాయి తత్వాన్ని ఆసాంతము ఆస్వాదించిన పుణ్య పురుషుడు.

ప్రతి నిత్యము ద్వారకామాయి, చావడిలో సేవ చేసుకుంటూ, లెండీ వనములోని నంద దీపమునకు, దత్త మందిరమునకు, గురుస్థానములకు ప్రదక్షణలు గావించుచు, పారాయణ చేయుచు, రాత్రులందు స్వామి ద్వారా తనకు గల ఆధ్యాత్మిక విషయముల గురించిన సందేహములను నివృత్తి చేసుకొనుచూ, స్వామి భుజించెడి సాయి ప్రసాదమునే తాను భుజించి అంత పిన్న వయస్సుననే అతి నిరాడంబరముగా జీవితము కొనసాగించి ఆధ్యాత్మికముగా అత్యున్నత శిఖరముల నధిరోహించిన భక్తవరేణ్యుడు శ్రీ అయోధ్య గారు. కొంత కాలం షిరిడిలో ఉన్న తదుపరి స్వామీజీ ఆజ్ఞ మేరకు అవధూత రామి రెడ్డి తాత చెంత కొంత కాలము ఉండి ఆయనకు సుశ్రూషలు చేసి రామి రెడ్డి తాత ఆనతి పై స్వామీజీ ఆశీస్సులతో నిర్మించ బడిన శ్రీ దత్త వెంకట సాయి సేవా సమాజం, దత్తగఢ్ – కల్లూరు-504 109, ఆదిలాబాద్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ నందు పది రెండు వత్సరములు అన్న పానీయములను త్యజించి నిత్యము అతి కొద్ది క్షీరమును మాత్రము సేవించి తపమాచరించి ఇటీవలే సమాధి చెందిరి. యవ్వనములో ఉండి కూడా ఏ విధమైన సుఖ సంతోషముల కొరకు ప్రాకులాడక, సిరి సంపదలకై వెంపర్లాడక జ్ఞాన సముపార్జన యందే మనస్సును లగ్నంచేసి అరిషడ్వర్గాలను జయించి ప్రతి క్షణాన్ని భగవద్ కృపకే అంకితము చేసి భగవంతుని పాద సన్నిధికి చేరిన తపో మూర్తి శ్రీ అయోధ్య గారి జీవితం మనందరికి ఆదర్శ ప్రాయమే.

కుమారి క్రిస్టియానా (ఓం సాయి) కాలిఫోర్నియాకు చెందిన విదేశీ విద్యార్థిని. ఈమె సాయిని స్వప్నమందు గాంచి బాబా ఆజ్ఞ మేరకు అష్టకష్టములు పడి సహ విద్యార్థులనుంచి, ఉపాధ్యాయుల నుంచి విరాళములు సేకరించుకొని భారత దేశము వచ్చి స్వామీజీ మార్గ దర్శకత్వములో సాయిని ఎనిమిది వర్షములు సేవించుకుని స్వామీజీ సమాధి అనంతరము సాయి లీలలను మనమున పదిల పరచుకుని స్వదేశానికేగిన ధన్య జీవి. ఈమె యొక్క మంచి మనస్సెరిగి ఆమెను చేరదీసి సాయి తత్వాన్ని ఆసాంతము ఆస్వాదింప జేసి ఆమె హృదయంలో సాయికి స్థిర నివాస మేర్పరిచారు మన స్వామీజీ. ఈమెకు స్వామీజీ బాబా అష్టోత్తర శతనామావళి, బాబా భజనలు, హారతులు, కంఠోపాఠంగా నేర్పించారు. విదేశీ వనిత యైనను పర భాషలో గల వీటిని అనతి కాలముననే నేర్చు కొనగల్గినదంటే దానికి కారణం స్వామీజీ క్రమ శిక్షణ మరియు బాబా ఆశీస్సులే కారణం. ఈమె షిరిడీ వచ్చిన క్రొత్తలో





ఉన్మత్తురాలి వలె బాబా మందిర ప్రాంగణములో తిరుగుచూ అందరిలోను సాయిని గాంచి 'ఓం సాయి' యని సంబోధించెడిది ఆమె వేష భాషలను గాంచి పిచ్చిదని తలంచి అందరు ఆమెను ఈసడించుకొని, రాళ్ళతో కొట్టినను వారితో ఏ విధమైన వాగ్వివాదము చేయక 'ఓం సాయి' అనుచు వారికి దూరముగా ఉండెడిది. ఈమెలోని భక్తి తత్పరతలను గాంచిన స్వామీజీ ఆమెను చేరదీసి కన్న కూతురు వలె ఆదరించారు. ఈమె తనను ఎవరైనా ఆదరించినా, అనాదరించినా గానీ "ఓం సాయి" అని సమాధాన మిచ్చెడిది. ఎల్లప్పుడు 'ఓం సాయి' అనుట వలన అందరు ఆమెను 'ఓం సాయి' అని పిలచెడి వారు. స్వామీజీ ఆమెను ఆదరించిన తరువాత అందరు ఆమె పట్ల గౌరవ మర్యాదలు చూప సాగిరి.

ఈమె తన స్వదేశం వెళ్ళి పోతుందని ఈమె దర్శనార్థమై జనం గంటల తరబడి వేచి ఉంటారనియు, ఈమె అమెరికాలో బాబాను గురించి విస్తృత ప్రచారం జరుపుతుందని స్వామీజీ జోస్యం చెప్పారు.

ఈమె విదేశీ వనిత యైనప్పటికి వస్త్రధారణ యందు శ్రద్ధ చూపెడిది కాదు, శరీర పోషణ యందసలే శ్రద్ధ వహించెడిది కాదు. ఎల్ల వేళలా మురికి బట్టలు ధరించి "ఓం సాయి" అంటూ వీధులలో తిరుగాడెడిది. నిష్కల్మషమైన మనస్సును మాత్రం ఎల్ల వేళలా సాయి యందే లగ్నం చేసెడిది. ఈమె షిరిడీకి 1988 వ సం॥ లో వచ్చి 1996 సం॥ వరకు అంటే ఎనిమిది సంవత్సరాలు మాత్రం పావన పుణ్య భూమి యైన షిరిడీలో నివసించి తన హృదినిండా సాయినే నింపుకొని తన స్వదేశానికి వెడలి పోయెను.


**స్వామీజీతో 'ఓంసాయి'**

## భక్తుల అనుభవములు :

సాయి నిస్వార్థ సేవలో నాలుగున్నర దశాబ్దములు గడిపిన మన స్వామీజీ బాబా అనుగ్రహంతో అసంఖ్యాక సాయి భక్తులకు ఎన్నో రకాలుగా చేదోడు వాదోడుగా నిలచి వారిని సాయి బాటలో నడిపించి భుక్తి, భక్తి, ముక్తి మార్గాలను చూపిన పుణ్య మూర్తి. బాబా తన భక్తుల మనోవాంఛల నెరింగి

వారి వాంఛల నీడేర్చినట్లే మన స్వామీజీ కూడ తమ ఆప్తుల మనస్సెరిగి వారడుగక ముందే వారి మనోవాంఛల నీడేర్చేవారు.

శీతాకాలం ఒక రేయి మోహన్ బాబా అనే భక్తుడు గురుస్థానంలో కూర్చొని చలికి వణుకుతూ వేడి వేడిగా టీ త్రాగుదామంటే చేతిలో డబ్బులేక అతను మనసులోనే స్వామి దగ్గద టీ కూపన్లు ఉన్నాయి. తనకు ఒకటి ఇస్తే ఆయన సొమ్మేం పోతుంది అనుకున్నాడు. రెండు, మూడు నిమిషములలోనే స్వామీజీ మోహన్ బాబాను తమ గదిలోకి పిలచి చేతికి వచ్చినన్ని టీ కూపన్లు తీసి అతనికి ఇచ్చారు. తన మనస్సులో కోర్కె స్వామీజీ ఎలా గ్రహించ గలిగారూ లేక కాకతాళీయమా అన్న సందేహంతోనే టీ కూపన్లు తీసుకొని టీ త్రాగి గురుస్థానానికి వచ్చి స్వామీజీ తన మనస్సెరింగిన వారైతే ఆయన దగ్గరున్న శాలువలలో ఒకటి తనకివ్వాలని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా స్వామీజీ అతనిని పిలచి "నీకు కావలసిన శాలువా తీసుకో ఇవన్నీ నీవే" అనగా మోహన్ బాబా స్వామీజీ తన మనోవాంఛను తెలుసుకో గలిగారని గ్రహించి ఒక శాలువాను తీసుకుని ఆయనకు నమస్కరించి వెళ్ళిపోయాడు.

శ్రీ కె. సుబ్రహ్మణ్యం (మణి)కు 1964లో స్వామీజీతో పరిచయ భాగ్యం కలిగింది. ఆ పరిచయం వృద్ధిచెంది 1971 నుంచి మణి స్వామీజీ భక్తులలో ఒకరైనారు. స్వామీజీ ఆదేశానుసారం 1980లో బొంబాయిలో గల తన వ్యాపారాన్ని విడనాడి షిరిడీలో నివసించ సాగెను. స్వామీజీనే తన గురువుగా భావించి ఆయన ఆజ్ఞానుసారం జీవించ సాగారు. ఒకనాటి రాత్రి శేజ హారతి అయిన తురువాత ద్వారకామాయిలో కూర్చొని స్వామీజీ తన గురువైతే ఐదు నిమిషములలోపు స్వామీజీ తనకు 10 పైస లివ్వాలని, అలా జరిగితే స్వామిని త్రికరణ శుద్ధిగా తన గురువుగా కొలుస్తానని మనసులో అనుకున్నారు. ఐదు నిమిషాలకంటే ముందే స్వామీజీ అతని చేతిలో 10 పైసల నాణెం ఉంచి మౌనంగా అచట నుండి వెళ్ళి పోయారు. సద్గురు వెప్పుడు తన శిష్యుల మనోగతాన్నెరిగి అతని కోర్కెలు తీరుస్తారు. పై సంఘటనల వలన స్వామీజీ మన అంతర్యామి యని సుస్పష్ట మగుచున్నది.

శ్రీ రామచంద్ర దేశ్‌ముఖ్ అనే 70 సం॥ల షిరిడీ వాసి స్వామీజీ యందు అత్యంత భక్తి శ్రద్ధలు గల భక్తుడు. స్వామీజీలోనే సాయిని చూచుకొని ఆయననే తన బాబాగా భావించిన భాగ్యశాలి. రామచంద్ర దేశ్‌ముఖ్ తల్లిదండ్రు





లిద్దరూ సాయిని సేవించి తరించిన భక్త శిఖామణులే. రామచంద్రకు మాత్రం సాయి యందు ఏ మాత్రం భక్తి లేదు. ఇతని కుమార్తెకు 1961 సం॥లో టైఫాయిడ్ జ్వరం రాగా షిరిడీ సాయి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా నెల రోజులు గడచినా గాని జ్వరం తగ్గక పోవటంతో అక్కడి వైద్యులు తమవల్ల కాదనియు వేరే ఆసుపత్రికి తీసుకు వెళ్ళమని చెప్పి ఆమెను ఇంటికి పంపి వేశారు. దేశ్‌ముఖ్‌కు ఈ విపత్కర సమయంలో ఏమి చేయుటకు పాలుపోక స్వామిని ఆశ్రయించగా స్వామీజీ బాబా తీర్థాన్ని, ఊదీని మాత్రం ఇవ్వమని మిగిలిన మందులన్నీ మానివేసి బాబాపై భారం వేసి వేడుకోమని సలహా నిచ్చారు. ఆ పాపకు బాబా తీర్థాన్ని, ఊదీని ఇవ్వగా అందరికి ఆశ్చరం కలిగే రీతిన స్వల్ప కాలంలోనే సంపూర్ణ ఆరోగ్యవంతు రాలైనది. దీనితో దేశ్‌ముఖ్‌కు బాబా యందు గురి కుదిరి స్వామీజీ ద్వారా బాబా లీలలను తెలుసుకుని బాబా అంకిత భక్తునిగా మారినాడు. స్వామీజీ అతనికి చేసిన మేలు మరువక ***"స్వామీజీయే నా బాబా"*** అని అందరికి చెప్పటమే గాక స్వామీజీనే తన మార్గదర్శకులని నమ్మి కొలచి తరించెను. ఇతనికి సాయి యందు భక్తి పెరిగే కొలది ఇతనిని సాయినాథుడు శతవిధాల రక్షించి కష్ట, నష్టాల నుంచి కాపాడే వాడు. ఇతని తల్లి గారు ప్రతి నిత్యం ఉదయం 3 గంటలకే నిద్రలేచి స్నానమాచరించి సాయి పూజా కార్యక్రమంతో దైనందిన కార్యక్రమాన్ని ప్రారంభించే వారు. 1964 వ సంవత్సరములో ఒక రోజున ఎప్పటి వలెనె వేకువ జామున నిద్రలేచి స్నానం చేయటానికి బావి దగ్గరకు వెళ్ళి వెలుతురు లేని కారణమున కాలు జారి బావిలో పడి పోయెను. ఆ సమయమున మిగిలిన కుటుంబ సభ్యులందరు గాఢ నిద్రలో నుండుటచే ఈ ప్రమాదాన్ని పసిగట్ట లేదు. తెల్లవారిన తురువాత బావిలో నుండి సన్నటి మూలుగు వినిపించగా బావిలోకి చూచి అతి ప్రయాసతో ఆమెను బయటకు తీసారు. బావిలో పది అడుగుల పైనే నీరు ఉన్నను ఆమె కంఠం వరకు మాత్రమే తడవటం చూచి అచ్చెరువొంది ఆమెను అడగగా తాను బావిలో పడే సమయంలో ***"బాబా"*** అని ఆర్తితో పిలవగా బాబా తనను నీటిలో మునగకుండ క్రింద నుంచి పట్టుకొని కాపాడినట్లు తెలిపింది. ***"నా సమాధి నుండి యే నా భక్తులను సంరక్షిస్తాను"*** యని బాబా అభయాన్ని మనకు స్పురణకు తెస్తున్నది ఈ సంఘటన. దీని తురువాత దేశ్‌ముఖ్‌కు బాబా యందు విశ్వాసం పదింతలు పెరిగెను.

1975వ సవంత్సరములో శ్రీ దేశముఖ్ తన కుమార్తె వివాహం చేయ తలపెట్టి స్వామిజీ ఆశీర్వాదాన్ని కోరగా స్వామిజీ అతనితో "నీ కుమార్తెతో బాబా సచ్చరిత పారాయణము చేయించు, పారాయణ ముగిసేలోపే మగ పెండ్లి వారు తామంతట తామే నీ కుమార్తెను వారి కుమారునకిచ్చి వివాహం జరిపించమని అడుగుతారు" అని చెప్పగా సరిగ్గా అదే విధంగా పారాయణ ముగిసేలోపే ఆమె వివాహం నిశ్చయ మైనది. వివాహానికి మగ పెండ్లి వారు చెప్పిన దానికంటే రెండు రెట్లు అధికంగా రావటంతో చేసిన వంటకాలు చాలవన్న భయంతో దేశ్‌ముఖ్ స్వామిజీ సలహాను కోరగా స్వామిజీ అతనితో అన్ని వంట పాత్రలలోను ఊదిని వేసి గుడ్డ కప్పి ఆ గుడ్డను పూర్తిగా తొలగించకుండా వడ్డించమని చెప్పగా వారు అలాగే చేసి అందరి భోజనాలు పూర్తి అయిన తరువాత చూస్తే వండిన వంటకాలన్నీ అలాగే ఉన్నాయి. స్వామిజీ సలహా ప్రకారం వాటిని ద్వారకామాయి దగ్గర బిచ్చగాళ్ళకు వితరణ చేసారు. దేశ్‌ముఖ్‌కు ప్రతి చిన్న సమస్యను స్వామిజీ ద్వారా బాబా పరిష్కరించారు.

ఒక పర్యాయం దేశ్‌ముఖ్ ద్వారకామాయిలో బాబాకు నైవేద్యం సమర్పిస్తుండగా తన ఇంటికి ఎవ్వరో వెళ్ళినట్లు అనుభూతి కలిగింది. సరిగ్గా అదే సమయానికి ఫకీరు వేషధారియైన షుమారు 18 సంవత్సరముల యువకుడు దేశ్‌ముఖ్ ఇంటికి వెళ్ళి భిక్ష నర్థించగా దేశ్‌ముఖ్ భార్య తన భర్త బాబాకు నైవేద్యం సమర్పించటానికి ద్వారకామాయికి వెళ్ళారని ఆయన రాగానే భోజనం పెడతానని చెప్పగా ఆ యువకుడు తనకు అంత సమయం లేదని వారు భోజనం చేసే ప్లేటు ఇస్తే దాని మీద తన పేరు వ్రాసి ఇస్తాననగా ఆమె ప్లేటు ఇవ్వగా ఆ యువకుడు ఆ ప్లేటు మీద స్వస్తిక్, ఓం, కూర్మం, మీనమును తన గోటితో చిత్రించి వెళ్ళి పోయాడు. దేశ్‌ముఖ్ ద్వారకామాయి నుంచి త్వరత్వరగా ఇంటికి వచ్చి జరిగినది తెలుసుకుని ఆ వచ్చిన యువకుడు బాబాయే నని గుర్తించి తనకు బాబా సాక్షాత్కారం లభించలేదని వాపోగా స్వామిజీ "బాబా ఎక్కడ లేదు? అందరిలోనున్న బాబాను చూడు" అని అతని కళ్ళు తెరిపించారు. దేశ్‌ముఖ్ ఆ ప్లేటును బాబా ప్రసాదంగా భావించి పూజా మందిరమందుంచి పూజించ సాగెను. ఒక పర్యాయము వారింట్లో దొంగతనం జరిగినప్పుడు ఆ ప్లేటును కూడ దొంగలు దోచుకు పోయారు. 1993 సంవత్సరములో స్వామిజీ షిరిడీ సాయి సేవలో నలుబది వసంతాలు పూర్తి చేసిన సందర్భాన్ని





పురస్కరించుకొని స్వామిజీ జన్మదినమైన 12.4.1993న స్వామిజీ మరియు సాయి భక్తుల సమక్షంలో ఘనంగా జరుపగలిగాడు. స్వామిజీ గురువు గారు శ్రీ ముత్తయ్య గారు షిరిడీలో ఉన్నప్పుడు దేశ్‌ముఖ్ గృహము నందు కొంత కాలమున్నారు.



స్వామిజీ సాయి సేవలో నలుబది వసంతాలు పూర్తి చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని భక్తులు ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి స్వామిని సత్కరింప తలపెట్టి స్వామిజీ అనుమతి వేడగా స్వామిజీ వారి కోర్కెను సున్నితంగా తిరస్కరించారు. కాని భక్తులు పదే పదే ప్రాదేయ పడగా భక్తుల కోర్కెను మన్నించి దేశ్‌ముఖ్ గృహంలో అదే రోజు అతని కుమారుని వివాహాన్ని మరియి దేశ్‌ముఖ్ గృహ ప్రాంగణంలో గల వేప మరియు రావి వృక్షములకును వివాహం జరిపించాలని స్వామిజీ చెప్పారు. దేశ్‌ముఖ్ పుత్ర సంతానం కలిగితే రావి, వేప వృక్షములకు వివాహం చేయించెదనని మ్రొక్కుకొనెను. పుత్రసంతాన భాగ్యం కలిగిన తరువాత 21వ సంవత్సరముల వరకును లేమి కారణంగా తన మ్రొక్కును తీర్చలేక పోయాడు. దేశ్‌ముఖ్ యొక్క మ్రొక్కు చెల్లించుటకే స్వామిజీ ఆ కార్యక్రమానికి అంగీకరిచారు. 12.4.1993న స్వామిజీ పేరు మీద శాంతి జరిపి ఆయన ఆయుషు వృద్ధికి 21 రకాలైన పూజలు, హోమాలు చేయించారు. స్వామిజీ ఆ రోజు సాయంత్రం దేశ్‌ముఖ్ గృహమునకేగి నూతన వధూవరులను ఆశీర్వదించి వచ్చారు. స్వామి భక్తులందరు కలసి ఈ కార్యక్రమమును జయప్రదముగా నిర్వహించినారు.

ఈ కార్యక్రమమును పురస్కరించుకొని శ్రీమతి జరీనా స్వామిజీపై ఒక గ్రంథమును ప్రచురించ దలచి స్వామి భక్తులను తమ, తమ అనుభవములను, అనుభూతులను పంపమని కోరగా అసంఖ్యాక స్వామిజీ భక్తులు దేశ, విదేశాల నుండి అనేక భాషలలో వ్యాసములు పంపిరి. వాటినన్నిటిని క్రోడీకరించి "God's Rainbow" అనే గ్రంథాన్ని అతి సుందరముగా ముద్రించి 1999లో భక్తుల కందించెను.

ముంబయి నివాసి శ్రీమతి జరినాతారాపూర్‌వాల స్వామిజీని **"గురుదేవ్"** యని ఎనలేని గౌరవంతో సంబోధించేవారు. ఈమెకు స్వామిజీ వాక్కు వేదవాక్కు. స్వామిజీ అనుమతి లేనిదే ఏ కార్యమును చేపట్టెడిది కాదు. ఈ గ్రంథము మీ పవిత్ర హస్తాలలో ఉందంటే దానికి కారణం శ్రీమతి జరీనాయే నని "మనవి" లోనే సవినయంగా విన్నవించుకున్నాను. ఈమెకు బాబా మరియు స్వామిజీ అనేక లీలలను ప్రదర్శించారు. వాటిలో అతి ముఖ్యమైనవి మాత్రం మీకందిస్తున్నాను.

శ్రీమతి జరీనా ఆమె తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 'మెహర్-ధన్' అనే ట్రస్టును స్థాపించి సాయి తత్వాన్ని తెలిపే అనేక గ్రంథాలకు, హారతి క్యాసెట్లను మొ॥వి అతి సుందరముగా తయారు చేయించి భక్తుల కందించారు. స్వామిజీ ఆశీర్వాద బలమే తనతో ఈ పనులు చేయించ గలిగినట్లు విన్నవించు కున్నదామె.

బాబా హారతి క్యాసెట్ల మాస్టర్ క్యాసెట్టును తయారు చేసి స్వామిజీకి వినిపించి ఆయన ఆశీస్సులు, అభిప్రాయము పొందిన తురువాత విడుదల చేయాలని నిర్ణయించుకొని క్యాసెట్లను టేపు రికార్డరును స్వామిజీ గదికి తీసుకు వెళ్ళగా క్రిస్టియాన (ఓం సాయి) స్వామిజీ రూములో టేపు రికార్డరును పెట్టటానికి అభ్యంతరం పెట్టగా స్వామిజీ అదే రోజు (16.4.1993) షిరిడీలో గల శ్రీమతి జరీనా నివాసానికి వెళ్ళి ఆ క్యాసెట్లను విన్నారు. ఒక క్యాసెట్టులో అర్థం వరుస క్రమం మారటం గమనించిన స్వామి దానిని సరియైన వరుస క్రమంలోకి మార్చి విడుదల చేయమనగా అప్పటికే మాస్టర్ క్యాసెట్టు తయారైనదని మార్చటం సాధ్యం కాకపోవచ్చని శ్రీమతి జరీనా చెప్పగా స్వామిజీ వరుస క్రమాన్ని మార్చటం వీలవుతుందని క్యాసెట్టు రికార్డింగ్, రీరికార్డింగ్, ఎడిటింగ్ విధానాన్ని విశదపర్చగా అక్కడున్న శ్రోతలంతా స్వామిజీకి గల ఆధునిక సాంకేతిక పరాజ్ఞానానికి అచ్చెరు వొందారు. శ్రీమతి జరీనా స్వామిజీ తన పవిత్ర పాదంతో తన గృహాన్ని పావనం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని స్వామిజీకి పాదపూజ చేసి తరించెను.

ఈమె 1992లో షిరిడీలో ఒక ఆశ్రమాన్ని నిర్మించ దలచి స్వామిజీ ఆశీస్సులు కోరగా "బాబాను వేడుకో ఆయన ఆశీర్వదిస్తే అంతా సవ్యంగా జరుగుతుంద"ని స్వామిజీ శలవిచ్చారు. ఆ రోజు 1992 డిసెంబర్ మాసం 11వ తేది. అయోధ్యలో రామ మందిరం అల్లర్ల వల్ల షిరిడీకి వచ్చే భక్తుల





సంఖ్య అనూహ్యంగా తగ్గి షిరిడీ నిర్మానుష్యంగా మారింది. అదే రోజు స్వామిజీ ఆజ్ఞ ప్రకారము శ్రీమతి జరీనా స్థల సేకరణకు సమాధి మందిరమందును, ద్వారకామాయిలోను బాబాను ప్రార్థించి చావడిలో భజన కార్యక్రమానికి హజరై ఒక పూల మాలను కొని గురుస్థానంకు రాగా భక్త జన సందోహం లేక పోవుటచే గురుస్థానాన్ని శుభ్రం చేస్తున్న అర్చకుడు ఆమెను కొంత తడవు వేచి ఉండమనగా ఆమె అక్కడనే బాబాను స్థల సేకరణ కొరకు ప్రార్థిస్తూండగా ఉధృతంగా గాలివీచి వేపాకులు విపరీతంగా రాలి గురుస్థానమంతా వేపాకుల మయమయ్యింది. రెండు, మూడు నిమిషాలలోనే గాలి తగ్గి ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఇది చూచిన గురుస్థాన్ అర్చకుడు "నీ ప్రార్థన బాబా ఆలకించారు, నీ కోరిక తప్పక నెరవేరుతుంది" అని శ్రీమతి జరీనాను ఆశీర్వదించెను. బాబాకు పూల మాలను సమర్పించి వెంటనే స్వామిజీ చెంతకు వెళ్ళి ఈ విషయమంతా వివరించగా స్వామిజీ బాబా ఆశీర్వదించారు నిరాటంకంగా స్థల సేకరణ జరుగుతుందని చెప్పారు.

1993 ఆగస్టు 10వ తేదిన మణి సమక్షంలో ఏ స్థలం ఆశ్రమం కోసం క్రయం చేయాలో స్వామిజీని అడగగా బాబాను వేడుకోండి ఆయనే మీకు ఏ స్థలం తీసుకోవాలో సూచనలిస్తాడు అనగానే స్వామిజీ గదిలో గల గణపతి విగ్రహం వద్ద నున్న పుష్పం క్రింద పడింది. శ్రీమతి జరీనా దానిని తీసి స్వామి పాదాల వద్ద నుంచగా ఆయన "ఇది బాబా నీకిచ్చిన ప్రసాదం నీవే తీసుకో" మని ఆ పుష్పాన్ని ఆమెకు ఇచ్చారు.

1993 ఆగస్టు మాసం 13వ తేదీన రెండు, మూడు స్థలాల వివరాలను సేకరించిన శ్రీమతి జరీనా ఏ స్థలాన్ని తీసుకోమంటారని స్వామిజీని అడగగా బాబా వద్ద చీటీలు వేసి, బాబా చెప్పిన స్థలాన్ని క్రయం చేయమని చెప్పారు. ఆ ప్రకారంగానే బాబా వద్ద చీటీలు వేయగా సంపత్ కాకా స్థలాన్ని కొన మని రాగా ఆ స్థలాన్నే (ఆరు యకరములు) క్రయం చేసారు. 17.4.1993న అగ్రిమెంటు వ్రాయించుకుని బాబాకు అత్యంత ఇష్టమైన రోజు మన స్వామిజీ జన్మ దినమైన శ్రీరామ నవమి పర్వ దినమున (20.4.1994) రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ స్థలం సంపత్ కాకా పూర్వీకులు దాసుగణు మహారాజ్‌కు బహూకరించ దలచినది. దాసుగణు మహారాజ్ అసలు పేరు గణపతిరావు సహస్త్రబుద్ధి. ఈయన పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసే వారు.


దాసుగణు మహరాజ్

ఈయన వృత్తికి ప్రవృత్తికి పొంతనే లేదు. ఈయన వృత్తి పోలీస్ ఉద్యోగం కాగా ప్రవృత్తి మాత్రం హరికథలు చెప్పుట, నాటకములు వేయుట, రచనలు చేయుట. బాబాను మహారాష్ట్రములోను అలనాటి నిజాం ఇలాకాలోను ప్రజలకు ప్రప్రథమంగా పరిచయం చేసిన పుణ్యమూర్తి. దాసుగణు ఎచట హరికథలు చెప్పినను స్టేజి మీద అందంగా అలంకరించిన బాబా ఛాయచిత్రము నుంచెడి వాడు. బాబా దివ్య లీలలను అతి శ్రావ్యంగా గానం చేసి శ్రోతలను భక్తి సాగరంలో ఓలలాడించెడి వాడు. ఈయన నటనా కౌశల్యము, హరికథ మధ్యలో చెప్పెడి పిట్ట కథలు ప్రజలను ఎంతో ఆకర్షించెడివి. ఈయన కార్యక్రమమునకు ప్రజలు తండోపతండములుగా వచ్చెడి వారు. ప్రతి కార్యక్రమములోను బాబా లీలను వర్ణించుట, బాబా దివ్యత్వమును పది మందికి అర్థమయ్యే రీతిలో గానం చేసెడి వారు. ఈయన గానామృతమును గ్రోలిన భక్తులు బాబా యొక్క మహిమలను విని ఎప్పుడు బాబాను దర్శించెదమా యని ఉవ్విళ్ళూరుతూ మారు మూల గ్రామమైన షిరిడీకి వచ్చి బాబాను దర్శించిన వారు వేనకు వేలు. బాబా ప్రతిభను ప్రజలలో చాటిన ప్రప్రథమ కీర్తన కారుడు. బాబా మహాసమాధికి ముందే ఆర్వచీన భక్త లీలామృతము అను గ్రంథములో 31, 32, 33 అధ్యాయముల లోను సంత కథామృతమను గ్రంథములో 57వ అధ్యాయమందును బాబా యొక్క దివ్య లీలలను వర్ణించిన పుణ్యపురుషుడు శ్రీ దాసుగణు మహారాజ్. బాబా కృపతో భీమాజీ పాటిలుకు క్షయవ్యాధి నివారణ కాగా అతను ప్రతి మాసము సాయి సత్యవ్రతము నాచరించి అందులో ఈ నాలుగు అధ్యాయములను చదివే వాడు. బాబా ప్రచారకుడైన దాసుగణుకు బహూకరించ దలచిన స్థలమును సాయి సేవకుడైన శివనేశన్ స్వామికి చెందేటట్లు చేసి సంపత్ కాకా పూర్వీకుల కోర్కెను బాబా ఈ విధంగా నెరవేర్చాడు. 'ఓం సాయి' (క్రిష్టియానా) ఆశ్రమం పేరు "Sri Sivanesan Swamiji Institute of Higher Education" అని నామకరణం చేసి దానిని సంస్కృత భాషలో వ్రాయాలని శ్రీమతి జరీనాను కోరింది. 8.12.1993 తేదీన స్వామిజీ 17.12.1993 మంచి రోజు, ఆ రోజున భూమి పూజ చేయించమని ఆదేశించెను. అదే రోజు సాయంకాలం శ్రీమతి జరీనా ధుని పూజ చేయించు చుండగా సంస్థాన్ పూజారి ఒకరు







నారికేళము నిచ్చి బాబా ప్రసాదంగా స్వీకరించ మన్నాడు. సాయినాథుని ఆశీస్సులు కూడ లభించాయని సంతసించి స్వామిజీ నిర్ణయించిన ముహూర్తమునకే ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఆచార్య వాగేష్‌ను షిరిడీకి రప్పించి నాసిక్ నివాసి యైన రామానంద బాబా మరియు స్వామిజీ భక్త బృందం సమక్షంలోను భూమి పూజా కార్యక్రమమును నిర్వహించారు. పూజా సమయానికి నాందేడ్‌కర్ (కాంద్రే) ద్వారా నారికేళములు, పళ్ళు, పూలు, బాబా ప్రసాదం పంపి స్వామిజీ తమ ఆశీర్వాదము తెలియ చేసారు. స్థలాన్ని స్వామిజీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించటానికి అనుమతి వేడగా స్వామి "నాకు ఏ విధమైన ఆస్తిపాస్తులు వద్దు, నా ఈ జీవితం సాయి సేవకే అంకితం" అని వారి కోర్కెను నిర్మోహమాటంగా త్రోసి పుచ్చారు. స్వామిజీ యొక్క ఈ చర్య తనకు సాయి సేవ యందు తప్ప మరే దాని పైన కోర్కె లేదని సుస్పష్టము చేయుచున్నది.

శ్రీమతి జరీనాకు అన్నిటికంటే ముఖ్యమైనది జన్మజన్మలకు మరువలేని మరపు రాని దివ్య లీలను స్వామిజీ ప్రసాదించారు. ఇది చదివిన మీరు కూడ స్వామిజీ ఎంతటి మహిమాన్వితులో గ్రహించగలరు.

శ్రీమతి జరీనా స్వగృహమైన (నట-షాహి, 69సి, ఒర్లీ సీ ఫేస్, ముంబాయి- 400 025) లో 23-09-1993 ఈ సంఘటన జరిగింది. సముద్రతీరానికి అతి సమీపంలో నుండుటవలన కిటికీలు తెరచి ఉంచితే వర్షాకాలంలో వర్షపు నీరు ఇంటి లోపలికి వచ్చేవి. ఆ కారణంగా ఆమె ఎల్లప్పుడు కిటికి తలుపులు మూసి ఉంచేది. కాని ఆ రోజున ఆమె పూజ ముగించుకుని స్వామిజీ విగ్రహానికి నైవేద్యం, నూతన వస్త్రములను సమర్పించిన తురువాత 16 × 14 అడుగుల వైశాల్యం గల ఆ గది కిటికీలు మూయటం మర్చి పోయింది. స్వామిజీ పంచలోహ విగ్రహం కిటికీకి అతి సమీపంలో గలదు. అది వర్షాకాలం కావటంతో ఆ రోజు ఈదురు గాలులతో విపరీతమైన వర్షం కురియగా తెరచి ఉంచిన కిటికీ ద్వారా నీరు గదిలోని ప్రవేశించి అక్కడ

గల పుస్తకములు, ఇతర వస్తువులన్నియు నీటిలో తడసి పోయినను కిటికీకి అతి సమీపముననే గల స్వామీజీ విగ్రహం మీద గాని స్వామీజీకి సమర్పించిన



నూతన వస్త్రములపైన గాని మచ్చుకు ఒక్క చుక్క నీటి బిందువు కూడ పడక పోవటమే గాక కనీసం చెమ్మగిల్ల లేదు. వింతలలోనే వింతయైన ఈ వింతను గాంచిన జరీనా కొంత తడవు విస్మయురాలైన పిమ్మట ఇదంతయు స్వామీజీ లీలయే నని గ్రహించెను. ఈ లీలను శ్రీమతి జరీనా "గురుదేవుని లీల" యని ఆనందోత్సాహముతో వివరించెను.

సాయి, స్వామీజీల దర్శనార్థం షిరిడీకి వచ్చిన శ్రీమతి జరీనా ఒక రోజున స్వామీజీ తనకు ఏవైన ఆంగ్లములో ప్రచురించిన బాబా గ్రంథము లిచ్చిన పఠించటానికి బాగుంటుందని తలపోసెను. ఆమె మనస్సెరింగిన స్వామీజీ ఆమెను తన గదికి ఆహ్వానించి ఆంగ్ల భాషలో ప్రచురితమైన నాలుగు గ్రంథాలను బహూకరించారు.

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు రచించిన సాయి బాబా గ్రంథాలను షిరిడీని సందర్శించే సాయి భక్తులకు అందిచాలన్న సదుద్దేశ్యంతో స్వామీజీ ఆశీస్సులు పొంది లెండీబాగ్‌కు సమీపమున నగర్–మన్‌మాడ్ మైన్ రోడ్డులో ఒక షాపును బాడుగకు తీసుకొని దానికి శ్రీ పి. సాంబశివరావు (పి.యస్.రావు) గారిని మేనేజరుగా నియమించారు. శ్రీ రావు స్వామీజీ యందు అచంచల విశ్వాసం గలవారు. ప్రతి నిత్యం స్వామీజీ సమక్షంలో సద్గ్రంథ పారాయణ గావించే వారు. వీరెప్పుడు స్వామీజీ ఒక్కసారైనా తమ పవిత్ర పాదంతో షాపును పునీతం చేస్తే బాగుంటుందని మనస్సులో తలచే వారు. ఒక నాడు ఉదయమే షాపు తెరచి అగరబత్తులు వెలిగించి, దీపారాధన చేసి ప్రక్కకు చూడగా షాపులో స్వామీజీ దర్శన మివ్వగా రావు ఆనంద భరితుడై స్వామీజీకి పాదాభి వందన మొనరించి తలెత్తి చూడగా స్వామీజీ అంతర్ధాన మయ్యారు. శ్రీ రావు ఈ విషయాన్ని స్వామీజీకి వివరించగా తాను రాలేదనియు బాబాయే తన రూపంలో వచ్చి ఉంటారని వివరించారు.





మరొక పర్యాయం జర్మనీ దేశం నుంచి ఒక సాయి భక్తుడు షిరిడీకి రాగా స్వామీజీ అతనిని తీసుకొని భరద్వాజగారి బుక్‌స్టాల్‌కు వచ్చి "సాయి బాబా ది మాష్టర్" అనే గ్రంథాన్ని కొని ఆ విదేశీయునికి బహూకరించారు. ఈ రీతిన స్వామీజీ రావు మనో వాంఛ నీడేర్చారు.

### స్వామిజీ వివరించిన సాయి లీలలు:

స్వామీజీ బాబా పాద ధూళితో పరమ పవిత్రతను సంతరించుకున్న షిరిడీ ధరిత్రిపై కాలిడినది మొదలు దేహత్యాగం చేసే చివరి ఘడియ వరకు కోటాను కోట్ల సాయి లీలను సేకరించి సాయి భక్తుల కందించెను. వాటన్నిటిని ఈ గ్రంథంలో ప్రచురించడం సాధ్యం కాక అతి ముఖ్యమైనవి, ఇంత వరకూ ప్రచురితం కాని సాయి లీలలను స్వామీజీ బోధించిన సాయి తత్వాన్ని సాయి మరియు స్వామీజీల ఆశీస్సులతో మీ కందిస్తున్నాను.

స్వామీజీ ఎల్లప్పుడు బాబా అయోని సంభవుడు ఆయన సాక్షాత్తు దత్తాత్రేయుడే అని చెప్పేవారు. సాయి ఏ నాడు తమ తల్లిదండ్రుల గురించి ప్రస్తావించలేదు. బాబా సశరీరులుగా ఉన్నప్పుడు గానీ, మహాసమాధి చెందిన తురువాత గాని ఎవ్వరూ బాబా వారసులమని చెప్పలేదు. బాబా బాల్యం ఎక్కడ, ఎట్లా గడిచింది కూడ ఎవ్వరూ చూసినట్లు చెప్పలేదు. బాబా మహాసమాధి చెందిన తరువాత బాబా వారసు లెవరైనా ఉంటే వారికి బాబా ఉపయోగించిన వస్తువులను అంద చేస్తామని ప్రకటించి నప్పుడు కూడ ఎవ్వరూ బాబా వారసుల మని ముందుకు రాలేదు. బాబా ఈ అవతారంలో పదునారేండ్ల యువకునిగానే ప్రకటిత మయ్యారు. బాబా స్వయంగా ***"బ్రహ్మము నా తండ్రి, మాయ నా తల్లి, వారి కలయిక వల్లనే ఈ శరీరం ఉద్భవించినది"*** అని చెప్పారు. బాబా ఏ సందర్భములోను అసత్యమాడలేదు. అసత్యమాడ వలసిన అగత్యం కూడ బాబాకు లేదు. ఈ అవతారంలో బాబాకు బాల్యం గానీ, తల్లిదండ్రులు గాని లేరని వారు సాక్షాత్తు జనన మరణాల కతీతుడైన పరబ్రహ్మ యని వక్కాణించే వారు. నామదేవు భీమారథి తీరమున గోణాయికి ముత్యపు చిప్పలోను, కబీరు భాగీరథ నదీ తటమున తమాలుకు లభించిరి. వీరిరువురిని అయోని సంభవులని నమ్మిన ప్రజలు బాబా అయోని సంభవుడని ఎందుకు విశ్వసించరో అర్థం కాదని స్వామీజీ విచారించే వారు. ఒక చోరత్వపు కేసు సందర్భమున కోర్టు రిసీవరు బాబాను "మీ వయస్సెంత?" యని ప్రశ్నించగా బాబా "నా వయస్సు

లక్షల సంవత్సరాలు" యని సమాధాన మిచ్చెను. వీటన్నిటిని బట్టి బాబా నిక్కముగా అయోని సంభవుడే నని మనము గ్రహించ వలెనని స్వామీజీ వచించే వారు. నది మూలం, యోగి జననం గురించి తెలుసుకునే ప్రయత్నాలు కూడ చెయ్యకూడదని మన పురాణాలు ఘోషిస్తున్నా బాబా జననాన్ని గురించిన తర్క, వితర్కాలు స్వామీజీని కలవర పరచేవి.

బాబా యొక్క గురువును గురించి ప్రస్తావించి నప్పుడు కూడ స్వామీజీ "బాబా సద్గురువులకే సద్గురువు. సచ్చిదానంద సమర్థ సద్గురువు. ఆది గురువైన దత్తావతారు" దని అచంచల విశ్వాసంతో చెప్పేవారు. వెంకూసా విషయం ప్రస్తావించగా వెంకూసా అసలు నామధేయము గోపాల్ కృష్ణ కేశవరాజ్ బాబా సాహెబ్ మహారాజ్ అనియు ఈయన వేంకటేశ్వర స్వామి భక్తుడగుట వలన అందరు ఈయనను 'వెంకూసా' అని పిలచెడి వారు. ఈ మహాభక్తుడు 1801వ సంవత్సరములో మహాసమాధి చెందెనని చరిత్రలో నుండుటయే గాక ఆయన వారసులు సహితము దీనిని ధృవీకరించి రనియు కావున బాబా అవతార ప్రారంభానికి షుమారు నాలుగు దశాబ్దముల ముందే మహాసమాధి చెందిన వెంకూసా బాబాకు గురువు కాదన్న విషయాన్ని స్పష్టపరచు చున్నదని చెప్పేవారు. షిరిడీలోని 'గురుస్థాన్' విషయంలో బాబా స్వయంగా తానక్కడ 12 సంవత్సరాలు తపస్సు చేసినట్లు చెప్పారు గదా! అనగా స్వామీజీ "బాబా 16 సంవత్సరాల యువకునిగా నున్నప్పుడు ఈ విషయం చెప్పారు అంటే తపస్సు ప్రారంభిచే నాటికి బాబా వయస్సు నాలుగు సంవత్సరాలు గదా! అంత చిరు ప్రాయంలోనే ఎవ్వరికైనా తపస్సు చేయుట సాధ్యమా? ఒకవేళ అది సాధ్యమైతే ఆయన మానవ మాత్రుడు కాదు, సాక్షాత్తు ఆ పరబ్రహ్మమే అయి ఉండాలి. అటువంటి పరబ్రహ్మకు గురువు యొక్క ఆవశ్యకత ఏమున్నది?" అని ఎదురు ప్రశ్నించే వారు. మరి ఈ విషయంలో బాబా అసత్యం చెప్పారా అంటే "బాబా ఎప్పుడు సత్యాన్నే వచించే వారు. అసత్య మనే పదం బాబా నిఘంటువులోనే లేదు. బాబా చెప్పింది ఏ అవతారందో మనకు తెలియద"ని స్వామీజీ బదులిచ్చే వారు. గురువు యొక్క ప్రాముఖ్యతను ప్రజలు విస్మరించ కుండా ఉండటానికే బాబా గురువును పదే పదే ప్రస్తావించే వారు. ఎల్లప్పుడు తన చెంతనే ఉండే ఇటుక తమ గురు ప్రసాద మని దానిని తన ప్రాణం కంటే మిన్నగా చూసుకుని గురువును ఎలా గౌరవించాలో ఆచరించి చూపించారు బాబా" అనే వారు





స్వామీజీ. సద్గురువులకే సద్గురువైన సాయి బాబా తానెప్పుడు గురువునని చెప్పుకోలేదు. తాను సామాన్య మానవుడిననియు, ఇతరుల నుంచి ఎంతో నేర్చుకోవాలని అనేవారు. కాని ఈ తరం వారి ప్రవర్తన ఇందుకు పూర్తిగా విరుద్ధంగా ఉందని, కాషాయ వస్త్రాలు లేక శ్వేత వస్త్రాలు, రుద్రాక్షమాలలు ధరించి బాబాను గురించి తమకు తెలిసిన మిడి మిడి జ్ఞానంతో పది మందినీ ఆకట్టుకొని సాయి సన్నిధిలోనే గురువులమని చెప్పుకుని కీర్తి ప్రతిష్టల కోసమో, భుక్తి కోసమో ప్రాకులాడే వారిని చూచిన స్వామీజీ వికలిత మనస్కులయ్యే వారు. ఈ కపట గురువుల వలలో పడి ఎంతో మంది మోసపోతున్నారని, వీరి వలన అసలైన గురువుల ఉనికికే హాని కలుగుతోందని వాపోయే వారు మన స్వామీజీ. సాయి తత్వాన్ని సంపూర్ణంగా ఆస్వాదించిన స్వామీజీ "నేను ఓ, న, మః లు మాత్రమే నేర్చు కున్నాను. వాటినే మీకు బోధిస్తున్నాను, ఆ పైన మనందరినీ నడిపించే వాడు సాయినాథుడే" అని అతి వినయంగా శలచ్చేవారు. నిరంతరం సాయి తాత్వాన్ని షిరిడీలో గురుస్థాన ప్రాంగణము లోని మెట్ల క్రింద గల అతి చిన్న గది నుంచి దేశ, విదేశాలలో సహితం వ్యాపింప చేసిన ఘనత మన పూజ్య స్వామీజీది.



బాబా అవతార ప్రత్యేకతను స్వామీజీ ఎంతో విపులంగా వివరించే వారు. ఒకొక్క అవతారం ఒకొక్క ప్రత్యేకతను కలిగి యుండగా కలి యుగ మందవతరించిన సాయినాథుని అవతారం అనేక ప్రత్యేకతలను సంతరించుకుందని చెప్పేవారు. సామాన్యులకు సామాన్యుడి గాను, తన నిజమైన భక్తులకు మాత్రము అసమాన్యులు గాను, రామ భక్తులకు రాముని గాను, శివ భక్తులకు ఈశుని గానూ, దత్త భక్తులకు దత్తాత్రేయుని గానూ, ఉత్తమ శిష్యులకు సద్గురువు గాను దర్శన మిచ్చి సర్వ దేవతల సమగ్ర స్వరూపమే శ్రీ సాయినాథుని అవతారమని బోధించే వారు. దీనిని ధృవీకరిస్తూ మధ్యాహ్న హారతిలో శ్రీ

మాధవరావు వామనరావు అద్కర్

**జయా మనీ జైసా భావ తయా తైసా అనుభవ**

**దావిసి దయాఘనా ఐసీ తుఝీ హిమావ తుఝీహి మావ**

**ఆరతి సాయి బాబా ..**

అని స్తుతించాడు. శ్రీ నరసింహ స్వామీజీ సాయి నాథ అష్టోత్తర శతనామావళి యందు

'ఓం శ్రీ కృష్ణ శివ మారుత్యాది రూపాయ నమః'

అని పేర్కొనటం జరిగింది.

"కుల మతాల కతీతంగా సర్వ మానవాళి సమానమని బోధించిన వారు అనేక మంది కాగా సర్వ ప్రాణకోటి సమానమని చాటిచెప్పటమే గాక సర్వ ప్రాణికోటి యందు తానే ఉన్నాని ఏ ప్రాణికి ఏది సమర్పించినా అది తనకే చెందుతుందని అనేక సందర్భాలలో నిరూపించుటయే సాయినాథుని అవతార విశిష్టత" యని స్వామీజీ వివరించే వారు.

భక్తులు తమ తమ బాధలు నివారించమని తమ ఇష్ట దైవాన్ని ప్రార్థిస్తే ఆ దైవం కరుణించి తన భక్తులను బాధా విముక్తులను చేయుట సర్వ సామాన్యమైన వియషం కాగా తన భక్తుల బాధలను తానే భరించి, భక్తుల కర్మ ఫలాన్ని సమూలంగా నివారించుట సాయినాథుని యొక్క మరొక విశిష్టత. ***"నా శరణు జొచ్చి నిష్ఫలంగా మరలి పోయిన వారిని నొక్కరిని చూపించండి"*** అన్న సాయి అభయం బాబాకు తన భక్తులయందు గల ప్రేమానురాగాలను స్పష్టం చేస్తోంది. ఇన్ని విలక్షణమైన విశిష్టతలు గల సాయి బాబా సంపూర్ణ కరుణా కటాక్షములు పొందవలెనన్న ఏమి చేయవలెనని స్వామీజీని ప్రశించగా స్వామీజీ ఎంతో ఓర్పుతో అతి విపులంగా వివరించారు. శేజ హారతి లోని ***"వైరాగ్యాచా కుంచా ఘేవుని చౌకు ఝాడిలా, బాబా చౌక ఝాడిలా"*** అన్న వాక్యాన్ని సరిగా అర్థం చేసుకుని ఆచరిస్తే బాబా యొక్క సంపూర్ణ కరుణా కటాక్షములు పొందగలరనియు దానిని వివరిస్తూ "సర్వసంగ పరిత్యాగము చేసి, అనగా, తనువుని, ధనమును, మనస్సును బాబా సేవకే వినియోగించి దేనిపైనా ఆశాపాశములు లేక సర్వమును త్యజించిన వెనువెంటనే వైరాగ్య ప్రాప్తి కలుగుతుంది. అట్టి వైరాగ్యమును చీపురుగా చేసి బాబా శయన స్థలమును





శుభ్రపరచుట కుపయోగించితే సాయినాథుని సంపూర్ణ కృపకు పాత్రులగుదుర"ని శలవిస్తూ "ఇది నేటి ఈ సమాజంలో ఏ ఒక్కరికి సాధ్యం కాదన్న సంగతి బాబాకు తెలుసు ననియు అందుకనే మరెన్నో రీతుల తన కృపను పొందవచ్చుని అనేక సంఘటనలలో మనందరికి తెలియ పరచెను. ***"ఎవ్వరైతే నా కర్పించకుండా ఏమీ భుజించరో వారికి నేను బానిసను" "ఎవ్వరైతే ఎల్ల వేళలా నా నామాన్నే స్మరిస్తారో వారికి నేను రుణగ్రస్థుడను వారి హృదయమే నా నివాసము, వారు నా అంతటి వారు"*** అన్న సాయి అభయాన్ని మనం సదా గుర్తుంచుకొని ఆచరిస్తే బాబా ప్రసన్నుడవుతాడు. నవ విధ భక్తులలో దేనినైనను త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే బాబా కరుణిస్తాడు. కష్టార్జితము, న్యాయంగా సంపాదించిన ధనంతో ఎంత చిన్న మొత్తాన్ని దాన, ధర్మాలకు వెచ్చించినా బాబా మెచ్చు కుంటాడు. గర్వాహంకారములతోను, అన్యాయార్జితమైన ధనంతో ఎన్ని సత్కార్యాలు చేసినా ఫలితం శూన్యమే. నేటి తరంవారు నిత్య కృత్యాలకే సమయం చాలటం లేదని అటువంటప్పుడు సాయి సేవను ఎలా చేయగలమని వాపోతున్నారు. నిత్యం మనకు తెలియకుండానే ఎంతో సమయాన్ని వృథా చేస్తున్నాం, ఆ వృథా సమయాన్ని బాబా సేవకు అంకితం చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా గృహిణులు ఇంటి పనిని ఎంతో చాకచక్యంగాను యాంత్రికంగాను చేసేస్తారు. వారు వారి పనులు చేసుకుంటూనే బాబా నామ స్మరణ చేసుకుంటే వారి కంటే పుణ్యాత్ములు మరెవ్వరు ఉండరు. ఈ సృష్టి యంతయు బాబాదే. ఆయనది కానిదంటూ ఏమి లేదు. దీనిని గుర్తెరిగి 'తేరా తుజ్‌కో అర్పణ్ క్యాలాగే మేరా' (నీది నీకే అర్పిస్తున్నాను నాదేమి లేదు) అన్న భావంతో అర్పించాలి" అప్పుడే బాబా మనకు మార్గదర్శియై మన నుద్ధరించు నని స్వామీజీ తెలిపెడి వారు.

హారతి సమయాలను గురించి ఆయా సమయాల్లో బాబాకు నాలుగు హారతులు ఎందుకు ఇస్తున్నది మన స్వామీజీ ఎంతో వివరంగా తెలియ పర్చారు.

ప్రతి నిత్యం అరుణోదయ సమయాని కంటే ముందేగానే నిద్ర మేల్కొంచి కాలకృత్యములు ముగించుకొని "బాబా నీవే మాకు తల్లి, తండ్రి, గురువు, దైవం, మీ బిడ్డలమైన మమ్ము నీవే కాపాడాలి" యని బాబా పాదోదకాన్ని స్వీకరించి దిన చర్యను ప్రారంభించటానికి నిర్దేశించ బడినదే 'కాకడ' హారతి. అధిక సంఖ్యాకులు "కాకడ" హారతి లేక "సుప్రభాత సేవ"ను భగవంతుని

మేల్కొలపటానికని భావిస్తారు. కాని ఇది సరియైన అవగాహన కాదు. సాక్షాత్తు ఆ పరబ్రహ్మ అరక్షణమైనా కన్ను మూస్తే ఈ లోకాలన్ని సమూలంగా నాశనమై పోతాయి. ఈ సుప్రభాత సేవ మనలోని భక్తిని మేల్కొలపటానికని మనం గ్రహించాలి.

మధ్యాహ్న సమయానికి జనులు తమ తమ కార్యాలలో సతమతమై అలసి సొలసి, ఆకలితో నక నకలాడి పోతారు. ఇంటిలో వండిన వంటకాలను ఎప్పుడు భుజిద్దామా అని ఎదురు చూస్తుంటారు. ఈ సృష్టిలో మనకు లభించేవన్ని ఆ భగవంతుని సృష్టియే నని మనం గ్రహించాలి. ఆ దేవాధి దేవుడు మనకిచ్చిన వాటికి కృతజ్ఞతా పూర్వకముగా ముందుగా ఆయనకు సమర్పించి ఆ ఉచ్ఛిష్టాన్ని మనం భుజించుట మన కర్తవ్యమని తెలియ జేయుటకే 'మధ్యాహ్న హారతి'.

సంధ్యా కాంతుల వేళ రవి అస్తమించే సమయానికి ప్రాణులన్ని కష్టించి పని చేసి అలసి పోతాయి. ఆ సమయంలో ప్రతి ప్రాణికి మనశ్శాంతి అవసరము. అట్టి ప్రశాంతత బాబా సన్నిధిలోనే మనకు లభిస్తుందన్న విషయాన్ని మనకు బోధించటానికే 'సాయం హారతి'.

దిన చర్యను ముగించుకుని నిద్ర కుపక్రమించే ముందు సాయినాథునికి మరొక్క సారి ప్రణమిల్లి నిదురలో సహితము చెడు స్వప్నములు రాకుండా కాపాడి సూర్యోదయమునకు ముందే మేల్కాంచి కాకడ హారతికి హాజరయ్యేలాగ చూడమని ప్రార్థించి బాబా ప్రసాదం స్వీకరించాలని తెలుపుటకే 'శేజ హారతి' విశిష్టత.

బాబా హారతులను (1) సంత్ తుకారాం (2) సంత్ జానాబాయి (3) సంత్ నామదేవ్ (4) శ్రీ కృష్ణ జోగీశ్వర భీష్మ (5) శ్రీ దాసుగణు మహారాజ్ (6) శ్రీ మాధవ్ రావు వామనరావ్ అడ్కర్ (7) పండిట్ శ్రీ మోహినీ రాజ్ (8) శ్రీ ఉపాసనీ బాబా (9) శ్రీ రామేశ్వర భట్ (10) శ్రీ బి.వి. దేవ్ మరియు (11) శ్రీ రామ జనార్ధన స్వామి రచించారు.

బాబా ఏకాదశ సూత్రములను బాబా అనేక సందర్భాలలో భక్తుల కిచ్చిన అభయాలను సేకరించి క్రోడీకరించి మన కందించిన పుణ్యమూర్తి పండిట్ శ్రీ మోహినీ రాజ్. దీనిని గమనించని చాల మంది బాబా మహాసమాధికి కొద్ది క్షణముల ముందు భక్తుల కిచ్చిన అభయములని తలపోస్తున్నారు. ఇది సరియైన అవగాహన కాదు.





మన పూజ్య స్వామిజీ పురాతన మరాఠీ సాయిలీల మాస పత్రికల నుంచి మరియు అసంఖ్యాక సాయి భక్తుల నుంచి సాయి దివ్య లీలలను సేకరించి భక్తులకు వివరించే వారు. వాటిలో అతి ముఖ్యమైన వాటిని మీ ముందుంచు తున్నాను.

బాబా రెండవ పర్యాయము షిరిడీ వచ్చినప్పుడు ఖండోబా మందిర పూజారి బాబాను "ఆవో సాయి" అని ఆహ్వానించుట మనందరికి విదితమే. కాని బాబా 1853 లేక 1854లో ప్రథమంగా షిరిడీ వచ్చినప్పుడు, షిరిడీ గ్రామస్తులు ఆయన పేరు, ఊరు అడగగా బాబా **"మై సాయి హై, గోసాయి హై లంబే లంబే సే ఆయే హై"** అని చెప్పినట్లు పాండురంగ కావడే అనే భక్తునిచే రచించ బడిన ఒక గ్రంథంలో ప్రస్తావించినట్లు స్వామిజీ చెప్పి బాబాకు ఎవరు పేరిడినా ఆ నామ మహాత్మ్యాన్ని మనం గుర్తించాలి, ఈ కలియంగంలో **"సాయి"** అన్న రెండక్షరాలు భక్తుల పాలిటి కల్పతురువు, కామధేనువు కన్న మిన్న, **"సాయి"** అన్న పదం ఉచ్ఛరించిన మాత్రాన సర్వ నదులలో స్నాన మాచరించిన ఫలితం, సకల పుణ్య క్షేత్రాలను దర్శించిన ఫలితం కలిగి ఆ **"సాయి"** నామమే మనని భవసాగరము దాటించే నావ యని గ్రహించి సాయి భక్తులు ఎల్ల వేళలా సాయి నామ స్మరణ చేస్తే అదే వారికి శ్రీరామ రక్ష యని పేర్కొనే వారు.

ఒక పర్యాయం రాధాకృష్ణ ఆయీ జ్వరంతో బాధపడుతుండగా బాబా ఆమె ఇంటి దగ్గరకు వచ్చి ఒక నిచ్చెన తెప్పించి ఆ నిచ్చెన మీదుగా ఇంటి మీదకెక్కి మరొక వైపు నుంచి దిగి రాధాకృష్ణ ఆయీకి స్వస్థత చేకూర్చిన వైనం సాయి భక్తులందరికి విదితమే. ఆ నిచ్చెన తెచ్చిన వ్యక్తికి బాబా రెండు రూపాయలనిచ్చి కష్టానికి మించిన కూలి నివ్వాలని తెలియ జేసిన సంగతి కూడ మనందరికి తెలుసు. ఆ నిచ్చెన తెచ్చిన వ్యక్తి పేరు వెంకూ షింపే కాంబ్లేకర్ అనియు అతనికి సంతానం లేకపోవటంతో బాబా ప్రసాదించిన రెండు రూపాయలను తన పూజా మందిరంలో ఉంచి పూజించగా అనతి కాలంలోనే అతనికి ఇరువురు మగ సంతానం కలిగినట్లు స్వామిజీ కాంబ్లేకర్ పెద్ద కుమారుడైన అనంతరావ్ కాంబ్లేకర్ ద్వార తెలుసుకున్నట్లు వివరించారు.

నిచ్చెన తెచ్చినందుకే బాబా రెండు రూపాయల నివ్వటం అందరిని ఆశ్చర్య పరచగా అతని చిరకాల మనోవాంఛ నీడేర్చి సంతానాన్ని ప్రసాదించిన

వైనం ఎంత మందికి తెలుసన్నది అనుమాన స్పదమే.

బాబా సశరీరులుగా నున్నప్పుడు అరుదుగా నీంగాంలోని డేంగలే గృహమునకు, రహతా నివాసి యైన కుశాల్‌చంద్ గృహములకు వెళ్ళెడి వారు. బాబా షిరిడీ పొలిమేరలు దాటుతున్నారన్న విషయాన్ని తెలుసుకొని వారి భక్తులు బాబాను షిరిడీ వీడి వెళ్ళవద్దని వేడుకునేవారు. వారి ప్రార్ధనను మన్నించి సాయం సమయానికి తిరిగి షిరిడీ వస్తానని వారికి అభయమిచ్చి వారి కోర్కెను మన్నించెడి వారు. ఒక పర్యాయము బాబా నీంగాంలోని డేంగలే గృహమునకేగి అతని యోగక్షేమము లరయుచుండ పెరటి చెట్టు మీద ఒక పక్షుల జంట సభాషించుకొనుట గమనించిన బాబా అవి ఏ విషయము చర్చించుకొను చున్నవో తెలుపుమని పక్షిభాష నెరంగిన డేంగలేను అడుగగా ఆ రోజు షిరిడీలో శని మందిరమునందు శని దేవునకు సమర్పిస్తున్న ప్రసాదంలో ఒక విషసర్పం పడి చచ్చినదని అది తిన్న తొమ్మిది మంది భక్తులు మరణిస్తారని ఆ పక్షులు సంభాషించు కుంటున్నట్లు డేంగలే వివరించెను. అది విన్న వెంటనే బాబా టాంగాలో షిరిడిలోని ద్వారకామాయికి వచ్చి అచట నున్న భాగోజీతో ఆ విషపూరితమైన ప్రసాదాన్ని నేలపాలు చేయించగా అచట నున్న భక్తులందరు కోపోద్రేకముతో భాగోజీని శిక్షించటానికి వెంట పడగా అతను బాబాను శరణు వేడాడు. బాబా వారిని వారించి ఆ ప్రసాదం మొత్తాన్ని నేల మీద గ్రుమ్మరించగా అందులో చచ్చి పడి ఉన్న సర్పమును గాంచి తమ ప్రాణములను కాపాడిన సాయినాథునికి కృతజ్ఞతలు తెలుపగా బాబా వారి కృతజ్ఞతలు డేంగలేకు తెలుప వలెనని అతనే వారి ప్రాణదాత యని జరిగినదంతా వారికి వివరించెను. సర్వ ప్రాణకోటిలోను తానై ఉన్న బాబాకు పక్షిభాష తెలియదా? యన్న సందేహం మానవ మాత్రులమైన మనకు కలుగుట సహజం. ఈ సందేహమునే స్వామిజీ చెంత ప్రస్తావించగా ఆయన చిరు నవ్వుతో "సాయినాథుని ఆజ్ఞ లేక ఆకైనా కదలదు. బాబా సర్వాంతర్యామే కాదు త్రికాలవేది కూడ. ఆయనకు సర్వము అవగతమే. బాబా ఎప్పుడు కీర్తి ప్రతిష్టలకు ప్రాకులాడే వారు కాదనియు, ప్రతి మంచి కార్యానికి ఎవరినో ఒకరిని నిమిత్త మాత్రునిగా చేసి ఆ కీర్తి, ప్రతిష్టలకు తాను కడు దూరంగా ఉండే వార"ని స్వామిజీ శలవిచ్చారు. "జ్ఞాన రాశియై యుండియు సామాన్య మానవుని వలె, చక్రవర్తి అయ్యుండియు ఫకీరు వలె, పంచ భక్ష పరమాన్నములను రజిత పాత్రలలో ఆయనకు సమర్పించినను





భిక్షాటనతో జీవనాన్ని కొనసాగించిన పరమ పూజనీయుని పాదార విందములను మన మాశ్రయించుట మన పూర్వ జన్మ సుకృతమే"నని వచించే వారు మన స్వామిజీ.

బాబా మహాసమాధికి పూర్వం ఒక కుగ్రామములో నివసిస్తున్న వనితకు వయస్సు మీరుతున్నా గాని వివాహం కాకపోతే ఆమె బాబాకు తన వివాహం త్వరగా జరిగేటట్లు అనుగ్రహిస్తే షిరిడీకి వచ్చి బాబాను దర్శించుకుని ఒక నారికేళమును సమర్పించెదనని మ్రొక్కు కున్నది. ఆమెకు బాబా యందు అచంచల విశ్వాసం గలదు. బాబా తప్పనిసరిగా తన కోర్కె నీడేరుస్తాడన్న విశ్వాసము గలది. భక్త వత్సలుడైన సాయి ఆమె మొరనాలకించి వివాహం జరిపించారు. ఆమె తల్లిదండ్రులు చీర, సారెతో ఆమెను అత్తవారింటికి పంపి తమ బాధ్యతను నెరవేర్చు కున్నారు. ఆమె అత్తింటి వారికి బాబా యందు విశ్వాసమే లేకపోగా బాబాను దుర్భాషలాడెడి వారు. అట్టి వారు తనను బాబా దర్శనానికి పంపరని విశ్చయించుకుని బాబాయే వారి మనస్సులను మార్చి తనను షిరిడీకి రప్పించుకోమని బాబాను మనసార వేడుకుంది. ***"నా భక్తులు ఎంత దూరమున నున్నను, సప్త సముద్రములావల నున్నను, పిచ్చుక కాళ్ళకు దారము కట్టి లాగు చందమున వారిని నా వద్దకు రప్పించు కుంటాను"*** అని అభయమిచ్చిన బాబా తన భక్తురాలు తన దర్శనార్ధమై తహతహ లాడుతుంటే మిన్న కుండునా! ఆమె భర్త మనస్సు మార్చుటయే గాక ఆమె షిరిడీ ప్రయాణమునకు ఏర్పాట్లన్నియు అతని చేతనే చేయించి ఆమెను తన చెంతకు రప్పించు కొనెను. ఆమె బాబాను దర్శించి బాబా దివ్య స్వరూపమును కనులార గాంచి ఆనందము పరవళ్ళు త్రొక్కుచుండ బాబా పావన చరణారలపై తన శిరస్సు నుంచి బాబాకు తన కృతజ్ఞతలు తెలియ జేసుకొనెను. ఆ రాత్రి షిరిడీలోనే గడిపి తెల్లవారు ఝాముననే నిద్రలేచి అభ్యంగన స్నాన మాచరించి, చలువ వస్త్రములు ధరించి నారికేళమును చేబూని బాబా దర్శనార్ధమై ద్వారకామాయి చేరుకున్నామె తన నాసికాభరణమును ఎవ్వరో దొంగిలించటం గమనించి దుఃఖ పూరితురాలై నాసికాభరణము లేకుండా తన అత్తవారింట్లో అడుగు పెడితే తనను కాపురం కూడ చెయ్యనివ్వరని తలంచి తనకు మేలు చేసిన బాబానే దుర్భాషలాడసాగెను. బాబా "అమ్మా, నీ నాసికాభరణాన్ని ఎవ్వరు అపహరించ లేదు. అది నీ దగ్గరనే ఉన్నది" అనినను ఆమెకు బాబా

మాటలయందు విశ్వాసము కుదరక విచార వదనయై, కన్నీటిని బలవంతముగా ఆపుకుంటూ ద్వారకామాయిని వీడుతుంటే బాబా "అమ్మా, నా కోసం తెచ్చిన నారికేళమును నా కివ్వవా?" అనగా ఆమె మరింత ఆగ్రహముతో బాబా చెంతకు వచ్చి "నీది నీవే తీసుకో" అని దానిని నేలమీద పగల కొట్టగానే ఆమె నాసికాభరణం అందులో నుంచి బయటకు వచ్చింది. ఆ దృశ్యమును గాంచిన ఆమె విస్మిత వదనయై బాబాను అనవసరంగా ధూషించినందులకు బాబాను క్షమాపణ వేడి బాబా అనుమతి, ఊది ప్రసాదమును గైకొని అత్త వారింటికి చేరి తన అనుభవమును అచటి వారందరికి తెలుపగా అందరు సంతసించి ఆమె అత్తింటి వారు సహితము బాబా భక్తులగా మారెను. ఈ లీలలోని అంతరార్థమును "బాబా తన భక్తులకు తనపై ఎంతటి విశ్వాసమున్నదో పది మందికి తెలియజేయుటకు అప్పుడప్పుడు పరీక్షలకు గురి చేస్తాడు. ఎంతటి విపత్తు సంభవించినా బాబా యందు భక్తి, విశ్వాసములు సడలించక బాబానే నమ్ముకున్న వారు ధన్యుల"ని స్వామిజీ వివరించెను.

దాసుగణు మహారాజ్ ఒక పర్యాయము బాబాను దర్శించి తనకు గంగా యమునల సంగమంలో స్నాన మాచరించ వలెనన్న కోరికను వెలిబుచ్చి ప్రయాగ ప్రయాణమునకు అనుమతి నొసంగమని వేడగా బాబా "గణూ ప్రయాగ స్నానం కొరకు ప్రయాసపడి అంత దూరం వెళ్ళాలా? అవి ఇక్కడ లేవా?" యని ప్రశించగానే దాసుగణు నిరుత్సాహముతో బాబా తనకు అనుమతి నొసంగలేదని తలంచి బాబా చరణములపై తన శిరస్సు నుంచి ప్రణమిల్లగా బాబా రెండు పాదముల బ్రొటన వ్రేళ్ళనుండి గంగా యమునలు ప్రవహించినవి. వింతలలోకే వింత యైన ఈ వింతను గాంచిన దాసుగణు అచ్చెరువొందెను. అతని హృదయము ఆనంద భరితమై కన్నుల నుండి ఆనంద భాష్పములు రాలుచుండ అప్రయత్నముగా అతని నోటి నుండి సాయి లీలాసంకీర్తన రూపమున పరవళ్ళు త్రొక్కినది. దాసుగణుకు మనమున బాబా ముస్లిం యన్న అనుమాన ముండుటచే ఆ పవిత్ర తీర్థమును దోసిలిలో పట్టి కన్నులకద్దుకొని శిరమున జల్లుకొనెనే గాని ఆ తీర్థమును సేవించలేదు. కొంత కాలము తరువాత తన గురువును దర్శించుకొనగా ఆయన "బాబాను ముస్లిం అనుకొని ఆయన చరణాల నుండి ప్రవహించిన గంగా యమునల జలమును స్వీకరించక చేతికంది వచ్చిన ఫలమును చేజార్చు కున్నావు. ఎన్ని జన్మ లెత్తినా నీకు ఈ అవకాశం



సాయి సేవక్ శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము

మరల రాదు" అని మందలించగా దాసుగణు తాను చేసిన తప్పిదమును గ్రహించెను. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందమాయెను దాసుగణు పరిస్థితి. దాసుగణు మనస్సెరింగియు బాబా గంగా యమునలను ఎవరి కొరకు షిరిడీకి రప్పించె నని స్వామిజీని ప్రశ్నించగా ఆయన "మానవులు తెలిసో తెలియకో అనేక పాపములు చేయుదురు. ఆ పాప ప్రక్షాళన కొరకు పవిత్ర నదులలో స్నాన మాచరించి పునీతు లగుదురు. యోగుల, పుణ్య చరితుల, పావనమూర్తుల పావన చరణ ధూళితో తమ పాప భారములను తొలగించుకుని పునీతమవుతాయి నదీమ తల్లులు. యోగులకే యోగి రాజు, పుణ్యమూర్తులకే పునీతుడు, సాక్షాత్తు పరబ్రహ్మ సాయి నాథుని చరణ ధూళి కొరకు నదీమ తల్లులు తహతహలాడుతుండ బాబా ఏ నాడు షిరిడీ వీడకుండుట, బాబా ఆజ్ఞ లేక ఎవ్వరూ షిరిడీ పుణ్య భూమిపై కాలిడలేరని గ్రహించిన నదీమ తల్లులు తాము షిరిడీకి వెళ్ళలేక బాబాను తమ చెంతకు రప్పించుకొన లేక మథన పడుచుండ బాబా "గంగా యమునల కొరకు అంత దూరం వెళ్ళాలా అవి ఇక్కడ లేవా?" యని దాసుగణును ప్రశ్నించినను బాబా తమకు పరోక్షముగా షిరిడీ ప్రవేశానికి అనుమతి నొసంగెనని గ్రహించి వెంటనే అర క్షణమైనను ఆలస్యము చేయక, గంగా యమునలు షిరిడీ ప్రవేశ మొనరించి బాబా పావన చరణముల చెంత ప్రవహించె" నని స్వామిజీ వివరించెను. దాసుగణుని సాకుగా చేసుకొని గంగా యమునల కోర్కెను బాబా ఏ విధముగా తీర్చినది చదువరులు గ్రహింతురు గాక.

## వ్యాధులు బాపే ఊది :

బాబా తనను దర్శించ వచ్చిన భక్తులకు ఊది ప్రసాదాన్నిచ్చి ఆశీర్వదించే వారు. బాబా ద్వారకామాయిలో ప్రజ్వలింప జేసిన నిత్య అగ్నిహోత్రంలోని విభూదియే "ఊది". ప్రతి నిత్యము మధ్యాహ్న హారతి అయిన పిదప భక్తులు వారి గృహములకు వెళ్ళునప్పుడును, షిరిడీ నుండి భక్తులు తమ స్వగ్రామములకు మరలు నప్పుడు బాబా వారికి ఊది నొసంగి ఆశీర్వదించెడి వారు. వ్యాధి గ్రస్తుల పాలిట దివ్య ఔషధం ఈ ఊది. బాబా యందు సంపూర్ణ విశ్వాసముంచి ఊది సేవిస్తే అది సంజీవని కన్నా మిన్నగా పని చేస్తుంది. ఈ దివ్య ఊది మహాత్మ్యం అనేక గ్రంథాలలో వివరించ బడినది.

ఒక పర్యాయము స్వామిజీకి పరిచయమున్న వ్యక్తి ఒకరు అరటి పండులో విషం కలిపి స్వామికి ఇవ్వగా స్వామి నాలుక కొస రెండుగా చీలి రక్తం స్రవించగా స్వామి జరిగినది గ్రహించి ఏ మాత్రము అధైర్య పడక భారమంతయు బాబాపై వేసి ద్వారకామాయి కేగి ఊదిని సేవించగానే రక్తము స్రవించుట ఆగిపోయి గాయం కూడ మాయమైనది. తనకింత మేలు చేసిన బాబాకు కృతజ్ఞతా పూర్వకముగా 'ధుని పూజ' చేసెను స్వామిజీ.

బాబా భక్తుడైన నానా చందోర్కర్ కుమార్తె మైనతాయికి ఊదిని సేవింప చేసిన వెంటనే సుఖ ప్రసవమైన సంగతి మనందరికి విదితమే. గర్భిణీ స్త్రీలు ఊది, తేనె 1:3 నిష్పత్తిలో సేవిస్తే సుఖ ప్రసవమవుతుందని స్వామిజీ తెలియ జేసారు.

శ్రీ టి.యస్. యస్. ప్రసాద్ గారి (ఇంటి నం. 111, సెక్టార్-2, వనస్థలి పురం, హైదరాబాద్-500 070) భార్య మధుమేహ వ్యాధితో బాధపడుతూండే వారు. ఒకసారి ఈమెకు కాలిలో మేకు గ్రుచ్చుకొని గాయమై నడవలేని పరస్థితిలో వైద్యులను సంప్రదించగా వారు శస్త్రచికిత్స చేయాలని చెప్పారు. ప్రసాద్ గారు సాయి అంకిత భక్తులు, సాయి సచ్చరితను ఆరు వందల పర్యాయాలు పైగా పారాయణ చేసిన పరమ సాయి భక్తులు. నేటికిని ప్రతి నిత్యం పారాయణ పూర్తి చేసిన పిమ్మటనే భుజింతురు. బాబా యందు అత్యంత విశ్వాసము గలవారు. ఆయన భార్యకు వైద్యులు శస్త్రచికిత్స చేయక తప్పదని వేరే మార్గం లేదని చెప్పినను బాబా పైనే భారం వేసి ఆమె గాయానికి రోజు ఊదిని రాసి, ప్రతినిత్యం బాబా తీర్థం ఇవ్వగా మూడవ రోజు నుంచే ఆమె నడవ గలిగింది. వారం రోజుల్లోనే గాయం పూర్తిగా మాని ఆరోగ్యవంతురాలయ్యెను. రెండవ పర్యాయం ఆమెను పరీక్షించిన వైద్యులు సహితం అచ్చెరు వొంది, గాయం పూర్తిగా మానినదని ఏ విధమైన శస్త్రచికిత్స అవసరం లేదని చెప్పినారు.

స్వామిజీకి ధుని యందు అత్యంత విశ్వాసము గలదు. ఆయన విశ్వాసము మాటలలో వర్ణించ నలవి కాదు.

1974వ సంవత్సరములో రష్యా దేశమునకు చెందిన కొందరు వాతావరణ శాస్త్రవేత్తలు షిరిడీకి వచ్చి ధుని నుండి వెలువడు చుండిన పొగను గాంచి నిర్ఘాంతపోయిరి. ధుని నుండి వెలువడే కాలుష్యము ప్రజల





ఆరోగ్యమునకు హానికరమని అభిప్రాయపడగా స్వామిజీ వారితో "ఇది బాబా స్వహస్తములో ప్రజ్వలింప బడిన ధుని. ఇందుండి ఏ విధమైన కాలుష్యము వెలువడదు, ప్రజలకు ఏ విధమైన హాని కలుగ చేయదు" అని ఘంటాపథంగా చెప్పినను వారు విశ్వసించక అనేక పరికరములతో పరీక్షించగా వారికి ఏ విధమైన కాలుష్యము కానరాలేదు. అయినను వారు తమ సందేహమును వీడక ధునికి సమర్పిచు వస్తువులను వారి పరిశోధనాలయమందు మండించి అందుండి వెలువడిన పొగను పరీక్షించగా అందు వారికి విపరీతమైన కాలుష్యము కానవచ్చెను. ఇదంతయు ధుని మాత మహత్మ్యమని గ్రహించి స్వామిజీ చెంతకు వచ్చి క్షమాపణ వేడుకొనిరి.

నా (ఈ గ్రంథ సంకలన కర్త) యొక్క స్వీయానుభవము ఊదీ, ధునిమాత మరియు సాయినాథుడు స్వామికి ఎటువంటి శక్తు లిచ్చినది చదువరులకు అవగత మువుతుందన్న సదుద్దేశ్యంతో మీ కందిస్తున్నాను.

అది 1994 జూలై 18వ తేది రాత్రి భోజనము ముగించుకుని నిద్ర కుపక్రమించితిని. నా శ్రీమతి జయ భారత లక్ష్మీ టి.వి. వీక్షించు చున్నది. అప్పుడు సమయం షుమారు 10 గంటలైనది. ఉన్నట్లుండి నాకు గుండెలో విపరీతమైన నొప్పి వచ్చి కొద్ది క్షణములలోనే భరించలేనంతగా మారెను. ఆ సమయములో డాక్టరు దగ్గరకు వెళ్ళు సౌకర్యము లేక నా శ్రీమతిని ఊది ఇవ్వమనగా ఆమె ఇచ్చిన ఊది నుదుట ధరించి మరికొంత సేవించగా కొద్ది క్షణములలోనే బాధ ఉపసమించి గాఢ నిద్ర ఆవహించినది. తెల్లవారు ఝాముున షుమారు 4 గం. ప్రాంతలో స్వప్నం, ఆ స్వప్నంలో నేను ద్వారకామాయి చెంత నుండ స్వామిజీ నా ప్రక్కనే నిలబడి నారికేళము మరి కొన్ని వస్తువులను నా చేతిలో ఉంచి "ధునికి సమర్పించు. నీకు పట్టిన శని పీడ విరుగు దగును" అని చెప్పగా నేను "ధునికి గ్రిల్సు ఉన్నవి, వీటిని ధునిలో వేయుట ఎట్లు సాధ్యమ"ని ప్రశ్నించగా స్వామిజీ "నీవు చేతిని లోపలకి పెట్టు ఈ గ్రిల్సు నీకు అడ్డము రావు" అనగా నేను నా హస్తమును లోనికి పెట్టి చేతిలోని వస్తువులను ధునికి సమర్పించి ప్రక్కకు చూడగా స్వామిజీ చిరునవ్వులు చిందించుచుండెను. అంతలోనే నేను నిద్ర మేల్కాంచగా స్వప్నమంతయు జ్ఞప్తికి వచ్చెను. అరచేతులు రెండు విపరీతమైన వేడిగా నుండెను. నాకు వచ్చినది స్వప్నమా లేక నిజముగా జరిగనదో నాకు అవగతము కాలేదు. గుండె నొప్పి పూర్తిగా మటుమాయ

మయ్యెను. శరీరమంతయు ఎంతో తేలికాయెను. తెల్ల వారిన తరువాత యధావిధిగా ఆఫీసుకు కూడ వెళ్ళినాను. మూడు నాల్గు రోజులు గడచిన పిదప నాకు వైద్యము చేయుచున్న డా. మల్లేశం గారి వద్దకు వెళ్ళి ఇ.సి.జి. తీయమనగా ఆయన మూడు పర్యాయములు ఇ.సి.జి. తీసి మిషను సరిగా పని చేయుట లేదు మరునాడు రమ్మనగా నేను జరిగిన దంతయు ఆయను వివరించగా "నీకు స్ట్రోకు వచ్చినది. ఇంత స్ట్రోకు వచ్చి బ్రతికిన వారిని నేనింత వరకు చూడలేదు. బాబానే నిన్ను రక్షించినాడు" ఇక మీదట జాగ్రత్తగా ఉండమని సలహా నిచ్చెను. నాకు ప్రాణదాతలైన సాయినాథునికి, మన పూజ్య స్వామిజీకి ఏమిచ్చి నా రుణము తీర్చుకొన గలను. అందుకే వారికి అనంత కోటి ప్రణామాలు. వారి రుణము జన్మ, జన్మలకు తీర్చుకొన లేను.

ఇంతటి మహిమాన్వితమైన ధుని మాతకు మన స్వామిజీ ప్రతి నిత్యము ఉదయం నారికేళములు, నవధాన్యములు మొ॥ నవి, మధ్యాహ్న సమయమున ధుని పూజ సాయంకాల సమయమున మరల నారికేళములు సమర్పించెడి వారు. బాధా నివారణ కొరకు తన చెంతకు వచ్చిన భక్తులకు ధుని పూజ చేయమని చెప్పెడి వారు. సాయినాథుడు సహితము ప్రతి నిత్యము ఉదయముననే ఈ ధుని చెంత ఆశీనుడై "అల్లా మాలిక్, అల్లా మాలిక్" యని మెల్లగా ఉచ్చరించెడి వాడు. బాబా చేతనే పూజ లందుకొని ధన్యత చెందినదీ ధుని మాత. అందు వల్లనే ఈ ధునికి అనన్య శక్తులు లభించినవి.


ధుని సేవలో స్వామీజీ

## సమస్యలకు సమాధాన మిచ్చే సమాధి:

***"నా సమాధి మాట్లాడుతుంది, అది మీ కోర్కెలను తీరుస్తుంది"*** అని బాబా తన భక్తులకు అభయ మొసంగెను. నేటికిని బాబా మహాసమాధి వద్ద అనేక మందికి భక్తులు వివిధ రకములైన అనుభూతులు పొందు తున్నారు. వాటిలో కొన్నిటిని మన పూజ్య స్వామిజీ వివరించగా వాటిని మీ కందిస్తున్నాను.

బాబా సమాధి చెందిన తరువాత బొంబాయి నివాసి యగు శ్రీమతి





రుస్తుంజీ షిరిడీ వచ్చి బాబా మహాసమాధి పై తన శిరము నుంచి "బాబా నీవు జీవించి ఉన్న రోజులలో నా కష్టాలను కడతేర్చి నన్ను రక్షించినావు, ఇప్పుడు నాకు దిక్కెవరు?" యని రోదిస్తుండగా ఆమెకు సమాధి నుండి "రుస్తుం బేటా కబ్ ఆయా?" అన్న మాటలు ముమ్మారు వినిపించినవి. ఆ మాటలు విన్న



ఆమె బాబా సమాధి నుండియే సర్వ కార్యములు నిర్వహించు చున్నాడని గ్రహించి ఎల్లప్పుడు బాబా తనను రక్షించు నన్న దృఢ విశ్వాసంతో బొంబాయి చేరుకుంది.

ఆంధ్రప్రదేశ్‌కులోని కాకినాడ పట్టణమునకు చెందిన ఒక భక్తుడు షిరిడీ వెళ్ళి బాబా సమాధి చెంత "బాబా, నీ సమాధి మాట్లాడుతుందన్న నీ అభయం నిజమైతే ఈ క్షణాన్నే నాకేదైనా నిదర్శనం చూపించు" అనగా పై నుంచి చిన్న రాయి ఒకటి అతని ముందు పడింది. దానిని తీసి పరికించి చూడగా దాని మీద బాబా బండ మీద ఆశీనుడై ఆశీర్వదిస్తున్న చిత్రం అతి సుందరంగా చిత్రించబడి యున్నది. దీనిని గాంచిన ఆ భక్తుడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

బాబా సమాధిని శుభ్రం చేసిన వస్త్రమును కాల్చి భస్మము చేసి గాయాలకు పూస్తే ఎటువంటి గాయమైన మటుమాయ మవుతుందని స్వామిజీ అనుభవ పూర్వకంగా తెలియ జేసారు.

ఇటువంటి లీలలు అనేకం జరిగాయి, జరుగుతున్నవి, జరుగుతాయి కూడ. వీటిని అనుభవించటానికి మనకుండ వలసిన అర్హతల్లా బాబా యందు భక్తి, అచంచల విశ్వాసాలు మాత్రమే నని శలవిచ్చారు మన స్వామిజీ.

బాబాకు సంబంధించిన అతి చిన్న విషయాన్ని సహితం బాబాను సేవించి తరించిన మరియు వారి వారసుల నుండి సేకరించి సాయి భక్తుల కందించే వారు మన స్వామిజీ. వాటిలో కొన్నిటిని ఇంతకు ముందే వివరించగా మరి కొన్నిటిని ఇప్పుడు మీ కందిస్తున్నాను.

ప్రస్తుతము మ్యూజియంలోను పూర్వము చావడిలోను గల చక్రాల కుర్చీని 1917వ సంవత్సరములో కాకా సాహెబ్ దీక్షిత్ బాబాకు సమర్పించి, బాబాను అందులో ఆశీనుని గావించి లెండీబాగ్ వరకు తోసుకు వెళ్ళెను. అటు పిమ్మట బాబా ఏ నాడును ఈ కుర్చీని ఉపయోగించ లేదు.

భక్తుల దర్శనార్థమై ద్వారకామాయిలో గల తిరగలిని శ్రీమతి లక్ష్మీ బాయి షిండే బాబాకు సమర్పించెను.

పూర్వము బాబా అభిషేకమునకై భక్తులు వేచి ఉండే స్థలమే అలనాటి తకియా.

ద్వారకామాయి సభా మండప తూర్పు కుడ్యమునకు గల గదియే అలనాటి "శ్యామసుందర్" హాల్. దీనికి తూర్పు ముఖ ద్వారము గలదు. బాబా దర్బారు నందు గల అశ్వము పేరే శ్యామసుందర్. దీనికి వసతిని ఈ హాలు నందేర్పరచుటచే దీనికి 'శ్యామసుందర్ హాల' ని పేరిడిరి. అంతకు పూర్వము శ్యామా ఇందే పాఠశాలను ఆరు సంవత్సరములు నిర్వహించెను. నేటికిని ఇందులో 'బ్లాక్ బోర్డు' ను మనము చూడవచ్చును.

షిరిడీలో లెండీ వనములో గల వేప వృక్షమునకు గల తొమ్మిది శాఖలను నవ విధ భక్తికి సంకేతమని నేటి భక్తుల నమ్మిక కాగా అవి నవగ్రహాలకు ప్రతీక యని అలనాటి భక్తులు విశ్వసించి అచట కొట్టిన కొబ్బరి కాయను అక్కడే వదలి వేసేవారు.

ద్వారకామాయిలో ధునికి ఎదురుగా రజిత మందిరమున గల బాబా చిత్ర పటాన్ని శ్యామారావు జయకర్ అనే చిత్రకారుడు చిత్రించెను. బాబా ఆ చిత్రమును గాంచి ***"మై గల్లీ, గల్లీమే రహనే వాలా హుం, ఔర్ బనావో, జ్యాదా బనావో"*** అని తన భవిష్య ప్రణాలికకు ఆ నాడే శ్రీకారము చుట్టెను. దాని ప్రభావమే ఈనాడు పెద్ద, పెద్ద నగరములలో, పట్టణములలోనే గాక మారుమూల పల్లెలలో సహితము బాబా మందిరములు వెలయు చున్నవి.







***శ్యామరావు జయకర్ చిత్రించిన బాబా చిత్రరాజము***

అనేక భక్తులకు ఈ తైలవర్ణ చిత్రమునుండి అసంఖ్యాక దివ్యానుభూతులు కలిగెను. ఈ చిత్రమునకు గల మరొక ప్రత్యేకత ఏమనగా ఏ భక్తుడైనను మనస్ఫూర్తిగా నమస్కరించినచో బాబా ఈ చిత్రపటమునుండి దర్శన భాగ్యమొసగును.

బాబా సశరీరులుగా నున్నప్పుడు భక్తులు వారి గృహములకు తిరుగు ప్రయాణ సమయమున బాబా అనుమతి, ఆశీస్సులు, ఊదీ ప్రసాదమును స్వీకరించి షిరిడీలో బాబా సన్నిధిలో గడపిన మధురానుభూతులను మనస్సున పదిల పరచుకొని సుఖముగను, క్షేమముగను వారి వారి గృహములకు చేరెడి వారు.

నేటికిని భక్తులు షిరిడీ నుండి తిరుగు ప్రయాణమగు సమయమున బాబా యొక్క ఈ సజీవ చిత్రమునకు సాష్టాంగ సమస్కార మొనరించి ఊది ప్రసాదమును గ్రహించి వారి ప్రయాణము సుఖప్రదము కావలెనని వేడుకొనెదరు.

## స్వామిజీ ఛలోక్తులు:

బాబా అప్పుడప్పుడు సున్నితమైన హాస్యాన్ని ప్రదర్శించి తమ భక్తులను నవ్వించే వారు. అదే రీతిన మన పూజ్య స్వామీజీ కూడ ఛలోక్తులు విసరి భక్తులను ఆనంద పరచే వారు. వాటిలో కొన్ని మచ్చు తునకలు.



ప్రథమంలో స్వామీజీకి ద్వారకామాయి లోని ప్రస్తుతము ఊదిని నిల్వ చేయు చున్న గదిలో వసతి నేర్పాటు చేసినారు సంస్థానము వారు. కొంతకాలము తరువాత ద్వారకామాయి, సమాధి మందిరముల మధ్య (ద్వారకామాయికి వెనుక వైపున) గల గదిలో వసతి నేర్పాటు చేసి సమాధి మందిర సభామండపము ఆధునీకరణలో భాగముగా స్వామీజీ నివసిస్తున్న గదిని నిర్మూలింప దలచి స్వామిని ఏదేని సంస్థాన్ వారి సత్రములలో బస నేర్పాటు చేయ సంకల్పించగా స్వామి తనకు గురుస్థానమునకు ఎదురుగా గల భవన మెట్ల క్రింద వసతి



సాయి సేవక్ శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము



నేర్పాటు చేయమనగా సంస్థానం వారు అందుకు అంగీకరించిరి. గాలి, వెలుతురు చొరబడని ఇది పేరుకు మాత్రమే గది. గదికి ఉండవలసిన సౌకర్యములేవి దీనికి లేవు. దీనిని గాంచిన స్వామీజీ భక్తులు స్వామికి వేరే మంచి వసతి నేర్పాటు చేస్తామనగా "నాకు బాబా గురుస్థానానికి పదోన్నతి కల్పించారు" అని ఛలోక్తి విసిరారు.

నేడు స్వామీజీలము, బాబాలమని చెప్పుకుంటూ ఆశ్రమాలు నిర్మించి ఎ.సి. గదులలో నివసించే వారు కోకొల్లలు కాగా మన స్వామీజీకి మాత్రం బాబా చరణ ధూళితో పావన మైన ప్రదేశమే అన్నిటికన్నా మిన్న.

అనేక మంది సద్గురువుల మని చెప్పుకుంటూ బాబా సన్నిధిలోనే గురువుల మని చెప్పుకునే వారిని గాంచిన స్వామీజీ "ఈ నాడు బాబా తప్ప మిగిలిన వారందరు గురువులే" అని చమత్కరించే వారు. కొంతకాలం తరువాత ఈ లోకంలోమంతా గురువుల మయమే అవుతుంది, శిష్యులు మాత్రం మచ్చుకైనా కానరారు" అని హాస్యాస్పదంగా మాట్లాడే వారు.

కపట గురువులు, స్వామీజీలు, బాబాల సంఖ్య నానాటికి పెరిగి పోతోందని అమాయక ప్రజలు వీరి వలలో పడి తమ అమూల్యమైన సమయాన్ని వృధా చేసుకుంటున్నా రని ఈ కపట గురువుల వల్ల అసలైన గురువులు తమ ఉనికినే కోల్పోతున్నారని వాపోయే వారు మన స్వామీజీ.

కొంతమంది బాబాకు కుల మతాలను ఆపాదిస్తే, మరికొంత మంది బాబాకు ప్రాంతీయ తత్వాన్ని కూడ అంటగడుతున్నారనియు దీనికి ఉదాహరణ బాబా అన్నం వండి అన్న దానం చేసారు కాని రొట్టెలు చేసేవారు కాదు కాబట్టి బాబా దక్షిణ భారత ప్రాంతానికి చెందిన వారని వాదించే వారిని చూసిన స్వామీజీ కుల, మత, ప్రాంతాలకు అతీతుడైన సాక్షాత్తూ పరబ్రహ్మ సాయికి కూడ ఈ బాధ తప్పలేదని మథనపడే వారు మన స్వామీజీ.

## స్వామిజీ ఆశీస్సుల బలం :

మన పూజ్య స్వామిజీ ఆశీస్సులతో మన దేశములో అనేక నగరాలలోను, పట్టణములలోను, పల్లెలలోనే గాక విదేశాలలో సహితం అనేక సాయి మందిరాలను నిర్మించారు స్వామిజీ భక్తులు. మందిర నిర్మాణ సమయంలోను ఆ తరువాత మందిరంలో జరప వలసిన నిత్య కార్యక్రమాలను స్వామిజీ వారికి ఎంతో విపులంగా వివరించే వారు.

స్వామిజీ ఆశీస్సులతో రెండవ షిరిడీ నిర్మాణాన్ని హైదరాబాద్ నగరములోని మల్లాపూర్ నందు చేపట్టి ఇప్పటి వరకు ద్వారకామాయి, గురుస్థాన్, చావడిల నిర్మాణాలను పూర్తి చేసారు స్వామిజీ భక్తులు.



మల్లాపూర్‌లో ద్వారకామాయి, గురుస్థాన్, చావడి

ప్రతి నెల స్వామిజీ జన్మ దినమైన 12వ తేదీన మల్లాపూర్ మందిరంలో అన్న దాన మరియు ఏకాహ ('ఓం సాయి, శ్రీ సాయి, జయ జయ సాయి' నామమును నిర్విరామంగ 24 గంటలపాటు గానము చేయుట) కార్యక్రమములను జరుపు చున్నారు.

వీరు నిర్మించిన ద్వారకామాయి ధుని నుండి పొగ ద్వారకామాయంతయు వ్యాపించి భక్తులకు అసౌకర్యాన్ని కలగ జేయగా ఈ విషయాన్ని స్వామిజీకి విన్నవించగా స్వామిజీ పొగ గొట్టం ఎత్తు పెంచమని సలహా నివ్వగా పొగ గొట్టం సరియైన కొలతలతోనే అమర్చామని చెప్పగా స్వామిజీ మీరు నిర్ణయించిన దానికంటే పొగ గొట్టం ఎత్తు తక్కు వైనదని చెప్పారు. వారు పరీక్షించి చూడగా పొగ గొట్టం ఎత్తు తక్కువగా నుండుట గమనించి ఆశ్చర్య పోయి దానిని సరిచేసారు. ఎంతో దూరంలో గల షిరిడీలో ఉండి హైదరాబాద్‌లో జరిగిన చిన్న పొరపాటును సహితం స్వామిజీ దృష్టిని తప్పించుకోలేక పోయిందంటే స్వామిజీ దివ్య దృష్టి ఎంత గొప్పదో పాఠకులే గ్రహింతురు గాక. ఈ మందిర ప్రాంగణమందు స్వామిజీ జ్ఞాపకార్థం ఒక చక్కని ధ్యాన మందిరమును కూడ నిర్మించినారు.





అఖిల భారత సాయి నామ సప్తాహ కమిటీ వారు శ్రీ క్షేత్ర గాణుగాపురంలో నిత్య అన్న దాన పథకాన్ని ప్రారంభిచాలని తలంచి స్వామిజీ ఆశీస్సులు వేడగా స్వామిజీ ఆశీర్వదించుటయే గాక వారి అమృత హస్తములతో తొలి భిక్ష నొసంగిరి. స్వామిజీ ఆశీర్వాద బలం వలన ఈ పథకం దిన దినాభివృద్ధి చెంది అన్ని సౌకర్యములతో ఒక చక్కని భవనమును కూడ నిర్మించు కున్నారు. ఈ పుణ్య క్షేత్రంలో 25.3.1996న అన్న దాన ప్రాంగణ మందు అఖండ దీపారాధన, శివలింగ ప్రతిష్ఠించినారు. ఇటీవల కాలంలో షిరిడీ సాయి మందిరము నిర్మించి అందు అఖండ సాయి నామ సంకీర్తనను కూడ నిర్విరామంగా నిర్వహించు చున్నారు.

ఆదిలాబాద్ జిల్లా కల్లూరులో స్వామిజీ ఆశీస్సులతో శ్రీ దత్త వెంకట సాయి సమాజమును స్థాపించి సుందరమైన దత్తాత్రేయ, వేంకటేశ్వర స్వామి, సాయినాథుని మందిరములను నిర్మించి, ధునిని కూడ ఏర్పాటు చేశారు. స్వామిజీ ఆశీస్సులతో నిత్య అన్న దాన పథకాన్ని అక్కడకు వచ్చే భక్తులకు ఉచిత వసతి సౌకర్యాన్ని కూడ కల్పిస్తున్నారు.

స్వామిజీ మహాసమాధి చెందిన తరువాత ఒక సుందరమైన ప్రార్థన, పారాయణ మందిరమును నిర్మించి చంద్రునికో నూలు పోగు చందాన స్వామిజీకి అంకిత మొనరించిరి.

పుంజాల శ్యామ మూర్తి గారు, కబూతర్ ఖానా, హైదరాబాద్‌లో గల సాయి మందిరమందు సప్త సప్తాహము సాయి నామ సంకీర్తల చేయ తలపెట్టి స్వామిజీ ఆశీస్సులు కోరగా స్వామిజీ తొలి దక్షిణ నొసంగి "ఈ ధనముతో బియ్యం, నూనె కొనండి, సప్త సప్తాహముల కంటే అధికముగానే నామ సంకీర్తము చేయించు కుంటాడు బాబా" అని అశీర్వదించారు. స్వామిజీ ఆశీస్సులు లభించాయని సంతసించి 3.6.1994న సప్త సప్తాహం ప్రారంభించి, వచ్చిన భక్తులందరికి ఉచిత భోజన సదుపాయం కూడ భక్తు లిచ్చిన విరాళములతో ప్రారంభించారు. ఈ నామ సంకీర్తల 19.9.1994 వరకు అనగా 108 రోజులు నిరంతర నిత్య అన్న దానముతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కబూతర్ ఖానా మందిరంలో బాబా ద్వారకామాయి భంగిమలో గల పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్టించుట ఒక ప్రత్యేకత. మనం కోరుకున్న దానికంటే ఎక్కువే సాయి ఆశీస్సులతో స్వామి ప్రసాదించే వారు.

## స్వామిజీ దివ్య శక్తులు :

శ్రీ దత్త వెంకట సాయి సమాజం, కల్లూరు, వారు స్వామిజీకి షిరిడీలో సరియైన వసతి సౌకర్యములు లేక అష్ట కష్టములు పడుట గాంచి స్వామిజీకి కల్లూరులో అన్ని సౌకర్యములతో కూడిన ఒక ఆశ్రమాన్ని నిర్మించి స్వామిజీని కల్లూరు తీసుకు వెళదామని తలంచి తమ కోర్కెను స్వామిజీకి విన్నవించగా స్వామిజీ తనకు సాయి సన్నిధియే పరమావధి యని షిరిడీ వదలి ఎక్కడకు వెళ్ళేది లేదని ఘంటాపథముగా తెల్పిరి. స్వామిని బలవంతంగా నైనా కల్లూరు తీసుకు పోవలెనని నిశ్చయించుకొని రాత్రులందు స్వామిజీ లెండీబాగ్‌లో ప్రదక్షణలు చేయు సమయమున బలవంతముగా కారులో తీసుకు పోదలచి కారును లెండీబాగ్‌కు అతి సమీపమున పార్కు చేసి స్వామిజీ రాక కోసం కాపలా కాయసాగారు. భక్తుల మనస్సులను సంపూర్ణంగా అవగతము చేసుకొను శక్తి గల స్వామిజీ ఆ రోజు ప్రదక్షణలకే వెళ్ళక పోగా పది గంటలకే తమ గది తలుపులు వేసుకొని తెల్లవారు ఝాము వరకు బయటకు రాలేదు. తెల్లవార్లు స్వామి రాక కోసం నిరీక్షించిన భక్తులు తెల్ల వారగనే స్వామిజీని కలువగా స్వామిజీ "రాత్రల్లా నిద్రపోకుండా బాగానే కాపలా కాసారు, రూముకి వెళ్ళి నిద్రపొండి" అన్నారు. స్వామిజీ సర్వజ్ఞతను గాంచిన ఆ భక్తులు ఆశ్చర్య చకితులయ్యారు.

ఒక పర్యాయం ప్రభాకర్, సెక్రటరీ, శ్రీ దత్త వెంకట సాయి సేవా సమాజం, కల్లూరు, వారి స్నేహితులైన తిరుపతయ్య గారితో కారులో షిరిడీకి వెళ్ళి స్వామిని దర్శించగా ప్రభాకర్‌తో స్వామిజీ నీ స్నేహితుని గ్రహబలం బాగోలేదు. అతని చేత షిరిడీలో గల శని, మారుతీ, ఖండోబా మందిరాలకు, లెండీబాగ్‌లో గల నంద దీపానికి ప్రదక్షణలు చేయించి తిరుగు ప్రయాణంలో సింగణాపూర్ వెళ్ళి అక్కడ శనీశ్వరునకు అభిషేకములు చేయించుకొని కల్లూరు వెళ్ళమని ఆజ్ఞాపించారు. స్వామిజీ చెప్పిన ప్రకారమే చేసి కల్లూరు పరిసర ప్రాంతాలు చేరగనే కారుకు ప్రమాదం సంభవించినది. అందరు కారులో నుండి దిగగానే కారు పెద్ద లోయలో పడి తునాతునక లైనది. జరగబోయే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి రక్షించిన స్వామిజీకి జోహారు లర్పించారు వారందరు.





అకుంఠిత సాయి భక్తుడు, సాయి నామ సంకీర్తనాభిలాషి, హైదరాబాద్ నివాసి శ్రీ డి. శంకరయ్య గారు ప్రపథమంగా షిరికి వెళ్ళి ద్వారకామాయిలో స్వామిజీని దర్శించు కున్నారు. రెండవ రోజు కాకడ హారతి ముందే చావడికి వెళ్ళగా అక్కడ స్వామిజీ పద్మాసములో ధ్యానస్తులై ఉండగా సాష్టాంగ నమస్కార మొనరించి స్వామిని చూడగా ఆయన ఏ ఆధారము లేకుండగా గాలిలో పద్మాశీనులై ఉండుట గాంచి అచ్చెరు వొందెను. ఆ లీల స్వామిజీ యోగ శక్తిని మనకు తెలియ జేయు చున్నది. స్వామిజీకి సాయి నామ సంకీర్తన (ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి) యన్న ప్రాణం. ప్రప్రథమంగా సాయి నామ సప్తాహమును షిరిడీలో లెండీబాగ్ నందు 10.6.1982 నుండి 17.6.1982 వరకు నిర్వహించబడెను. ఈ కార్యక్రమము జరిగిన వారం రోజులు ప్రతి నిత్యం స్వామిజీ ధుని పూజను నిర్వహించెను. ఎచట సాయి సంకీర్తన కార్యక్రమము జరిగినను స్వామిజీ ఊదీ, బాబా తీర్థము మొ॥ ఇచ్చి వారిని ప్రోత్సహించెడి వారు. ఈ నాడు సాయి నామ సంకీర్తన (ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి) ఏకాహములు, త్రయాహములు, సప్తాహములే గాక అఖండ సాయి నామ సంకీర్తనలు మన దేశమందే గాక విదేశాలలో సహితం జరుగు చున్నవంటే దానికి కారణం మన పూజ్య శివనేశన్ స్వామిజీయే.

చెన్నై నగరానికి చెందిన డా. వీరారెడ్డి గార్కి స్వామిజీతో మూడున్నర దశాబ్దముల పరిచయ భాగ్యము గలదు. స్వామిజీ నిరాడంబరత, నిస్వార్థ సాయి సేవ, ఖఠోరమైన దిన చర్య, కష్టములో నున్న వారిని ఆదుకనే దయార్ధ హృదయము వీరా రెడ్డి గారిని ఎంతగానో ఆకర్షించినవి.

అనేక మంది భక్తులు స్వామిజీ చెంతకు వచ్చి తమ బాధలు తెలుపుకొనగా కొందరిని ద్వారకామాయిలో పారాయణ చేయు మనియు, మరి కొందరిని ధుని పూజ చేయమనియు, ఇంకొందరిని హనుమాన్ చాలీసా పఠించ మనియు, గురుస్థాన్, నంద దీపము, దత్త మందిరములకు ప్రదక్షణలు చేయమని మరి కొందరికి, అన్న దానము చేయమని కొందరికి చెప్పుట గాంచి వీరా రెడ్డి గారు విస్మయమొందిరి. స్వామిజీ సలహాను పాటించి బాధా విముక్తులైన వారి సంఖ్య అసంఖ్యాకము.

ఇదంతయు కనులార గాంచిన వీరా రెడ్డి గార్కి స్వామిజీకి ఇంతటి శక్తి ఎలా ప్రాప్తించినది అవగతము కాలేదు. ఒక పర్యాయము స్వామిజీ చావడిలో భక్తులకు సాయి లీలలు వివరించు చుండగా స్వామిజీ శిరము

పైభాగమున గల బాబా చిత్రమునుండి కాంతిపుంజ మొకటి ఆ ప్రదేశమంతా కాంతులు విరజిమ్ముతూ స్వామిలో విలీన మగుట వీరా రెడ్డి గారు గమనించిరి. స్వామిజీ ద్వార బాబా ఇవన్నియు తన భక్తులకు అందించు చున్నారని గ్రహించి, స్వామి మహిమను తెలుసుకుని ఆనంద భరితుడాయెను.

## భక్తుల అనుభవాలు, అనుభూతులు:

హైదరాబాద్, శ్రీనగర్ కాలనీ వాసులైన కె. రామరత్నం గారు స్వామిజీ గురుకులంలో జరిగిన ఒక కార్యక్రమమునకు కుటుంబ సమేతముగా షిరిడి వెళ్లి సాయి సంజీవిని హోటల్ నందు బస చేసెను. ఆ రోజు ఉదయమే 6 గంటలకు కాలకృత్యములు తీర్చుకొని గురుకులమునకు బయలు దేరుటకు గది నుండి బయటకు వచ్చి హోటల్ రిసెప్షన్‌లో గల సోఫాలో కొంత తడవు విశ్రమించి గం.6.30 ని. లకు గురుకులమందు జరిగెడి కార్యక్రమమునకు బయలుదేరి వెళ్ళెను. ఆ హడావిడిలో రూ.25,000/- నగదు, సాయి సచ్చరిత, బాబా అష్టోత్తర శతనామావళి పుస్తకములు, తులసీదాస్ విరచితమైన హనుమాన్ చాలీసా పుస్తకములు గల బ్యాగ్‌ను సోఫాలోనే మరచి పోయెను. షుమారు గం.11.30 ని. ల సమయమున వారి మనుమడు బ్యాగ్ సంగతి గుర్తు చేయగా రామరత్నం గారు దానిని హోటల్ సోఫాలో మర్చి పోయినట్లు గుర్తు తెచ్చుకొని వెంటనే ఆటోలో హోటల్‌కు రాగా ఆ బ్యాగ్ పెట్టిన చోటనే ఉన్నది. ఎవ్వరు దానిని గమనించలేదు. బ్యాగ్‌లోని నగదు, పుస్తకములు అన్ని యధాతథంగా ఉన్నాయి.

ఒక సత్కార్యమునకు విచ్చేసిన భక్తులకు కష్ట నష్టములు సంభవించవని ఈ సంఘటన మనకు తెలియ జేయు చున్నది.

కర్నాటక రాష్ట్రమునకు చెందిన హోసూర్ పట్టణ వాసియైన డా. కె.ఆర్. విజయ్ కుమార్ గారు హైదరాబాద్ వాసి యైన సాయి భక్తులు డి. శంకరయ్య గారి ద్వార స్వామీజీని గురించి తెలుసుకొని 1982లో స్వామీజీని దర్శించెను. 1984వ సంవత్సరములో షిరిడీ సాయి సంస్థాన్ వారు ప్రచురించు సాయి లీల మాస పత్రిక రచయితల వార్షిక సమావేశమునకు షిరిడి వెళ్ళెను. తన కార్యక్రమము లన్నియు ముగించుకొని తిరుగు ప్రయాణమునకు సన్నద్ధమగు సమయమున ఆయన తిరుగు ప్రయాణ టికెట్టు, డబ్బులు గల పర్స్ దొంగిలించ బడినది. ఈ సంగతి సంస్థాన్ వారికి తెలియ చేయగా వారు మైక్‌లో అనేక





పర్యాయములు ప్రకటించినను ఫలితము శూన్యమాయెను. స్వామిజీకి జరిగిన సంగతి వివరించగా స్వామి “చింతించకుము. అలనాడు సముద్రమును దాటిన పవన పుత్రుని గుర్తు తెచ్చుకో రాముని శక్తియే హనుమంతుని సంద్రము దాటించెను. నీ వెనుక నున్న సాయి శక్తి నిన్ను క్షేమముగా బెంగుళూర్ చేర్చును. సాయిని విశ్వసించు. నీకే కష్టము కలుగదు” అని అభయ మిచ్చెను. రైలులో టి.సి. కి జరిగినదంతా వివరించగా టి.సి. అన్ని వివరములు చూసి బెంగళూరు వరకు వేరే టికెట్టు కొనకుండా ప్రయాణించుటకు అనుమతించెను.

స్వామీజీ ప్రతి నిత్యము ఎందరికో ఎన్నో విధముల సహాయము చేసెడి వారు. అటువంటి స్వామీజీ విజయ్ కుమార్‌కు ధన సహాయము ఎందుకు చేయ లేదన్న సంగతిని మనం గ్రహించాలి. విజయ్ కుమారుకు బాబా యందు ధృఢ భక్తి కలుగ చేయవలెననియే స్వామీజీ ధనసాయము చేయక అభయమిచ్చి పంపెను.

## స్వామిని కరుణించి దర్శన మొసంగిన సాయి :

స్వామి నిస్వార్థ సేవకు ప్రసన్నుడైన సాయి స్వామిని కరుణించిన వైనాన్ని మీకిదివరకే అందించాను. అంతటి అకుంఠిత సాయి సేవకునికి సాయి ఏయే రూపాలలో దర్శన మిచ్చినది బాబా కృపతో ఇప్పుడు మీ కందిస్తాను. స్వామీజీ షిరిడీకి వచ్చిన ప్రథమార్థంలో ఒకనాటి వెన్నెల రేయిలో లెండీబాగ్‌లో పిట్టగోడ వద్ద ధ్యానం చేసుకుంటున్న స్వామికి నంద దీపానికి దత్త మందిరానికి మధ్యన గల స్థలమందు రాతిబండ మీద ఆశీనుడై బాబా దర్శన మిచ్చెను. స్వామీజీ అది తన భ్రాంతి యని భావించి కొన్ని క్షణముల తరువాత మరల చూడగా బాబా అదే విధంగా దర్శన మిచ్చెను. స్వామీజీ ఆ దృశ్యానికి సమీపంగా వెళ్ళి పరికించి చూడగా బాబా అంతర్థాన మయ్యెను.

మరొక పర్యాయం స్వామీజీ గురుస్థాన్‌లో ఉండగా ఒక కుష్టురోగి వచ్చి బాబా తీర్థం ఇవ్వమని అడగగా స్వామీజీ తమ గదిలో బకెట్టులో గల బాబా అభిషేక తీర్థం ఇవ్వగా అదికాదు బాబా మహాసమాధి చెంత రాత్రులందు పెట్టిన తీర్థం ఇవ్వమని అడిగాడు. తన దగ్గర ఆ తీర్థం గలదని అతనికి ఎలా తెలిసిందా యని ఆలోచిస్తూ గదిలోకి వెళ్ళి తీర్థం తీసుకు వచ్చేసరికి ఆ వ్యక్తి కనుమరుగాయెను. ఆ వ్యక్తి కోసం ఎంత గాలించినా ప్రయోజనం లేక పోయింది. స్వామి వద్ద ఆ తీర్థం ఉంటుందన్న సంగతి ఇతరులకు తెలియదు ఆ తీర్థమే కావాలని అడిగిన వ్యక్తి బాబాయే నని స్వామీజీ గ్రహించారు.

స్వామిజీ చావడిలో భరద్వాజ గారు రచించిన *"సాయి లీలామృతం"* పారాయణ చేస్తుండగా చక్కటి దుస్తులు ధరించి పాదరక్షలతోనే చావడిలోకి ప్రవేశించి "ఏమి చదువుతున్నావు? భరద్వాజ రచించిన లీలామృతమా? బాగుంది, చదువు" అని ఆశీర్వదించినది బాబాయే నని సాయి భక్తులందరికి విదితమే.

వేరొక పర్యాయము స్వామిజీ విరేచనములచే బాధపడుచుండగా ఒక ఆజాను బాహుడు స్వామిజీ గదిలోకి వచ్చి నిమ్మకాయను దిగతుడిచి స్వామిజీ ప్రేగుని తన చేతితో నొక్కి ***"నీ విరేచనములు పోయినవి, నీవు నీ నిత్య కృత్యములను నిర్విఘ్నంగా చేసుకో. ఈ నిమ్మ కాయను ధునికి సమర్పించు"*** అని చెప్పి అంతర్ధాన మయ్యాడు. స్వామిజీ తాను విరేచనములతో బాధపడుచున్నట్లు ఎవ్వరికి చెప్పలేదు. సర్వాంతర్యామి యైన సాయినాథునికి తన భక్తుని కష్టం ఒకరు చెప్పవలెనా? స్వామిజీకి ఏ విపత్తు సంభవించినను సాయి నాథుడు ఏదో ఒక రూపంలో వచ్చి స్వామిజీ కష్టాన్ని కడతేర్చి
***"నీ చెంత నే నున్నాను"*** అని నిరూపించే వారు.

## స్వామిజీ దిన చర్య :

షిరిడీ ప్రవేశానంతరము స్వామిజీ దిన చర్యను సందర్భాను సారంగా ఇంతకు ముందే వివరించుట జరిగినది. స్వామిజీకి వయస్సు మీరిన తరువాత ఆయనకు పూర్తి విశ్రాంతి కల్పించాలని తలంచిన సంస్థాన్ వారు స్వామిని శారీరక సేవ నుండి దూరముగా ఉంచారు. ఈ చర్యకు స్వామిజీ ఏ మాత్రము చింతించక మానసిక సేవ చేసి తరించారు.



ప్రతి నిత్యం స్వామిజీ ఉదయం 3 గంటలకే నిదుర మేల్కాంచి షుమారు ఒక గంట సేపు ధ్యానము గావించెడి వారు. నాలుగు గంటల సమయంలో వేడి నీటిని తెచ్చుకొని స్నాన మాచరించి ద్వారకామాయి, గురుస్థాన్, చావడి దర్శనముతో దిన చర్యను ప్రారంభించెడి వారు. అటు పిమ్మట లెండీబాగ్ లోని నంద దీపమునకు, దత్త మందిరమునకు, గురుస్థాములకు ప్రదక్షణలు గావించెడి వారు. ప్రదక్షణలను లెక్కించెడి వారు కాదు. చేయించుకొనెడి వాడు బాబా. ఆయనకు





ఎన్ని కావాలో అన్ని చేయించు కుంటాడు అనే వారు. ప్రదక్షణలు పూర్తి అయిన తరువాత ధుని మాతకు నారికేళమును సమర్పించెడి వారు. తరువాత గం.7.30 ని. ల వరకు చావడిలో ఆశీనులయ్యే వారు. భక్తులు వస్తే సత్సంగము చేసే వారు లేకపోతే ధ్యానము చేసుకొనిడి వారు. గం. 7.30 ని. ల నుండి గం.8.00 ని. ల వరకు గదిలో ఉండెడి వారు. ఎనిమిది గంటలకు కరుణాకరన్ తెచ్చిన పాలు సేవించి సమాధి మందిరమునకు వెళ్ళి బకెట్టుతో బాబా అభిషేక తీర్థమును తెచ్చుకొనెడి వారు. కోటయ్య అనే అతనితో విష్ణు సహస్ర నామ



గురుస్థాన్



నందదీప్

ప్రదక్షణలు చేయుచున్న స్వామీజీ



స్తోత్ర పారాయణ లేక హనుమాన్ చాలీసా పారాయణ చేయించెడి వారు. షుమారు 10 గంటల ప్రాంతంలో సుబ్రహ్మణ్యం (మణి) తో సత్సంగము చేసెడి వారు. అటు పిమ్మట మరల ప్రదక్షణలు చేసి మధ్యాహ్న హారతి సమయమున ధుని మాతకు మరల నారికేళము, నవ ధాన్యములు మొ॥ నవి సమర్పించి చావడికి వెళ్ళి ధ్యానస్తు లయ్యెడి వారు. బాబాకు హారతి, నైవేద్య సమర్పణ పూర్తి అయిన తరువాత బాబా మహా ప్రసాదమును తెచ్చుకొని అతి కొద్దిగా



తాను భుజించి మిగిలినది భక్తులకు పంచెడి వారు. హోటళ్ళ నుండి తనకు సమర్పించిన భోజన పదార్థములను కూడ భక్తులకు వితరణ చేసే వారు. అటు పిమ్మట సాయంత్రం గం.4.30 లేదా 5.00 గంటల వరకు గదిలోనే ఉండి పారాయణ లేక ధ్యానము చేసుకొనెడి వారు. ఈ సమయములో భక్తుల నెవ్వరిని అనుమతించెడి వారు కాదు. స్వామీజీ ఏ నాడును పగటి పూట నిదురించెడి వారు కాదు. సాయంత్రం 5 గంటల నుండి మరల ప్రదక్షణలు చేసెడి వారు. తరువాత గం.7.30 ని. ల వరకు గదిలోనే ఉండెడి వారు. తరువాత మహా నైవేద్యమును తెచ్చుకొని కరుణాకర్‌కు మరియు ఇతర భక్తులకు పంచెడి వారు. స్వామీజీ మాత్రం కరుణాకరన్ తెచ్చిన పాలు త్రాగెడి వారు. రాత్రి గ.8.00 నుండి గం. 9.00 ల వరకు చావడిలో భజన కార్యక్రమమును నిర్వహించి హారతి చేసెడి వారు. అటు పిమ్మట ధునికి మరల నారికేళములను సమర్పించి గదికి వెళ్ళెడి వారు. గం. 9.15 ని. లకు పి.యస్ రావు, నాందేడ్‌కర్ (కాంద్రే)లు స్వామీజీ గదికి వచ్చెడి వారు. గం. 10.15 ని. ల వరకు నాందేడ్‌కర్ పారాయణ చేయుట గాని స్వామీజీ వివరించిన సాయి భక్తుల అనుభవములను గాని వ్రాసెడి వాడు. అటు పిమ్మట పి.యస్. రావు గం. 11.30 ని.ల వరకు పారాయణ గావించెడి వారు. ఒకొక్క సారి గం. 12.30 ని. ల వరకు సత్సంగము చేయుట లేక ఆధ్యాత్మిక సంబంధ మైన సందేహాలను స్వామి ద్వారా నివృత్తి గావించు కొనెడి వారు. స్వామీజీ తరచుగా రావు గార్కి ఏకనాథ భాగవతం, భక్త కబీరు, తుకారామ్, తులసీదాస్ చరితములు తెల్పెడి వారు. భగవద్గీత, రామాయణము, సాయి సచ్చరితము, గురు చరిత్ర పారాయణము చేయించెడి వారు. ఇవే గాక రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, పుస్తకములను తెప్పించి పారాయణ చేయించే వారు.

దినములో మూడు లేక నాలుగు గంటలు మాత్రము నిద్రించి మిగిలిన సమయాన్నంతా సాయి సేవకే వినియోగించెడి వారు మన పూజ్య స్వామీజీ.

స్వామీజీ షిరిడీ ప్రవేశ మొనరించినది మొదలు దేహ త్యాగము చేసే వరకు ఏనాడును పాద రక్షలు ధరించ లేదు. బాబా పరమ పావన పాద





ధూళిచే పవిత్ర మైనదీ షిరిడీ క్షేత్రం. ఇచట పాద రక్షలు ధరించి సంచరించుట మహా పాపమని భావించెడి వారు.

ఇంతటి కఠోర దీక్షతో సాయిని సేవించి తరించిన భక్తుడు మన స్వామీజీయే తప్ప వేరొకరు లేరని ఘంటాపథంగా చెప్ప వచ్చును.

ఒకసారి స్వామీజీతో ఏకాంతముగా సత్సంగము చేయు భాగ్యమును నాకు ప్రసాదించి నారు. స్వామీజీతో నేను అనేక మంది సచ్చీలురైన సాయి భక్తులు ఇడుముల పాలవు చుండగా, దొంగ భక్తులు, దొంగ స్వాములు, కపట గురువులు భోగ భాగ్యాలలో తెలియాడు తున్నారు. ఈ వ్యత్యాసానికి కారణమేమిటని ప్రశ్నించగా స్వామి చిరు నవ్వు నవ్వి "నీవు చెప్పినది నిజమే. దీనికి కారణం వారి పూర్వ జన్మ సుకృతమే గాని మరి యొకటి కాదు. పూర్వ జన్మలో మనము చేసుకున్న పాప, పుణ్య ఫలాలను ఈ జన్మలో అనుభవించవలెను. పూర్వ జన్మలో సత్కర్మలు చేసిన వారు ఈ జన్మలో భోగ భాగ్యములతో సుఖ సంపత్తులు పొంద గలరు. ఈ సుఖ సంతోషాల మత్తులో ఈ జన్మలో చెడు కర్మలు చేసినచో వాటి ఫలితములను ఈ జన్మలో గాని లేక మరు జన్మలో గాని అనుభవించక తప్పదు. కొంత మంది అన్యార్జితముగా ధనమును సంపాదించి ఆ పాపములను ప్రక్షాళన గావించు కొనుటకు భగవంతునికి బంగారు ఆభరణాలు సమర్పించుట, గుళ్ళు, గోపురములను నిర్మిస్తున్నారు. ఇటువంటి వాటి వలన భగవంతుని కృప వీరికి లభించదు. కష్టార్జితములో అతి స్వల్పంగా సత్కార్యములకు ఖర్చు పెడితే భగవంతుడు సంతసించును. మన రాతలను బట్టే చేతలుండును గాని చేతలను బట్టి రాతలు కాదని మనము గ్రహించి సత్ప్రవర్తన కలిగి యుండ వలెను. చెడు విత్తనమును నాటి దానికి ఎన్ని ఎరువులు వేసినా ప్రయోజనము శూన్యమే గదా. అన్ని జన్మలలోను మానవ జన్మ ఉత్కృష్ట మైనది. దీనిని అందరు గ్రహించి ఇతరులను కష్ట నష్టములు కలిగించ కుండ చేతనైనంత వరకు సాటి వారికి సాయమందించిన భగవంతుడు సంతసించి ఈ జన్మలో గాని లేక మరు జన్మలో గాని వారికి వారు చేసిన సత్కర్మల ఫలితము లందించును"ని ఎంతో విపులంగా వివరించారు.

స్వామీజీ షిరిడీ చేరినప్పటి నుండి మహాసమాధి వరకు అంటే షుమారు నాలుగున్న దశాబ్దాలలో ప్రతి క్షణాన్ని సాయి సేవకే అంకితము చేసిన ధన్య జీవి మన స్వామీజీ. తన సర్వస్వమును బాబాకే సమర్పించి అరిషడ్ వర్గములను అవలీలగా జయించిన పుణ్యమూర్తి మన పూజ్య స్వామీజీ.

ఆయన ఎల్ల వేళల బాబా సేవ తప్ప దేని పైన ధ్యాస ఉండెడిది కాదు. ఆయనకు ధనముపై ఏ మాత్రము ఆశ ఉండెడిది కాదు. ఆయనే ధనమందు ఆశ ఉంటే ధక్షిణ ధనంతో షిరిడీనే కొనగల స్థితి మంతు డయ్యేవారని ఐదు దశాబ్దముల నుంచి స్వామిజీతో పరిచయ భాగ్యమున్న విన్ని చిట్లూరి గారు తెలియ జేసెను.

## అవధూతల దర్శన భాగ్యము:

అవధూతలపట్ల స్వామిజీకి అత్యంత భక్తి, శ్రద్ధలు గలవు. అవధూతలు దేవుని యొక్క ప్రతి రూపాలని చెప్పేవారు. వారు కల్లా కపటము తెలియని పసి పిల్లలతో సమాన మనియు. వారి మనస్సు నవనీతము కన్న మృదు వనియు, ఈ సృష్టిలో గల ప్రతి ప్రాణిలోను వారు భగవంతుని గాంచుదు రనియు. వారి మనస్సులో "చెడు" అన్న పదమునకు చోటే ఉండదనియు చెప్పెడి వారు.

స్వామిజీ సత్సంగము నిర్వహించేటప్పుడు రమణ మహర్షి, రామకృష్ణ



అనసూయ మాత



దేవి మాయమ్మ



నాంపల్లి బాబా



రామిరెడ్డి తాత



భగవాన్ శ్రీశ్రీ శ్రీవెంకయ్య స్వామి

పరమ హంస, నిత్యానంద బాబా, విదేహి సతీ అనసూయ మాత, దేవి మాయమ్మ, నాంపల్లి బాబా, రామిరెడ్డి తాత, వెంకయ్య స్వామి మొ॥ అవధూతల లీలలను తెలిపెడి వారు.

ఒక పర్యాయము బాబా ద్వారకామాయి ఛాయా చిత్రమును రామిరెడ్డి





తాతకు పంపగా తాత భక్తులు ఆ చిత్రపటమును రైల్వే స్టేషన్ నుంచి సుందరముగా నలకరించిన ఒక ట్రక్కులో నుంచి తీసుకు వెళ్ళు చుండ తాత గ్రామ సరిహద్దుల వరకు ఎదురు నడచి వచ్చి ఆ ట్రక్కులో ముందు సీటులో ఆశీనుడై గురుస్థానము చేరగనే అందరి కంటే తానే ముందుగా ట్రక్కులో నుంచి దిగి బాబా ఛాయా చిత్రమును గురుస్థానములో తన స్వహస్తములతో నుంచెను. నేటికిని తాత ఆశ్రమములో ఈ చిత్ర రాజము భక్తులచే నిత్య పూజ లందుకొను చున్నది. తాత యొక్క ఈ చర్య ఒక అవధూతను మరియొక అవధూతయే అర్థము చేసుకొన గలదని నిరూపిస్తున్నది.

1992వ సంవత్సరములో తాతను ఆయన భక్తులు షిరిడీకి తీసుకు వెళ్ళగా స్వామీజీ తాతకు గ్రామోత్సవము జరిపించెను. బాబా తరువాత షిరిడీలో గ్రామోత్సవము జరిపించు కున్నది తాత గారే.

స్వామిజీ ఎల్లప్పుడు అవధూతల చేత మందిర నిర్మాణములు, విగ్రహ ప్రతిష్టలు గావించ మని ఆయన భక్తులకు చెప్పెడి వారు. హైదరాబాద్ లోని కబూతర్ ఖానా మందిరములో విగ్రహ ప్రతిష్ట రామి రెడ్డి తాత చేతను మల్లాపూర్‌లోని ద్వారకామాయి ఆవిష్కరణ విదేహి సతీ అనసూయ మాత చేతుల మీదు గాను జరిపించెను. తానే ఒక అవధూత అయ్యుండియు మరొక అవధూత పట్ల ఎంతో వినయయ విధేయతలతో మెలగెడి వారు మన స్వామిజీ.

విదేహి సతీ అనసూయ మాత షిరిడీ వచ్చి నప్పుడు స్వామిజీ ఆమె పాదముల పై తన శిరస్సు నుంచి సమస్కరించెను. ఏ నాడును షిరిడీ పొలిమేరలు దాటకున్నను సమకాలిక అవధూతల ఆశీర్వాములు, దర్శన భాగ్యమును పొందిన పూణ్య మూర్తి మన స్వామిజీ.

పై సంఘటనలు బాబా దర్శనార్థమై షిరిడీకి విచ్చేసిన గజానన మహారాజ్, అవతార్ మెహర్ బాబా లను మనకు గుర్తుకు తెస్తున్నవి.

## మహా సమాధి:

అది జనవరి నెల 1996 లో స్వామిజీ భక్తులలో ఒకరికి కాన్సర్ సోకినది. వైద్యులు కూడ పరీక్షించి నిర్ధారించినారు. వారము రోజులలో అతని వ్యాధి తగ్గి కొంచెము దగ్గుతో బాధ పడినాడు. అటు తరువాత రెండు, మూడు రోజులలోనే పూర్తి ఆరోగ్య వంతు డయ్యెను. వెంటనే స్వామిజీ అనారోగ్యముతో బాధపడుచుండ భక్తులందరు బలవంతముగా హాస్పటల్‌కు తీసుకు వెళ్ళగా

వైద్యులు పరీక్షించి కాన్సర్ అని నిర్ధారించినారు. స్వామిజీ మరి కొన్ని రోజులు జీవించి ఉండాలంటే వెంటనే బొంబాయి లోని Tata Instiitite of Cancer కు తీసుకు వెళ్ళమని సలహా నిచ్చిరి. స్వామిజీ షిరిడీ పొలిమేరలు దాటుటకు అంగీకరించక “బాబా నాచే మరి కొంత కాలం సేవ చేయించు కోవాలను కుంటే ఆయనే నా వ్యాధిని తగ్గిస్తాడు” అని ధృఢముగా సమాధాన మిచ్చెను. ఈ సంగతి ఆ నోట ఆ నోట భక్తులందరికి తెలిసి స్వామిని చూడటానికి తండోప తండములుగా వచ్చిరి. భక్తుల అలజడికి దూరంగా ప్రశాంత వాతవరణములో నుండ దలచిన స్వామిజీ 25. 1. 1996 న గొరాడియా హోటల్ ప్రక్కనే గల పోస్టు మాస్టర్ నాగరే గృహము ఖాళీగా నుండుటచే తనకు అక్కడ బస నేర్పాటు చేయమని భక్తులకు సూచించగా అదే రోజు స్వామిని అక్కడకు తరలించినారు. అట్టి విపత్కర సమయమందు కూడ తన పనులన్ని తానే స్వయముగా చేసుకొనుచు బాబా తీర్థమును మాత్రము సేవించుచు సాయి నామ స్మరణలోనే కాలమును గడిపెను. అంతటి విషమ పరిస్థితులలోను ఆయను బాబా యందు గల విశ్వాసము కించెత్తు కూడ సడలలేదు. అన్న పానీయములను త్యజించి క్యారెట్ రసం, బాబా పాదోదకంతోనే కాలం గడిపిరి. తన బాధను ఏ మాత్రము బయటకు వ్యక్త పరచకపోగా అధైర్య పడుచున్న తన భక్తులకు ధైర్యము చెప్పిరి. స్వామిజీ తనకు భక్తులు సమర్పించిన శాలువలను, రగ్గులను అందరికి వితరణ చేసిరి. స్వామిజీ తన చివరి ఘడియలలో సహితం సాటివారికి చేతనైన సాయమందించి మనందరికి ఆదర్శ ప్రాయులైనారు.

అవతార పురుషులకు, మహనీయులకు, దైవాంశ సంభూతులకు మరణ మన్నదే లేదు. వారి అవతార కార్యము ముగిసిన పిమ్మట అతి సునాయాసంగా దేహమును పరిత్యజించినా వారి నాశ్రయించిన వారిని సదా రక్షించుట కొరకు ఎల్ల వేళలా జాగరూకులై ఉందురు. వారి జనన మరణాలు మానవ మాత్రులమైన మనకు ఊహ కందనివి. మృత్యువే వారి చెంత చేర భయపడుతుంది కాని వారు మాత్రం మృత్యువుకు భయపడరు. వారు ఆహ్వానిస్తే తప్ప మృత్యువు సహితము వారి ఛాయలకు చేర సాహసించ లేదు. జన్మించిన ప్రతి ప్రాణి మరణించాలన్న ప్రకృతి ధర్మానికి కట్టుబడి మాత్రమే వారు దేహత్యాగం చేస్తారు. పరిపూర్ణ అవతార పురుషులు, అవధూతలు వారి మహా సమాధి అనంతరమే అసంఖ్యాక లీలలను ప్రకటించి సర్వదా వారి భక్తుల నుద్ధరింతురు. భగవంతుని యొక్క పరిపూర్ణ కృపకు పాత్రులైన భక్తులకు మరణ ముండదని



సాయి సేవక్ శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము

ఈ సృష్టి ఉన్నంత వరకు వారు ఉంటారని, నామదేవు, గోణాయి, తుకారాం, రామదాసాది భక్తుల జీవితాలు చాటి చెపుతున్నాయి. సూర్య కిరణాలు సూర్యుని నుంచి దూరం కానట్లు, వెన్నెల చంద్రుని నుంచి దూరం కానట్లు, భగవంతుడు తన భక్తులకు దూరం కాక పోగా వారి హృదయాలలోనే స్థిర నివాస మేర్పరచు కుంటాడు. భగవంతునికే వారి హృదయంలో ఆశ్రయ కల్పించిన వారి చెంతకు మృత్యువు చేర సాహసించునా! మాయా ప్రభావితులైన మానవులు మహనీయులు జనన మరణాల కతీతులని గ్రహించ లేక వారు మరణించారనియు, మహా సమాధి చెందారని తలుస్తారు. భగవద్భక్తు లెప్పుడు మృత్యుంజయులే.

బాబా సమాధి చెందటానికి కొన్ని సంవత్సరాల ముందే వారు సమాధి చెందు విషయాన్ని భావ గర్భితంగా వెల్లడించినా బాబా మహా సమాధి చెందిన తరువాత మాత్రమే వారి మాటల కర్థం స్ఫురించింది వారి భక్తులకు. మన స్వామిజీ మహా సమాధి చెందు విషయాన్ని అవధూతలు సహితం ముందుగానే సూచించారు. మరి కొంత మందికి స్వామిజీ స్వప్నంలో తాము సమాధి చెందు విషయాన్ని ముందు గానే సూచించారు. 1995 సెప్టెంబరు మాసంలో మణి అనారోగ్యంతో బాధ పడుతుంటే స్వామిజీ అతనిని దత్తావధూత సతీ అనసూయ మాత దర్శనానికి పరాడ్శింగా పంపగా అనసూయ మాత షిరిడీ పీఠం ఐదు మాసాల్లో ఖాళీ అవుతుందని సైగల ద్వారా తెలియ జేసారు. మణి తాను అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఐదు మాసాలలో తానే మరణిస్తానని తలంచాడు. కానీ ఐదు మాసముల తరువాత ఫిబ్రవరి 12 తేది 1996న స్వామిజీ సమాధి చెందిన తరువాత గానీ అతనికి అనసూయ మాత చెప్పినది అర్థం కాలేదు.

షిరిడీ నివాసి పి.యస్. రావుకు స్వామిజీ స్వప్నంలో దర్శన మిచ్చి తాము మహా సమాధి చెందు విషయాన్ని ఈ క్రింది విధంగా తెలియ చేసారు. అతనికి స్వప్నంలో సాయినాథుడు ఒక ఆసనం మీద ఆసీనులై దర్శన మిచ్చారు. అటు పిమ్మట కొద్ది క్షణాల్లోనే అదే ఆసనం మీద స్వామిజీ దర్శన మిచ్చారు. తరువాత సాయి మరియు స్వామిజీ ఆ ఆసనానికి ఇరువైపులా నిలబడి దర్శన మివ్వగా ఖాళీ అయిన ఆసనాన్ని చూసిన రావు ఆ ఆసనాన్ని ఏమి చేయ మంటారని స్వామిజీని ప్రశ్నించగా “దానిని ఆశ్రమంలో పెట్టు” అని చెప్పారు. దీనిని బట్టి స్వామిజీకి తాము శరీర త్యాగము చేస్తున్న సంగతి ముందుగానే తెలుసుననియు, తరువాత తాము సూక్ష్మ రూపంలో ఆశ్రమలో ఉంటామని

ముందుగానే సూచించారు.

బాబా మహా సమాధి చెందటానికి 17 రోజుల ముందు నుంచి ఆహారాన్ని విసర్జించి విజయ దశమి పర్వ దినాన మహాసమాధి చెందగా, స్వామిజీ కూడా తమ మహా సమాధికి 17 రోజుల ముందు నుంచి అన్న పానీయములను విడనాడి ఫిబ్రవరి 11వ తేది ముగిసి 12 తేది ప్రవేశించిన 10 నిమిషాలకు మాఘ బహుళ సప్తమి, సోమ వారం అంతిమ శ్వాస విడచి సాయి పవిత్ర పాద సన్నిధికి చేరుకున్నారు.

షుమారు నాలుగున్నర దశాబ్దాలు నిస్వార్థ సాయి సేవలో గడిపి అతి నిరాడంబర జీవితాన్ని కొనసాగించి సాయి ఉచ్ఛిష్టంతోనే క్షుద్బాధను తీర్చుకుని, సాయి పాదోదకంతో దాహం తీర్చుకొని, బాబా సంచరించిన పరమ పవిత్ర ప్రదేశాల్లోనే సంచరించి, సాయి తత్వాన్ని దేశ, విదేశాలలో సహితం ప్రచారం చేసిన పుణ్యమూర్తి శ్రీ శివనేశన్ స్వామిజీ అంతిమ శ్వాస విడిచారన్న సంగతి తెలుసుకొని వారి భక్తు లందరు షిరిడీ చేరి తమ గురుదేవులకు శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రతి నిత్యం భక్తుల కోలాహలంతో సాయి నామ సంకీర్తనలతో కళ కళ లాడే షిరిడి పురం ఆనాడు కళావిహీనమై, నిస్తేజమై, ఆమావాస్య నాటి అంధకారాన్ని తలపిస్తూ, ఇది షిరిడీ పురమా లేక శోక సంద్రమా అన్న రీతిన గోచరించింది. ఎవ్వరి ముఖంలోనూ కళా కాంతులు లేవు. వెక్కి వెక్కి ఏడ్చేవారు కొందరైతే వారిని ఓదార్చే వారు మరి కొందరు. స్వామిజీ ప్రతిభా పాటవాన్ని కొనియాడే వారు కొందరైతే స్వామిజీకి బాబా యందు గల భక్తి, శ్రద్ధలను మననం చేసుకొనే వారు మరి కొందరు, “నా తండ్రిలేని ఈ లోకంతో నాకేమి పని అని విలపించే పుత్ర సమానులు కొందరు. నా గురువు సద్గురు సన్నిధికి చేరుకున్నారు, నా అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే దేవరని రోదించే శిష్యులు కొందరు, నా దైవమే లేని నాయీ జీవిత మెందుక”ని విలపించే భక్తుల ఆర్తనాదాలతో షిరిడీ పురము కళా కాంతులు కోల్పోయినది.

ఆ రోజు సాయంత్రం స్వామిజీ పవిత్ర దేహానికి శాస్త్రోక్తంగా పూజలు జరిపించి సుందరంగా అలంకరించిన జీపులో షిరిడీ పురవీధుల గుండా (మారుతీ మందిర్, చావడి, మహల్సాపతి గృహం, కానిఫ్‌నాథ్ మందిర్, గురుస్థాన్, బూటీవాడా, లెండీబాగ్) స్వామిజీ ప్రతి నిత్యం చావడిలో గానం చేసే భజనలతో, సాయి నామ సంకీర్తనలతోనూ, పుష్పాలు జల్లుతూ, హారతులిస్తూ, స్వామిజీ







స్వామీజీ సమాధి

ఆశ్రమం కోసం క్రయం చేసిన స్థలానికి తీసుకు వెళ్ళి వేద పురోహితులచే శాస్త్రోక్తంగా స్వామిజీ అంత్య క్రియలు జరిపించారు. శ్రీ కె.ఎస్. సుబ్రహ్మణ్యం (మణి) స్వామిజీ అంత్య క్రియలు చేసారు. స్వామిజీ పవిత్ర దేహానికి అగ్ని సంస్కారం జరిపించి భక్తు లందరు బాధా తప్త హృదయాలతో బాధ పడటం చూడలేని సూర్యుడస్తమించాడు. స్వామిజీ భక్తులు స్వామిజీ అస్తికలను భారత దేశంలో గల అన్ని పవిత్ర నదీ జలాల్లో నిమజ్జనం చేసి స్వామిజీ యందు వారికి గల భక్తి, ప్రపత్తులను చాటుకున్నారు. స్వామిజీ సమాధిని 21.2.1996 తేదీన నిర్మించారు. ఈ పరమ పూజ్యుని




మహా సమాధి పింపుల్ వాడి రోడ్డులో ప్రసాదాలయం నుండి రెండున్నర కిలోమీటర్ల దూరంలో గలదు. ఇచట ప్రతి నిత్యము నాలుగు హారతులు జరుగు చున్నవి. ధునిని కూడా ఏర్పాటు చేసారు. స్వామిజీ జన్మ దిన మైన ఏప్రిల్ 12వ తేది, పుణ్య తిథి ఫిబ్రవరి 12వ తేది మరియు గురు పూర్ణిమ ఉత్సవములు అంగరంగ వైభవముగా జరుగును. షిరిడీ దర్శించే ప్రతి సాయి భక్తుడు ప్రశాంత వాతావరణంలో గల స్వామిజీ ఆశ్రమాన్ని దర్శించి బాబా మరియు స్వామిజీల ఆశీస్సులు పొంద గలరు.

## సమాధి అనంతర లీలలు :

బాబా మహాసమాధి చెందిన మరుక్షణం నుంచే అనేక లీలలను ప్రదర్శించుచూ తాను సదా సజీవుడే నని తన భక్తుల నెన్నటికి వీడనన్న తన అభయాన్ని ఋజువు చేసు కుంటున్నాడు.

సాయి వలెనె మన స్వామిజీ కూడ తన సమాధి అనంతరం అనేక మందికి సశరీరులు గాను మరి కొంత మందికి స్వప్న దర్శన భాగ్యము కలుగ జేసి వారి కష్టముల నీడేర్చు చున్నారు.

స్వామిజీ భక్తుడైన గోవా నివాసియగు చాందోర్‌కర్ మేనల్లునికి స్వామిజీ సశరీరులుగా దర్శన మిచ్చి "నన్ను గుర్తుపట్టావా?" యని ప్రశించగా





అతను వెంటనే "మీరు శివసేశన్ స్వామిజీ, మీరు నాకు ప్రసాదించిన సాయి భజన మాల పుస్తకాన్ని నా పూజా మందిరమందుంచి పూజించు కుంటున్నాన" ని సమాధాన మిచ్చెను. స్వామిజీ అతని చేతిలో రెండు రూపాయల నోటు నుంచి గుప్పెట మూయమనగా అతను అట్లే చేసెను. స్వామిజీ గుప్పెట తెరువమని చెప్పగా అందులో రెండు రూపాయల నోటు బదులు గులాబి పుష్పం ఉంది. ఇంతలోనే వేరొక ఫకీరు వేషధారి వచ్చి తాను మహారాష్ట్రం నుంచి వస్తున్నట్లు చెప్పి తనకు ఐదు రూపాయల దక్షిణ కావాలని అడుగగా ఆ యువకుడు తన జేబులో నుంచి తీసి ఇవ్వబోగా ఇవి కాదు నీ దుకాణంలోంచి తీసుకు వచ్చి ఇవ్వు అని అతని దుకాణం వైపు చూపించారు. అతను వెంటనే దుకాణంలోకి వెళ్ళి ఐదు రూపాయలు తెచ్చి ఇవ్వగా అతనిని ఆశీర్వదించి స్వామిజీ మరియు ఆ ఫకీరు వేషధారి కొంత దూరం వెళ్ళి అతను గమనించు చుండగానే కనుమరుగయ్యారు.

షిరిడీ వాసి యగు కుమారి దేశ్ ముఖ్ గారికి స్వామిజీ ప్రసాదించిన మరొక అనుభవము–

1995 ఆగస్టు లేక సెప్టెంబరు మాసంలో ఈమె దగ్గు, వాంతులతో బాధ పడుతుంటే స్వామిజీ త్రిఫల చూర్ణము మరియు అల్లంతో తయారు చేసిన ఒక చాక్లెట్టును ఇచ్చారు. అది తినగానే రెండు రోజులకే ఆమెకు స్వస్థత పొందెను. స్వామిజీ మహా సమాధి చెందిన తరువాత మార్చి 9వ తేది 1996న తిరిగి దగ్గు, వాంతులు కావటంతో ఆమె స్వామిజీని తల్చుకొని "స్వామి ఇదివరకు ఈ వ్యాధిని మీరే నయం చేసారు ఇప్పుడు నాకు దిక్కెవ్వరు?" అని స్వామిని ప్రార్థించి నిదురించగా స్వామిజీ స్వప్నంలో దర్శన మిచ్చి ఆమెకు అంతకు ముందు ఇచ్చిన చాక్లెట్టు వంటిదే ఇచ్చి అంతర్ధాన మయ్యారు. తెల్ల వారిన తరువాత నిద్రలేచి ముఖ ప్రక్షాళనం చేసుకొంటూ రాత్రి స్వామిజీ చాక్లెట్టు ఇచ్చిన సంగతి జ్ఞప్తికి వచ్చి చూడగా మంచం మీద చాక్లెట్టు ఉన్నది. దానిని తీసుకొని కళ్ళ కద్దుకొని నోట్లో పెట్టుకొని చప్పరించగా కొద్ది క్షణాలలోనే ఉపశమనం కలిగింది. ఆమె ఉద్యోగానికి వెళ్ళే సమయం కావటంతో తొందరగా స్నాన మాచరించి ఆఫీసుకు వెళుతుంటే స్వామిజీ సమాధి చెందారు గదా మరి రాత్రి చాక్లెట్టు ఎవ్వరు ఇచ్చారన్న సందేహం కలిగింది. అది స్వప్న మని సరిపెట్టు కుందామంటే స్వప్నంలో ఇచ్చిన చాక్లెట్టు స్వయంగా తన మంచం మీదకు ఎలా వచ్చిందని ఆశ్చర్యపడి అది స్వామి ప్రసాదించిన ప్రసాదమని

గ్రహించెను. తనను నమ్ముకున్న వారిని స్వామిజీ ఏనాడు అలక్ష్యం చేయరని ఈ సంఘటన ఋజువు చెస్తోంది.

స్వామిజీ మహాసమాధి చెందిన తరువాత శివరాత్రి గడచిన రెండు రోజులకు హైదరాబాదు వాస్తవ్యులు శ్రీయుతులు రాజు మరియు రామారావు అనే ఇరువురు భక్తులు షిరిడీకి వెళ్ళి ధునికి నమస్కరించు చుండగా స్వామిజీ మేస్త్రీలు పాస్టరింగ్ చేయటానికి ఉపయోగించే బద్దను భుజాన పెట్టుకొని ద్వారకామాయి నుంచి బుట్టి వాడాకు వెళ్ళుతూ దర్శన మివ్వగా వారు స్వామిని అనుసరించగా బుట్టి వాడాలోనికి ప్రవేశించగానే స్వామిజీ అంతర్థాన మయ్యారు.

షిరిడీలో నివసించే శ్రీమతి పల్లవిషా స్వామిజీ సశరీరులుగా నున్నప్పుడు స్వామిజీతో ప్రతి రోజు గురుస్థానానికి ప్రదక్షణలు గావించెడిది. స్వామిజీ మహా సమాధి చెందిన తరువాత కూడా ప్రదక్షణలు చేస్తుంటే ఈమెకు కొద్ది దూరం ముందుగా స్వామిజీ ప్రదక్షణలు చేయుచు దర్శన మిచ్చెను. స్వామిజీ తన శరీరమును త్యజించినను తన దిన చర్యను ఎప్పటి వలె కొనసాగిస్తున్నా రని ఈ ఘటన తెలియ చేయు చున్నది.

శ్రీ పి.యస్. రావు, షిరిడీ, వారి గృహములో పూజా మందిరంలో దేవతా చిత్ర పటాలతో పాటు స్వామిజీ మరియు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి చిత్రపటాలను పూజించెడి వారు. వీరింటికి వచ్చిన ఒక మహిళ భగవంతునితో సమానంగా స్థానం కల్పించి ఈ మానవ మాత్రులను ఎందుకు పూజిస్తున్నారని రావు గారి అత్త గారైన శ్రీమతి రాఘవరపు రమాదేవి గార్ని ప్రశ్నించగా ఆమె ఆ రెండు పటాలను పూజా మందిరము నుండి తొలగించెను. ఆ నాటి రాత్రే స్వామిజీ ఆమెకు స్వప్న దర్శన మిచ్చి ఆమెను షిరిడీలో గల అన్ని మందిరములను దర్శింప చేసారు. దీనితో ఆమె స్వామిజీ సామాన్య మానవుడు కాదని గ్రహించి ఆ చిత్ర పటాలను తిరిగి యథాస్థానంలో ఉంచి పూజించ సాగెను.

శ్రీమతి పి. భారత లక్ష్మి (ఇంటి నెం.5-65/1, న్యూ మారుతీ నగర్, హైదరాబాద్-500 060) గార్కి 17.2.1996న స్వామిజీ అవధూత నాంపల్లి బాబాతో కలసి స్వప్న దర్శన మిచ్చి "నాకు బట్టలు పెడతావా?" యని అడిగగా ఆమె "పెడతాను స్వామి" యని సమాధాన మిచ్చి స్వామిజీ ఆజ్ఞను శిరసావహించి గురుపూర్ణిమ రోజున మల్లాపూర్ బాబా మందిర ప్రాంగణంలో స్వామిజీ ధ్యాన మందిరంలో నూతన వస్త్రాలను సమర్పించెను.





ఆదిలాబాదులో గల హార్టీకల్చర్ డిపార్టుమెంటులో పని చేస్తున్న రవి గారు కల్లూరు శ్రీ దత్త వెంకట సాయి ఆలయానికి వెళుతూంటే కల్లూరుకు షుమారు 20 కి.మీ. దూరంలో స్వామిజీ చేతిలో రుద్రాక్ష మాలతో దర్శన మివ్వగా అతను ""ఇక్కడున్నారేమిటి స్వామిజీ?" యని అడగగా స్వామిజీ "నా పని నేను చేసుకుంటున్నాను, నీ పని నీవు చేసుకో, కల్లూరు వెళ్ళు" అని సమాధాన మిచ్చారు. ఈ సంఘటన స్వామిజీ సమాధి చెందిన తరువాత జరిగినది.

స్వామిజీ సశరీరులుగా నున్నప్పుడు నిత్యం ద్వారకామాయి ఎదురుగా గల షాపులో నారికేళములు, ధుని సామాగ్రి కొని ధునికి సమర్పించెడి వాడు. స్వామిజీ సమాధి చెందిన షుమారు పది రోజుల తరువాత ఆ షాపులో పని చేసే అన్సర్‌కు స్వప్నములో అగుపించి ఎప్పటి వలెనే కొబ్బరి కాయలు, ధుని సామాగ్రి తీసుకొనెను. స్వప్నమందే అన్సర్ స్వామిజీ సమాధి చెందినారు గదా షాపుకు ఎలా వచ్చారు అని తన మనస్సులోనే అనుకొనెను. వెంటనే స్వామిజీ "నేను ఎక్కడకు వెళ్ళ లేదు ఎప్పుడు ఇక్కడే ఉంటాను అని చెప్పారు".

స్వామిజీ సమాధి చెందినా గాని తన దైనిందన కార్యక్రమములో ఏ విధమైన మార్పు లేదనియు ఆయన సాయి సేవ నిరంతరము నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంటుందని మనము గ్రహించ వలెను.

డా. నాసా అనందరావు గారు విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని హాస్పటల్‌లో ఐ స్పెషలిస్టుగా పని చేయు చుండిరి. వీరికి 11.2.1996 తేది రాత్రి స్వామిజీ స్వప్న దర్శన మిచ్చి అతనికి శ్రీ సాయి లీలామృతమును బహూకరించి దీనిని పారాయణ చేయి నీకు మేలు జరుగుతుంది అని చెప్పినారు. అటు పిమ్మట సాయి బాబా పక్ష పత్రికలో స్వామిజీ మహా సమాధి చెందిన విషయం చదివి ఆశ్చర్య పోయారు ఆనంద రావు గారు.

ఇండోరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మత్తు పానీయములకు బానిసై వ్యాపారములో విపరీతముగా నష్టపోయినాడు. ఇండోరుకు చెందిన కొంత మంది బాబా భక్తుల ద్వార స్వామిని గురించి తెలుసుకొని 1988 లో స్వామిని దర్శించు కొనెను. స్వామిజీ ఆశీర్వాదము వలనను స్వామిజీ సలహాను త్రికరణ శుద్ధిగా పాటించి చెడు అలవాట్ల నుండి బయట పడి వ్యాపారంలో అభివృద్ధి సాధించి సుఖముగా ప్రశాంత జీవనము కొనసాగించెను. స్వామిజీ మహాసమాధి అనంతరము ఏ విపత్తు సంభవించినను స్వామిని ప్రార్థించగా వెంటనే ఆ విపత్తు నుండి బయట పడెడి వాడు. ఈయన స్వామిజీయే నా

గురుదేవులు, నా జీవన గమ్యానికి మార్గదర్శకులు, నన్ను బాబా బాటలో నడిపించిన మహనీయుడు అని చెప్పెను.

స్వామిజీ అంత్య క్రియలు జరిగిన తరువాత ఒక వ్యక్తి స్వామి అస్తికలను దొంగిలించి తన గృహము నందుచుంకొనెను. కొద్ది రోజులు గడచిన పిదప ఆ వ్యక్తికి సద్గురు నిత్యానంద స్వామిజీ స్వప్నములో అగుపించి “ఆ మహనీయుని అస్తికలను ఎందుకు దొంగిలించావు? వాటితో నీ కేమి పని” అని ఆగ్రహముతో ప్రశ్నించగా అతను తన తప్పిదనమును గుర్తించి ఆ అస్తికలను శాస్త్రోక్తముగా గంగా నదిలో నిమజ్జనము గావించెను. ఈ సంఘటన యోగుల మధ్యన గల సంబంధము వారి దివ్య శక్తులను తెలియ జేయు చున్నది.

**స్వామిజీ జీవితంలో కొన్ని ముఖ్య విశేషాలు:**

స్వామిజీ జనన, మహాసమాధి తేదీలు రెండూ 12వ తేదియే (సంఖ్య బాబా ద్వాదశాక్షరి మంత్రం ‘ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి’ ను సూచిస్తోంది) గాక వారి జననం బాబాకు అత్యంత ప్రీతికరమైన శ్రీరామనవమి కావటం మరొక విశేషం. బాబా మహాసమాధి చెందిన మంగళవారమే స్వామిజీ జన్మ దినం. బాబా మహా సమాధి చెందిన తరువాత ఎనిమిది సంవత్సరాలకు స్వామిజీ జన్మించటం మరొక విశేషం కాగా బాబా ప్రథమంగా షిరిడీ పుణ్య భూమి మీద కాలిడిన శతాబ్ది కాలానికి (1953) స్వామిజీ కాలిడినారు. బాబా వలెనే స్వామిజీ కూడ షిరిడీ సరిహద్దులు దాటి వెళ్ళటానికి ఇష్టపడే వారు కాదు.

సాయినాథుడు ఎల్లప్పుడు ***“సబ్‌కా మాలిక్ ఏక్ హై”*** అంటే మన స్వామిజీ ఎల్ల వేళలా ***“సబ్ కా మాలిక్ సాయి”*** అనే వారు. తన జీవితంలోని ప్రతి క్షణాన్ని సాయి సేవకే అంకిత మొనరించిన ఈ పుణ్య చరితుని జీవిత చరితానికి “ముగింపు” ఉండదన్న తలంపుతో ఈ గ్రంథాన్ని మీ పవిత్ర హస్తాల కందించే భాగ్యాన్ని ప్రసాదించిన సాయినాథుని, నా ప్రాణదాత యైన పూజ్య శ్రీ శివనేశన్ స్వామిజీ పవిత్ర చరణాలకు ప్రణమిల్లి, ఈ గ్రంథాన్ని పఠించిన పాఠకులకు వినిన శ్రోతలకు సాయి బాబా మరియు మన పూజ్య స్వామిజీ ఆయురారోగ్యముల నిచ్చి సదా రక్షించు గాక యని ప్రార్థిస్తూ...





# సాయి భజనావళి



నిత్యము పూజ్య శ్రీ శివనేశన్ స్వామిజీ
చావడిలో చేయు భజనలు

# సాయి బావని

అవధూత చింతన శ్రీ గురుదేవ దత్త

జయ ఈశ్వర జయ సాయి దయాళ
తూహీ జగత్‌కా పాలనహార్ ॥ 1
దత్త దిగంబర ప్రభు అవతార్
తేరే బస్ మే సబ్ సంసార్ ॥ 2
బ్రహ్మాచ్యుత శంకర అవతార్
శరణాగతకా ప్రాణాధార్॥ 3
దర్శన్ దేదో ప్రభు మేరే
మిటాదో చౌరాసీ ఫేరే॥ 4
కఫనీ తేరే ఇక సాయా
ఝోలీ కాంధే లటకాయా॥ 5
నీమ్‌తలే తూ ప్రకటగయా
ఫకీర్ బన్‌కే తూ ఆయా॥ 6
కలియుగమే అవతార్ లియా
పతిత పావన తూనె కియా॥ 7
షిరిడీ గాంవ్ మే వాస కియా
లోగోంకే మన్ లుభాలియా॥ 8
చిలంధీ శోభా హాథోంకీ
బన్సీజైసీ మోహన్‌కీ॥ 9
దయా భరిధీ ఆంఖోమే
అమృత ధారా బాతోమే॥ 10
ధన్య ద్వారకా వో మాయి
సమాగయే జహాం సాయి॥ 11
జల్ జాతా హై పాప వహాం
బాబాకీ హై ధునీ జహాం॥ 12
భూలా భటకా మై అంజాన్
దే ముఝుకో తేరా వరదాన్॥ 13
కరుణా సింధు ప్రభు మేరే
లాఖోం బైరే దరపే తేరే॥ 14
అగ్నిహోత్రీ శాస్త్రీకో
చమత్కార్ తూనె దిఖలాయా॥ 15
జీవనదాన శామా పాయా
జహర్ సాంప్‌కా ఉతరాయా॥ 16
ప్రళయకాల్‌కో రోక్‌లియా
భక్తోంకో భయ్ ముక్త్ కియా॥ 17
మహామారీ బేనామ్ కియా
షిరిడీ పురికో బచాలియా॥ 18
ప్రణామ్ తుఝుకో మేరే ఈశ
చరణోమే తేరే మేరా శీష॥ 19
మనకీ ఆస్ పూరీ కరో
భవ సాగర్ సే పార్ కరో॥ 20
భక్త్ భీమాజీ థా బీమార్
కర్‌ఖైరా థా సౌ ఉపచార్॥ 21
ధన్య సాయికీ పవిత్ర ఊదీ
మిట్‌గయా ఉస్‌కీ క్షయ వ్యాధీ॥ 22
దిఖలాయా తూనే విఠల్ రూప్
కాకాజీ కో స్వయం స్వరూప్॥ 23
దాముకో సంతాన దియా
మన్ ఉసకా సంతుష్ట కియా॥ 24
కృపానిధీ అబ్ కృపాకరో
దీన దయాళూ దయా కరో॥ 25
తన్, ధన్, మన్ అర్పణ తుఝుకో
దేదో సద్గతి ప్రభు ముఝుకో॥ 26
మేఘా తుఝుకో న జానా థా
ముస్లిం తుఝుకో మానా థా॥ 27
స్వయంతూ బన్‌కే శివ శంకర్
బనాదియా ఉస్కో కీకర్॥ 28
రోశనాయికీ చిరాగోంసే

తేల్‌కే బదలే పానీసే॥ 29
జిసనే దేఖా ఆంఖో హాల్
హాల్ హువా ఉస్కా బేహాల్॥ 30
చాంద్ భాయి థా ఉలఝున్ మే
ఘెడేకే కారణ మన్‌మే॥ 31
సాయినే కీ ఐసీ కృపా
ఘెడా ఫిర్‌సె వహ పాసకా॥ 32
శ్రద్ధా సబురీ మనమే రఖో
సాయి సాయి నామ్ రటో॥ 33
పూరీ హోగీ మన్‌కీ ఆస్
కర్‌లో సాయి కా నిజధ్యాస్॥ 34
జాన్‌కీ ఖతరా తాత్యాకా
దాన్ దీ అపనీ ఆయుకా॥ 35
ఋణ బయజా కా చుకాదియా
తూనే సాయి కమాల్ కియా॥ 36
పశు పక్షీ పర్ తేరీ లగన్
ప్యార్ మే తూ థా ఉన్‌కే మగన్॥ 37
సబ్ పర్ తేరీ రహం నజర్
లేతే సబ్‌కీ ఖుద్ కీ ఖబర్॥ 38
శరణ మే తేరే జో ఆయా
తూనే ఉస్కో అప్నాయా॥ 39
దియే హైం తూనే గ్యార వచన్
భక్తోంకే ప్రతి లేకర్ ఆన్॥ 40
కణ కణ మే తు హై భగవాన్
తేరీ లీలా శక్తి మహాన్॥ 41
కైసే కరూం తేరే గుణగాన్
బుద్ధి హీన్ మై హూం నాదాన్॥ 42
దీన దయాళు తూ దాతా
హమ్ సబకాతూ హై త్రాతా॥ 43





కృపా కరూ అబ్ సాయి మేరే
చరణో మే లేలో తేరే॥ 44
సుబహ శామ్ సాయి కాధ్యాన్
సాయి లీలా కే గుణగాన్॥ 45
దృఢ భక్తి సే జో గాయేగా
పరమ పదకో వహ పాయేగా॥ 46
హర్ దిన్ సుబహ ఔర్ శామ్ కో
గాయే సాయి బావనీ కో॥ 47
సాయి దేగా ఉసకో సాథ్
లేకర్ ఆపనే హాథ్‌మే హాథ్॥ 48
అనుభవ తృప్తికే బోల్
శబ్ద బడే హై యహ అన్‌మోల్॥ 49
యకీన్ జిసనే మానలియా
జీవన్ ఉసనే సఫల కియా॥ 50
సాయి శక్తి విరాట స్వరూప్
మన మోహక్ సాయికా రూప్॥ 51
గౌర్ సే దేఖో తుమ్ భాయి
బోలో జయ సద్గురు సాయి॥ 52

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జయ్**
**శ్రీ సద్గురు సాయినాధార్పణ మస్తు**
**శుభం భవతు**

## దీనోంకా పాలన కరో

దీనోంకా పాలన కౌను కరే? సాయి రాం బినా దుఃఖ కౌన్ హరే
కౌన్ హై ఆపనా? సభీ పరాయే
బుఝె దియే కౌ కౌజలాయా?
భరీ హుయె గాగర్ సబ్ ఛులె
ఖాలీ గాగర్ కౌన్ భరే
జగ్‌హై ఐసా గోరఖ ధందా
ఔర్ ఉలఝుతా జాతా బందా
కైస్‌జాం ఉ ద్వార తిహారే?
పగ్ పగ్ పర్ బైరే పహారే

# గురు దత్త దిగంబర తవ శరణం

గురదత్త దిగంబర తవ శరణం
దాతా దత్త దిగంబర తవ శరణం ॥గురు॥
అత్రిసుత అనసూయ నందన
యోగిరాజ గురు తవ శరణం ॥గురు॥
శ్రీపాద శ్రీవల్లభ యతివర
నరసింహ సరస్వతి తవ శరణం ॥గురు॥
కార్తవీర్య భుక్తి ముక్తి ప్రద
పింగళ పూజిత తవ శరణం ॥గురు॥
గోరఖ గర్వ వినాశక దాతా
అవధూత నిరంజన తవ శరణం ॥గురు॥
హీన దీన తారక పూరుషోత్తమ
వాసుదేవ గురు తవ శరణం ॥గురు॥
ఏకనాథ జనార్ధన స్వామీ
అక్కలకోట గురు తవ శరణం ॥గురు॥
దాసోపంత్ యవన నృపతారక
సిద్ద సరస్వతీ తవ శరణం ॥గురు॥
పూర్ణ పరాత్పర సగుణ గుణేశ్వర
నిరాకార గురు తవ శరణం ॥గురు॥
నీలకంఠ ఆలంబక నూరో
సాయినాథ గురు తవ శరణం ॥గురు॥
నారాయణ భైరవ మాణిక్ ప్రభు
రంగతార గురు తవ శరణం ॥గురు॥





# సదా భజో గురుదేవ

సదా భజో గురుదేవ గురు బిన నహి కోయి అపనా
నాతే గోతే సబ్ స్వారథ్‌కే నిస్వారథ గురు రాణా
ఆప్ సమాన్ కరే శిష్యన్‌కో దేవే పద నిరబానా ॥సదా॥
కరే లోహ కా పారస సోనా నహి పారస కర జానా
నహీ ఉపమా గరుకీ త్రిభువనమే సాక్షాత్ దేవ పిఛానా ॥సదా॥
పూఛో పండిత్ పోథీ దిఖావే కాజి కితాబ్ కహెన
బోలే అంధా దౌడో పీఛే సబ్ మతలబ్‌మే స్యానా ॥సదా॥
కథే జ్ఞాన్ ఔర్ క్రియా సిఖావే పకడ్ దస్త్ సలూనా
ఘాట్ ఆగమ్ పే ఆప చఢావే జహాఁ సాయికా థానా ॥సదా॥
బినా తేల్ జలే జహాఁ జ్యోతి జగమగ దివసారైనా
ఆరో యామ్ బజే సురబాజా రంగ్ అరంగి జానా ॥సదా॥

# హరిద్వార్, మథురా, కాశీ

హరిద్వార్, మథుర, కాశీ షిరిడీ మే తీర్థ సారే హై
సాయి బాబాకే చరణోమే చారో ధామ్ హమారే హై ॥హరి॥
సబ్ సంతోమే మహాసంత్ సాయి దునియాసే నారేహై
నరనారీ బాలక్ బుఢే సబ్‌హీ కో సాయి ప్యారే హై
మూరఖ్ హో యా అజ్ఞానీ, పండిత్ హో, చాహె విద్వాన్
ఏక్ నజరసే దేఖే సాయి సబ్‌కో దేతె హైఁ వరదాన్
కౌన్ బిగాడ్ సకే ఉసకా జినకే సాయి రఖవాలే హై
సాయి బాబా కే చరణో మే చారోఁ ధామ్ హమారే హై ॥హరి॥
మహారాష్ట్ర కీ పావన భూమి ఇసకో కోటి ప్రణామ్ హై
ఇనకీ మాటీకే కణకణమే లిఖా తుమ్హారా నామ హై
తేరే మందిర్ మే ఆతేతో దునియాసే క్యా కామ్ హై
షిరిడీ హమారా బృందావన హై షిరిడీ గోకుల ధామ్ హై
సాయి హమారే కృష్ణ కన్హైయా, సాయి హమారే రామ్ హై
సాయి బాబాకే చరణోమే చారోఁ ధామ్ హమారే హై ॥హరి॥

# అబ్‌సోంప్ దియా

అబ్ సోంప్ దియా ఇస్ జీవన్ కా సబ్ భార్ తుమ్హారే హాథోమే
సాయినాథ్ తుమ్హారే చరణోమే
హై జీత్ తుమ్హారే హాథో మే ఔర్ హార్ తుమ్హారే హాథోమే
సాయినాథ్ తుమ్హారే చరణోమే ॥అ॥
మేరా నిశ్చయ బస్ అబ్ ఏక్ యహి ఏక్ బార్ తుఝొ పాజాఊ! మై
అర్పణ కర్ దూం దునియా భర్‌కా సబ్ ప్యార్ తుమ్హారే హాథోమే
సాయినాథ తుమ్హారే చరణోమే ॥అ॥
మై జగ్‌మే రహూతో ఐసే రహూం జైసే జల్‌మే కమల కా ఫూల్ రహే
మేరే అవగుణ దోష్ సమర్పిత్ హై కర్‌తార్ తుమ్హారే హాథోమే
సాయి నాథ్ తుమ్హారే చరణోమే ॥అ॥
యది మానవకా మఝె జనమే మిలేతో తబ్ చరణోంకా పూజారి బనూ
ఇస్ పూజక్ కే ఇక్ ఇక్ రగ్‌కా హో హార్ తుమ్హారే హాథోమే
సాయి నాథ్ తుమ్హారే చరణోమే ॥అ॥
ముఝుమే తుఝుమే బస్ భేద్ యహీ మై నర్ హు తుమ్ నారాయణ్ హో
మై హూం సంసార్ కే హాథోమే సంసార్ తుమ్హారే హాథోమే
సాయి నాథ్ తుమ్హారే చరణోమే ॥అ॥
హమ్ తుమ్ కో కభీ నహీ భజతే ఫిర్‌భీ తుమ్ హమ్‌కో నహీత్యజతే
అపకార్ హమారే హాథోమే ఉపకార్ తుమ్హారే హాథోమేం
సాయి నాథ్ తుమ్హారే చరణోమే ॥అ॥

# షిరిడీ కే సాయి బాబా

షిరిడీ కే సాయి బాబా తేరీ దుహాయి బాబా!
తేరే శరణ హమ్ ఆగయే!
వోసాయి హమ్‌తో జనమ, జనమ కాఫల్ పాగయే!
జోభీ ఆయే సబ కుఛ్ పాయే, తేరే నిర్మల ప్యార్‌మే!
వో మన్ మోహక్ మురత్ వాలే, తుమ్ సబసే హో నిరాలే!
దీన దయాళూ హమ్ ఆగయే ॥షి॥
నా మాంగే హమ్ హీరే, మోతీ, నా చాందీ నా సోనా!
హమే తుమ్హారీ కృపా చాహియే, ఔర్ హృదయకా కోనా!
హమ్‌కో హాథ్ దయా కాదేనా, అపనీ ఛాయా మేలేనా!
లీలా తుమ్హారీ జాన్ గయే ॥షి॥





# సాయినాథ్ తేరే చరణోంసే

సాయినాథే తేరే చరణోంసే హమ్ కో న జుదా కరనా ॥సా॥
జబ్ యాద్ తేరీ ఆయె మిలన్‌కీ దయా కరనా
నా మై తాపసీ నా జ్ఞానీ, నా మై యోగీ నా ధ్యానీ
తూ మాత పితా మేరా మై హూం బాలక్ అజ్ఞానీ
సాయి మేరే దోషోంపర్ మత్ ఖయాల్ కియా కర్‌నా ॥సా॥
ఫంస్ కే జగ్ మాయామే జో మై కభీ భరమాం జూఊం
జో భూల్ తుఝొ సాయిజీ ఖోటె రస్తే చలా జాఊం
తో వేగ్ సాయిజీ ఆకె మెహథామ్ లియా కరనా ॥సా॥
మఝుధార్ పడినైయ్యా నహి ఖేవనహరా కోయి
హై ఏక్ సహరా తేరా మేరా నహీ జగ్ మే కోయి
తూ బన్‌కే సకామి సాయిజీ మోహీ పార్ కియాకరనా ॥సా॥
కిత్ ద్వార్ తేరా త్యజకే రాజేశ్వర్ జాఊంమై
ఫరియాద్ కిసే అపనీ రో రోకే సువా ఊంమై
ఆవాజ్ మేరీ సున్‌కే పహచాన్ లియా కరనా ॥సా॥

# సురకీ గతి మై క్యా జానూ?

సరకీ గతి మై క్యా జానూ? ఏక్ భజన్ కరనా జానూ?
అర్థ భజన కీభీ అతి గహరా, ఉసకో భీ మై క్యాం జానూ?
ప్రభు ప్రభు ప్రభు కరనా జానూ, సాయి, సాయి, సాయి కరనా జానూ?
బాబా, బాబా, బాబా కర నా జానూ, నైనా జల భర నాజానూ
గుణ గాయే ప్రభు ఆంఖ్‌న ఖోలే
గుణ గాయే సాయి ఆంఖిన ఖోలే
గుణ గాయే బాబా ఆంఖ్‌న ఖోలే
ఫిర్ క్యోం తుమ గుణ గాతే హో!
మై భోలా మైం ప్రేమ్ దివానా
ఇతనీ బాతే క్యా జానూ!
ప్రభు ప్రభు ప్రభు కరనా జానూ, సాయి, సాయి, సాయి కరనా జానూ?
బాబా, బాబా, బాబా కర నా జానూ, నైనా జల భర నాజానూ

## త్రేతాయుగ మే రామ్, ద్వాపరమే శ్రీకృష్ణ

త్రేతాయుగ మే రామ్, ద్వాపరమే శ్రీకృష్ణ
కలియుగ మే సాయినాథ్ దునియా మే ఆయే
షిరిడీ వాలే సాయి బాబా దరస్ దిఖానా
సాయినాథ్ బాబా ముఝె దరస్ దాఖానరే! దరస్ దిఖానా ॥త్రే॥
జగ మాయాకే జాల్ మేం ఫస్ కే!
తుఝె భూల్ గయా ప్రభు ముఝె క్షమా కరనా!
కరుణా సాగర్ తుమ్‌హో ముఝె మాఫ్ కరనా!
ముఝె మాఫ్ కరనా ॥త్రే॥
సంసార సాగర్‌మే దూబ్ రహీ నైయ్యా!
తుమ బిన మేరా కౌన్ ఖివైయ్యా
జోబీదేనా దేదే ముఝె ఝోలీ ఫసారీ రే
ఝోలీ ఫసారీ రే! ॥త్రే॥
భక్తోం కో రఖనే వాలే కలియుగమే ఆయే
దునియా కా కష్ట మిటానే మేరే బాబా ఆయే
ఆవో మేరే బాయి బహనోం ప్రభు కో పుకారో!
బాబా కో పుకారో ॥త్రే॥

## బాబా బాబా బాబా మేరే

ఆయా శరణు తుమ్హారే బాబా బాబా మేరే!
దేదో దర్శన్ నా తరసావో, భటక రహాహుం ద్వారే ద్వారే ॥బాబా॥
కాశీ, మథురా...అయోధ్య యహీ
పావన చరణోం కా దర్శన్ యహీం
శీష్ నవావో ఇన్ చరణోం మే బోలే బాబా మేరే ॥బాబా॥
మై అబ్ నహీం జావుంగా కహీం!
అర్పణ కరుదూంగా జీవన్ యహీం!
పాస్ బులావో నా తరసావో సాయి బాబా మేరే! ॥బాబా॥
సుఖమే దుఃఖ మే యహీ రహూంగా!
చరణ కమల్ ధో, ధోకే పివూంగా
దేర్ కరోనా, పాస్ బులావో సాయి బాబా మేరే! ॥బాబా॥





## జగ చార్ దినోం కామేలా హై

జగ చార్ దినోం కా మేలా హై
జగ చార్ దినోం కా మేలా హై
మన్ మే న కభీ అభిమాన్ కరో
జగచార్ దినోం కా మేలా హై ॥1॥
ఆజావో సాయి గుణ గాన్ కరో
జగ చార్ దినోం కా మేలా హై
మన్ మే న కభీ అభిమాన్ కరో
జగ చార్ దినోం కా మేలా హై ॥2॥
కోయి ఆజ్ చలే కోయి కల్ చలే
కోయి గఠరీ బాంద్ సిధార్ చలే
కోయి ఖడా తైయార్ అకేలా హై
జగ చార్ దినోం కా మేలా హై ॥3॥
మాత పిత సుత బాంధవ సారే
ధన దౌలత్ జో లగతే ప్యారే
తేరే సంగ చలేన అధేలా హై
జగ చార్ దినోం కా మేలా హై ॥4॥
ఏక్ పల్ కీ భీ తుఝె నహీ ఖబర్
న జానే పడేగా జానాకి ధర్,
సబ్ చలా చలీకా ఖేలా హై
జగ చార్ దినోం కా మేలా హై ॥5॥
మానవ తన్ నహీ బర్‌బాద్ కరో
యోగేశ్వర్ సాయికో యాద్ కరో
సాయి భజనే కా యహీ బేలా హై
జగ చార్ దినోం కా మేలా హై ॥6॥

# కృష్ణగోవింద గోపాల గాతే చలో

కృష్ణ గోవింద గోపాల గాతే చలో
మన్ కే విషయోం కే విషసే హటాతే చలో ॥కృ॥
ఇంద్రియోంకే న ఘోడే విషయమే అడే
జో అడే భీతో సంయమకే కోడే పడే
తన్ కే రథకో సుపథ పర్ చలాతే చలో ॥కృ॥

నామ్ జపతే రహో, కామ్ కరతే రహో
పాప్‌కీ వాసనావోం సే దరతే రహో
సద్గుణోంకా పరమ ధన్ కమాతే చలో ॥కృ॥

లోగ్ కహతే హై భగవాన్ ఆతే నహీం
రుక్మిణీ కీ తరహా హమ్ బులాతే న హీం
ద్రౌపదీ కీ తరహ ధున్ లగాతే చలో ॥కృ॥

లోగ్ కహతే హై భగవాన్ ఆతే నహీం
భిల్లనీ కీ తరహ హమ్ బులాతే నహీం
శాక్ ప్రేమీ విదుర సమ్ జిమాతే చలో ॥కృ॥

దుఃఖమే తడపో నహీ సుఖమే భూలో నహీ
ప్రాణ్ జాయే మగర్ ధర్మ భూలో నహీ
ధర్మధన్ కా ఖజానా లుటాతే చలో ॥కృ॥

వక్త ఆయేగా ఐసా కభీ న కభీ
హమ్ భీ పాయేంగే ప్రభుకో కభీన కభీ
ఐసా విశ్వాస్ మన్ మే జమాతే చలో! ॥కృ॥





# సాయి శిరడి వాలే

హమతో చరణోం మే ఆయే తుమ్హారే సాయి శిరడి వాలే
తుమకో కహతే బాబా సాయీ, సబకో అఘటిత మాయ దిఖాయా
తుమనే పానీసే దీప జలాయే, సాయి శిరడి వాలే ॥హ॥

సాయీ అజవై తుమ్హారీ రచనా
ఉదరా రోగియా భక్త దివానా
అపనీ భక్తోంకే భవ బంధ చోడే
సాయి శిరడి వాలే ॥హ॥

తుమ్హారీ చరణోం మే జో కోయీ ఆయా
ఉసకా సబహీ కష్ట (దుఃఖ) మిటాయా
ఆపనే బచ్చోం కే కైసే సంభాలే
సాయి శిరడి వాలే ॥హ॥

కభీన ఛోడా అపనా ఠికానా
ఫిరభీ ఘట ఘట భక్తోం కో జానా
అపనే సేవక్ చురవుస నికాలే
సాయి శిరడి వాలే ॥హ॥

తుమహో సునలే అరజి హమారీ
హమకో హైరాన్ జటజడ వైరీ
భక్తీ రసకే పిలాదో ప్యాలే,
సాయి శిరడి వాలే ॥హ॥

సాయీ భక్తహై బాబా సాయీ
మాంగో సద్గురు సేవ మిఠాయి
తుమహో స్వామి దయాళు అకేలే ॥హ॥

# సాయీ కా గుణ గాన్

కరో రే మన సాయీ కా గుణగాన్
భజో రే మన బాబా కా దివ్య నామ్ ॥కరో॥
జానే కహా సే వో షిరిడి ఆయా
మందిర్ మజీద్ ఏక్ బనాయా
క్యా హై వో ఇన్‌సాన్ ॥కరో॥
దేవ హై వో యా సాక్షాత్ మహాదేవ
సద్గురు హై యా సాక్షాత్ దత్తా
క్యోంన కహై భగవాన్ ॥కరో॥
జిసనే జోభీ చాహ మన్‌మే
వోహీ ఉసనేపాయ క్షణమే
ధరమ కరమ కళ్యాణ్ ॥కరో॥
జీతే జీ హీ సబకో తారా
ఐసా హై వో సాయీ హమారా
కరలో నిజదిన ధ్యాన్ ॥కరో॥
భవసాగర్ కా వో హి కివయ్యా
దేదో ఉసకే హాథో మే నెయ్యా
సమ జాయే తూఫాన్ ॥కరో॥





# సాయీ కీ మహిమా

సాయీ కీ మహిమా హై అపరం పార్
బాబా కీ మహిమా హై అపరం పార్
తూ హరదమ గాయేజా, తూ హమదమ గాయేజా ॥సా॥

సాయి నాథ్ సే బడకర్ కోయీ
ఔర్ నహీ హై దూజా
సాయి (బాబా) కో ఇస్ దిల్ మే బిఠా కరు
కరులో ఉసకీ పూజా, తూహర దమగా యేజా ॥సా॥

(నామ హై) కి తనాసుందర్ దో అక్షర్ కా నామ్ హై సాయి
(బాబా) ప్యారా కరలో భరోసా ఏకదిన్ తుఝుకో
మిల్ జాయేగా కినారా, తూ హరదమ్ గాయే జాతూ ॥సా॥

సుమిరణ కరతే జో సాయీ కా (బాబా)
వో హి సభీ సుఖ పాతే
శిరడి వాలే కి తనా దయాళూ
కామ్ సభీ బన్ జాతే, తూ హరదమ్ గాయే జాతూ ॥సా॥

శీఘ్ర అపనే భక్తి భావసే
సాయి (బాబా)కో కరలో రాజీ
తో ఫిర్ సమజో ఇస్ జీవన్ కీ
జీత్ గయే హో బాజీ తూ హరదమ్ గాయే జాతూ ॥సా॥

# భజనోం కీ ధూమ్

సాయీ తుమ్హారే భజనోం కీ ధూమ్ మచీ హై ఘర్ ఘర్ మే
బాబా తుమ్హారే భజనోం కే ధూమ్ మచీ హై ఘర్ ఘర్ మే
బస్ తుమహీరే తుమ ఆతే హోన జర హర్ ఏక్ ప్రాణీ అంతరమే ॥సా॥

కోయి కహతా ముజే శ్రీరామ మిలే, కోయీ కహతా ముజే రహీమ్ మిలే
కోయి కహతా ముజే శ్రీకృష్ణ మిలే, కోయి కహతా ముజే కరీమ్ మిలే
మైతో బికారీ బన్ కరకె ఆతేహై తుమ్హారా మందిర్ మే ॥సా॥

కోయి కహతా హై మహాసంత్ మిలే, కోయి కహతే హై భగవంత్ మిలే
కోయి కహతా హై శ్రీ దత్త మిలే, కోయి కహతే హై హనుమంత్ మిలే
ఝూమ్ ఐసీ రహీ దునియా మాన్, తుఫాన్ ఉఠావో సాగర్ మే ॥సా॥

గోదు కిస్‌కీ భరిదీ తుమనే, ఔర్ కిసీకీ భరీదీ ఝోలీ
ధన్య హువా వో ప్రాణి జిసపర్ తుమనే రహమ్ నజర్ హై కరదీ
హర్ ప్రాణీ తుమ్హారే గుణ గాతే ఆ కరకే ఖుషీ కీ లహర్ మే ॥సా॥

ఏక్ భకత్ అబ్ షిరిడి ఆకర్ చరణోంసే హి లిపట జాయే అబ్
ఏక్ తుమ్హారే నామ్ బినా కోయీ శీర్ష సుజానా దిల్ కో బాయి
పూలోంకి జగా హై శబ్ద భరే ఇస్ అదర్ కీ చాదర్ మే ॥సా॥





# హారతి

ఓం జయ జగదీశ హరే! సాయి జయ జగదీశ హరే
భక్త జనోంకే సంకట! దాస జనోంకే సంకట్
క్షణమే దూర్ కరే ఓం జయ జగదీశ హరే
జో ధ్యావే ఫల్ పావే దుఃఖ మిట్ సే మన్ కా
సాయి దుఃఖ మిట్ సే మన్ కా
సుఖ సంపత్తి ఘర్ ఆవే (2)
కష్ట మిటే తన్ కా ॥ఓం॥

మాత పితా తుమ్ మేరే, శరణు పడు మై కిస్ కీ
సాయి శరణు పడు మై కిస్ కీ
తుమ బిన ఔర్ న దూజా (2)
ఆశ కరూ మై కిస్ కీ ॥ఓం॥

తుమ పూరణ పరమాత్మ – తుమ అంతర్యామి
సాయి తుమ అంతర్యామి
పారబ్రహ్మ పరమేశ్వర (2)
తుమ్ సబ్ కే స్వామి ॥ఓం॥

తుమ కరుణాం కే సాగర్ – తుమ పాలన కరతా
సాయి తుమ పాలన కరతా
మైమూరఖ ఖలు స్వామి (2)
మై సేవక్ తుమ స్వామి, కృపా కరో భరతా ॥ఓం॥

విషయ వికార మిటావో పాప హరో దేవా
సాయి పాప హరో దేవా
శ్రద్ధా సబూరీ బడావో (2)
సంతన్ కీ సేవా ॥ఓం॥

తన్, ధన్, మన్ సబహై తేరా సాయి సబ్ కుచ్ హై తేరా
తేరా తురుఖుకో అర్పణ క్యాలాగే మేరా ॥ఓం॥

# అంకితం



పూజ్యాయ ధర్మపాదాయ
సాయీ తత్త్వవ్రతాయచ।
సదా శివాయ శాంతాయ
శ్రీ శివనేశన్ స్వామీ గురుభ్యోనమః





సాయి సేవక్
శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము

కాపీలు : **5000**

ద్వితీయ ముద్రణ : **జూలై, 2006**

వెల :

ప్రతులకు :

**పెసల సుబ్బరామయ్య**

గొలగలమూడి

నెల్లూరు జిల్లా

ప్రకాశకులు :

**పెసల సుబ్బరామయ్య**

(సర్వహక్కులు ప్రకాశకులవే)

డి.టి.పి & కవర్ పేజి

**M.S.R. GRAPHICS**

మచిలీపట్నం - 521 001.

సెల్ : 08672-221237

ప్రింటింగ్ :



Courtesy : Zarine Taraporevala
Mumbai / Sivanesan Swamiji Gurukulam,
Sivanesan Nagar, SHIRIDI - 423 109



చావడిలో స్వామీజీ